మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 75 • పేజీలు:12+16 • వెల: రూ.5 | మంగళవారం • 13-2-2018 | www.manamnews.com | /manamnews



కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా కంబర్

20 ఏండ్ల తర్వాత మూడో కన్నడ వ్యక్తిగా రికార్డు

7లో..




48 గంటల్లో రెండో ఉగ్రదాడి

శ్రీనగర్‌లో తెగబడ్డ తీవ్రవాదులు..

సీఆర్పీఎఫ్ క్యాంపులో జవాను మృతి..

సున్జవాన్‌లో మూడో రోజూ ఆపరేషన్

ఇదీ లోకం!




తెలంగాణ ప్రభుత్వం గ్రేట్ .. ప్రజలకే కాదు.. మనకు కూడా మేలు జరిగే పథకాలు అమలు చేస్తున్నారు స్వామీ..!

విశ్వనగరంగా మహానగరం

hmda

హెచ్ఎండీఏ టార్గెట్ 2018.. సరికొత్త ప్రణాళికలు రెడీ



నాడు కటకటలాడిన ఖజానా.. నేడు కళకళలాడుతుంది

నెలకు 15 కోట్లున్న ఆదాయం నేడు 50కోట్లకు చేరింది

అప్పులు తీసుకునే స్థితి నుంచి అప్పులిచ్చే స్థాయికి...

'లాండ్ పూలింగ్'తో మరింత ఆదాయం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12(మనం ప్రతినిధి):

రెండున్నరేండ్ల కింద ఉద్యోగులకు జీతాలివ్వడానికి కూడా పైసల్లేక కటకటలాడిన హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ ఖజానా ఇప్పుడు లక్ష్మీకళతో కళకళలాడుతుంది. సంస్కరణలు ఫలితాలు చూపుతూ హెచ్ఎండీఏకు ఆదాయాన్ని పెంచుతున్నాయి. దీనితో సరికొత్త ప్రణాళికలతో విశ్వనగర నిర్మాణమే లక్ష్యంగా వడివడిగా అడుగులు వేస్తోంది. అవినీతి ముద్ర, అప్పుల భారంతో కునారిల్లిన హెచ్ఎండీఏ పరిస్థితిని చక్కదిద్దడంలో ఆ సంస్థ కమిషనర్ టీ.చిరంజీవులు కృషి ఎంతో ఉంది. మహానగరంలో భూముల వేలమంటే వినిపించేది హెచ్ఎండీఏ(పాత హుడా)పేరు. ఉమ్మడి రాష్ట్రంలో మిగతా 6లో..



హరహర మహాదేవ!

శివరాత్రికి శివాలయాలు ముస్తాబు

రాజన్న ఆలయంలో మొదలైన వేడుకలు

కురవి బ్రహ్మోత్సవాలకు అంకురారోపణ 6లో..

సీఎం కేసీఆర్ శివరాత్రి శుభాకాంక్షలు

స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రపంచ రికార్డు




15 వేల మంది రోడ్లు ఊడ్చి.. గుజరాత్ రికార్డును తుడిచేశారు



6లో..

స్నేహ సంబంధాలకు ఊపు



ఒమన్‌లో పర్యటనపై ప్రధాని మోదీ..

రెండు దేశాల మధ్య 8 ఒప్పందాలు

125 ఏళ్లనాటి శివాలయంలో ప్రార్థనలు 7లో..



6లో..

ముప్పేట దాడి

ఒకేసారి మూడు రకాల జ్వరాలు

మలేరియా.. డెంగ్యూ.. చికన్‌గున్యా

చికిత్స పద్ధతులపైనా ఇంకా అస్పష్టత

దోమల నియంత్రణే ముఖ్యమని సూచన

గర్భిణి హత్య కేసులో వీడిన మిస్టరీ

- కుటుంబ కలహాలే దుశ్చర్యకు కారణం
- పోలీసుల అదుపులో 'బొటానికల్' నిందితులు

హైదరాబాద్/గచ్చిబౌలి, ఫిబ్రవరి 12(మనం న్యూస్): హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన గర్భిణి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. కుటుంబసభ్యులే మహిళను హత్య చేసి శరీరాన్ని గ్రానైట్ కోసే బ్లేడ్‌తో ముక్కలుగా చేసి రోడ్డు మీద పడేసినట్లు తేలింది. ఈ కేసులో నిందితులను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు ఓ మహిళను హత్య చేసి శరీరాన్ని ముక్కలుగా చేసి గోనె సంచిలో పెట్టి వాటిని నగరంలోని కొండాపూర్ బొటానికల్ గార్డెన్ వద్ద పడేశారు. గత నెల జనవరి 29వ తేదీ ఉదయం పారిశుధ్య కార్మికులు ఆ సంచులను గుర్తించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. రెండు వారాలుగా ఈ కేసును వివిధ కోణాల్లో దర్యాప్తు చేసిన పోలీసులు సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా నిందితులును గుర్తించారు. 29వ తేదీ ఉదయం మూడు గంటల సమయంలో మరణించిన మహిళ మరిది, అత్త మృతురాలి శరీర భాగాలున్న గోనె సంచిని బొటానికల్ గార్డెన్ వద్ద పారవేయడాన్ని గుర్తించారు. వారి కోసం విచారించగా, హైదరాబాద్ మాదాపూర్ ప్రాంతంలోని సిద్ధిఖీనగర్ వాసులుగా తేలింది. ఈ కేసులో హతురాలి మరిది అమర్‌కాంత్ ఝూను ప్రధాన నిందితుడిగా పేర్కొన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బిహార్‌కు చెందిన అమరకాంత్ ఝూ కుటుంబం గత కొంత కాలంగా సిద్ధిఖీనగర్‌లో నివాసం ఉంటోంది. అమర్ స్థానికంగా ఓ బార్‌లో పని చేస్తున్నాడు.



కుటుంబంలో తలెత్తిన విబేధాల కారణంగా కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. గత నెల 28వ తేదీన అమర్‌కాంత్ ఝూ కుటుంబసభ్యులు గర్భిణి అయిన పెద్ద కోడలిని కొట్టి హతమార్చారు. ఆమెను ఎవ్వరూ గుర్తుపట్టకూడదని ముఖాన్ని ఛిద్రం చేశారు. అనంతరం గ్రానెట్ రాళ్ల కోసే బ్లేడ్‌తో ఆమె మృతదేహాన్ని ముక్కలు చేసి ప్లాస్టిక్ సంచుల్లో వేశారు. కొండాపూర్ బొటానికల్ గార్డెన్ వద్ద 29వ తేదీ తెల్లవారుజామున మూడున్నర గంటల ప్రాంతంలో ద్విచక్రవాహనంపై తీసుకొచ్చి పడేశారు. సంచులను గుర్తించిన పారిశుధ్య సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టంలో మృతురాలు ఎనిమిదినెలల గర్భిణిగా తేలింది. మరణించిన మహిళకు సంబంధించిన వివరాలు, నిందితుల వివరాలు తెలియజేస్తే లక్ష రూపాయల నజరానా ఇస్తామని సైబరాబాద్ సీపీ సందీప్ శాండిల్య ప్రకటన కూడా చేశారు. మరోవైపు మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్, నేర విభాగం డీసీపీ జానకి షర్మిళ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నిందితుల కోసం వేట సాగించాయి. ఘటనా స్థలంలో లభ్యమైన ఆధారాల ద్వారా కొన్ని బృందాలు నిందితుల కోసం ఆరా తీస్తుండగా, మరికొన్ని బృందాలు సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితుల కోసం గాలించాయి. నిందితులను గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా విషయం బయటపడింది. అంతే కాక మృతురాలి భర్త, మరిది, అత్తను నిందితులుగా గుర్తించిన పోలీసులు, తొలుత అత్తను అరెస్టు చేయగా, ప్రధాన నిందితుడు, హత్య అనంతరం బిహార్ పారిపోయిన మృతురాలి మరిది అమర్‌కాంత్‌ను సోమవారం అరెస్టు చేశారు. ఈ కేసును సైబరాబాద్ పోలీసులు పకడ్బందీగా విచారిస్తుంటే, మీడియాకు లీకులు ఇచ్చారన్న కారణంతో ముగ్గురు కానిస్టేబుళ్ళను సైబరాబాద్ కమిషనరేట్‌కు అటాచ్ చేసినట్లు సమాచారం.



నగరంలో హవాలా ముఠా గుట్టురట్టు

- రూ.1.40 కోట్లు స్వాధీనం: డీసీపీ వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 12: గుట్టుచప్పుడు కాకుండా హవాలా లావాదేవీలు నిర్వహిస్తున్న ముఠాను హైదరాబాద్ ఉత్తర మండల టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. డీసీపీ రాధాకిషన్ నేతృత్వంలో చేపట్టిన తనిఖీలలో అక్రమంగా రవాణ చేస్తోన్న రూ.1,40,80,000లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుజరాత్ నివాసి జయేష్ కుమార్ పటేల్ అబిడ్స్‌లో సిబ్బందిని నియమించుకుని మరీ ఈ హవాలా వ్యాపారం నడుపుతున్నాడు. రూ.కోటి మార్పిడికి 60 నుంచి 80 వేలు తీసుకుంటూ సంవత్సరానికి 200 కోట్ల హవాలా వ్యాపారం చేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నగదు అక్రమ తరలింపునకు ద్విచక్రవాహనాలు వాడుతున్నారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు అబిడ్స్‌లోని జయేష్ కుమార్ కార్యాలయంపై దాడిచేసి నగదు, రెండు ద్విచక్రవాహనాలు, 6 మొబైల్‌ఫోన్లు, డబ్బు లెక్కించే యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు.



తక్కువ ఖర్చుతో చికిత్స: జోగు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (మనం ప్రతినిధి): తక్కువ ఖర్చుతో ప్రాణాంతక వ్యాధులకు చికిత్స అందించేందుకు వివిధ పరిశోధనలు జరుగుతున్నాయని, అందుకు 10 ప్రాజెక్టులకు బాధ్యతలను అప్పగించినట్టు అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగు రామన్న తెలిపారు. సోమవారం సచివాలయంలో తన కార్యాలయంలో జరిగిన రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ మధ్యంతర సమీక్షా సమావేశంలో ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుతం అత్యంత ఖరీదుగా మారిన వైద్య పరీక్షలను ప్రజలకు చౌకగా అందించేందుకు శాస్త్ర సాంకేతిక శాఖ తరఫున కృషి చేస్తున్నట్టు ఆయన తెలిపారు. కేన్సర్, కిడ్నీ, మైగ్రేన్, బీ-తలసేమియా వంటి ప్రాణాంతక వ్యాధులకు తక్కువ ఖర్చుతో వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. పరిశోధనల కోసం రూ.50 లక్షలు మంజూరు చేశామన్నారు. తొలి విడతగా రూ. 25 లక్షలు విడుదల చేశామన్నారు. స్థానిక పరిశోధన ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. వాన నీటిని భూగర్భ జిల్లాలోకి డైరెక్ట్‌గా కలపడం ద్వారా నల్గొండ జిల్లాలో ఫ్లోరిన్ శాతాన్ని క్రమంగా తక్కువగా ఉండేలా చర్యలు తీసుకున్నట్టు శాస్త్రవేత్తలు తెలిపారు. జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా మర్రిగూడ మండల పాఠశాలలో దీన్ని ప్రయోగాత్మకంగా అమలు చేసినట్టు తెలిపారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లలో రేడియేషన్ గుర్తించడం ప్రాజెక్టు మరో లక్ష్యమని మంత్రి తెలిపారు. జీఐఎస్ ద్వారా రోడ్డు ప్రమాదాలను క్రోడీకరించి ఈ మెసర్మెంట్ బుక్‌ను తయారు చేయడం కూడా ప్రాజెక్ట్‌లో లక్ష్యమన్నారు. గతేడాది డిసెంబర్ నెలాఖరులో గుజరాత్‌రాష్ట్రం అహ్మదాబాద్‌లోని సైన్స్ సిటీలో జరిగిన జాతీయ స్థాయి కార్యక్రమంలో తెలంగాణకు చెందిన ఇద్దరు బాల శాస్త్రవేత్తలు అరీబా అయ్యెన్, మహేందర్‌రెడ్డిలు అద్భుతమైన ప్రతిభ కనబర్చి జాతీయ బృందానికి ఎంపికయ్యారని, అందుకు వారిని అభినందిస్తున్నట్టు తెలిపారు.

జూబ్లీహిల్స్‌లో భారీ పేలుడు



హైదరాబాద్, ఫిబ్రవరి 12: భారీ పేలుడుతో జూబ్లీహిల్స్ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. రోడ్ నంబర్ 48లో ఓ భవన నిర్మాణ స్థలం లో సోమవారం మధ్యాహ్నం పేలుడు సంభవించింది. ఓ బడా పారిశ్రామికవేత్తకు చెంది న ఈ స్థలంలో భవనం నిర్మిస్తున్నారు. బండరాళ్లను తొలగించేందుకు భారీస్థాయిలో జిలెటిన్ స్టిక్స్ వినియోగించారు. ఈ క్రమంలో భారీ శబ్దం తో పేలుడు సంభవించడంతో స్థానికులలో ఆందోళన నెలకొంది. ఏం జరుగుతుందో తెలీక పరుగులు తీశారు. పేలుడు ధాటికి సమీపంలోని ఓ ఇల్లు కుప్పకూలింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు.

అన్ని జిల్లాల్లో ఆనందాశ్రమాలు

- త్వరలోనే ప్రారంభం.. డీజీ వీకే సింగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 12(మనం ప్రతినిధి): భాగ్యనగరంలో చేపడుతున్న బిచ్చగాళ్ల పునరావాస కార్యక్రమాన్ని త్వరలోనే అన్ని జిల్లాలకు విస్తరిస్తామని జైళ్లశాఖ డీజీ వికె సింగ్ తెలిపారు. సోమవారం, ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని 3749మంది బిచ్చగాళ్లను చంచల్‌గూడ, చర్లపల్లి జైళ్లలో ఏర్పాటుచేసిన ఆనందాశ్రమాలకు తరలించామని చెప్పారు. వీరిలో 3526 మందిని మళ్లీ బిచ్చమెత్తబోమన్న హామీతో వదిలేశామన్నారు. నగరంలో బిచ్చగాళ్ల సంఖ్య క్రమంగా తగ్గుతోందని, త్వరలోనే బెగ్గర్స్ ఫ్రీ హైదరాబాద్ సిద్ధిస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఖైదీలలో చిన్నచిన్న నేరాలు చేసినవారే ఎక్కువగా ఉంటున్నారని, తాము చేపడుతున్న కార్యక్రమాలతో వారిలో మార్పు వస్తోందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని 9 సబ్ జైళ్లను మూసివేశామని, మరో 5 మూసివేతకు సిద్ధంగా ఉన్నాయన్నారు. వీటిల్లో వీలునుబట్టి వికలాంగులకు, మానసిక రోగులు, అనాథ మహిళలకు ఆవాసం కల్పిస్తామన్నారు. ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని సింగ్ తెలిపారు. ఖైదీలలో మానసిక పరివర్తన కలిగించడం, నైపుణ్య శిక్షణ తదితర సేవ కార్యక్రమాల ద్వారా నేరాల సంఖ్యను ఏటా 10 శాతం తగ్గించడమే తమ లక్ష్యమన్నారు.

'ఉపాధిహామీ'తో విప్లవాత్మక మార్పు

- పథకంపై టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం
- రాష్ట్రంలో బకాయిలు పేరుకుపోతున్నాయి
- పనిచేసి పస్తులుండాల్సి వస్తోంది
- ఐఎన్టీయూసీ శిక్షణ శిబిరంలో ఉత్తమ్
- ఉపాధి సిబ్బందికి శిక్షణ ప్రారంభం



హైదరాబాద్, ఫిబ్రవరి 12(మనం ప్రతినిధి): యూపీఏ చైర్మన్ సోనియాగాంధీ హయాంలో ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకం గ్రామీణ ప్రాంతాల్లో విప్లవాత్మక మార్పుకు నాంది పలికిందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ, ఐటీయూసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యాలయంలో తెలుగు రాష్ట్రాల ఉపాధి మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇతరత్రా సిబ్బందికి ఏర్పాటు చేసిన ఐదు రోజుల శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీని నిర్వీర్యంచేసేలా టీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఉపాధి చట్టంలో పనిచేసిన 15 రోజుల్లోగా వేతనాలు చెల్లించాలని ఉండగా.. రాష్ట్రంలో మాత్రం నెలల తరబడి బకాయిలు పేరుకుపోతున్నాయని విమర్శించారు. సిబ్బంది సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పనిచేసి పస్తులుండే దుస్థితి రాష్ట్రంలో నెలకొందని ఉత్తమ్ ఆవేదన వ్యక్తంచేశారు. అడిగిన వారందరికి పనికల్పించటంలో టీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పేదలందరికి పనికల్పించే లక్ష్యంతో నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని తీసుకువస్తే.. నేడు ప్రధాని మోదీ నిధులలో కోత విధిస్తున్నారని ఆరోపించారు. ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి రామచంద్ర కుంతియా మాట్లాడుతూ ఎన్డీఏ సర్కార్ అన్ని రంగాల కార్మికులను మోసం చేస్తోందని విమర్శించారు. ట్రేడ్ యూనియన్లను విస్మరించే ప్రభుత్వాలకు పుట్టగతులుండవని హెచ్చరించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రత్యేక చొరవ తీసుకుంటుందని తెలిపారు. ఎన్నికలలో కార్మికుల ప్రభావం కీలకమన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం ఐఎన్‌టీయూసీ కృషి చేయాలని కోరారు.

కార్మిక శక్తే కీలకం: సంజీవరెడ్డి

దేశ జనాభాలో 40 శాతం మంది కార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారని ఐఎన్‌టీయూసీ ఆలిండియా అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ఉపాధి హామీ చట్టంలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న వారిని సంఘటితం చేసేలా కృషి చేస్తున్నామన్నారు. చట్టంపై వారికి అవగాహన కల్పించేలా ఐదు రోజుల పాటు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని తెలిపారు. అసంఘటిత రంగంలోని కార్మికుల సంక్షేమం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కార్మికశక్తి ఐక్యతగా ఉంటే కేంద్రంలో, రాష్ట్రంలో కోరుకున్న ప్రభుత్వాలు ఏర్పాడతాయన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా కార్మికులు ఎదిగేలా ఐఎన్‌టీయూసీ/ఐటీయూసీ తనవంతు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సింగపూర్‌కు చెందిన షోయాయోషిదా, బ్రస్సెల్స్‌కు చెందిన స్టీవ్ బెండిక్ట్, ఐన్‌టీయూసీ ఛీఫ్ వైస్‌ప్రసిడెంట్ జనక్‌ప్రసాద్, త్యాగరాజన్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సునీతా లక్ష్మారెడ్డి తల్లిని పరామర్శిస్తున్న ఉత్తమ్

ఆ జాబితా నిజం కాదు..నమ్మొద్దు: ఉత్తమ్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థుల జాబితా అంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి ఖండించారు. పార్టీ ఎలాంటి ఆశావాహుల జాబితాను రూపొందించలేదన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఈ జాబితాను నమ్మొద్దని ఆయన కోరారు. ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలను గందరగోళానికి గురిచేసేందుకే ఎవరో కావాలనే ఈ జాబితాను సర్క్యులేట్ చేస్తున్నారన్నారు. అధికార పార్టీకి లబ్ధి చేకూర్చేందుకే ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



15న ఢిల్లీకి హరీశ్‌రావు

- సాగునీటి పథకాలపై చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (మనం ప్రతినిధి) : కేంద్ర జలవనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15న జరుగనున్న సమావేశానికి రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్నారు. ఈమేరకు కేంద్ర జలవనరుల శాఖ నుంచి మంత్రికి ఆహ్వానం అందింది. ఈ సమావేశంలో ప్రధానమంత్రి కృషి సంచాయ్ యోజన కింద చేపట్టనున్న ప్రాజెక్టులపై చర్చ జరుగనుంది. 99 సాగునీటి పథకాలు, ఇందుకు అవసరమైన నిధులపై సమావేశంలో చర్చించనున్నారు. సాగునీటి పథకాలకు కేంద్రం నుంచి మరిన్ని నిధులను రాబట్టేందుకు సంబంధిత శాఖాధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లనున్నారు.

నేరస్తుల సర్వే నిలిపేశాం..

- హైకోర్టుకు వెల్లడించిన ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 12: సకల నేరస్తుల సమగ్ర సర్వే ఉత్తర్వులు అమలు చేయడంలేదని తెలంగాణ సర్కార్ హైకోర్టుకు స్పష్టంచేసింది. ఈమేరకు తెలంగాణ డీజీపీ జారీచేసిన ఆదేశాలను అన్ని జిల్లాల పోలీసులకు పంపించినట్లు తెలిపింది. సకల నేరస్తుల సమగ్ర సర్వే కోసం డీజీపీ ఇచ్చిన సర్క్యులర్‌ను నిలిపేసినట్లు మెమో కూడా జారీచేశారని తెలంగాణ అడ్వకేట్ జనరల్ డి.ప్రకాష్‌రెడ్డి సోమవారం హైకోర్టుకు విన్నవించారు. నేరస్తుల సర్వే పేరుతో అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారంటూ టీడీపీ గ్రేటర్ హైదరాబాద్ బీసీ సెల్ చైర్మన్, మాజీ కార్పొరేటర్ బద్రీనాథ్ యాదవ్, పూర్వపు పాలమూరు జిల్లా కల్వకుర్తి పోలీస్ స్టేషన్ అధికారులు వేధిస్తున్నారని అబ్దుల్ హఫీజ్ వేరువేరుగా దాఖలు చేసిన రిట్ పిటిషన్ల విచారణ ముగిసినట్లుగా న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయి ప్రకటించారు.

టీఆర్టీ వాయిదా కోసం 'చలో ఉస్మానియా'

- కోదండరాం మద్దతు కోరిన అభ్యర్థులు

హైదరాబాద్, ఫిబ్రవరి 11(మనం ప్రతినిధి): టీఆర్‌టి వాయిదా వేయాలని కోరుతూ నిరుద్యోగ అభ్యర్థులు చలో ఉస్మానియాకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 15న పీజీఆర్ఆర్‌సీడీఈ సెమినార్ హాల్‌లో టీఆర్టీపై చర్చించనున్నట్లు తెలంగాణ నిరుద్యోగ విద్యార్థి జేఏసీ ఒక ప్రకటనలో తెలిపారు. టీఆర్టీ వాయిదాపై తమ ఆందోళనకు మద్దతివ్వాలంటూ తెలంగాణ నిరుద్యోగ జేఏసీ విద్యార్థులు.. టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంను సోమవారం కలిశారు.

నయీం.. సర్కారీ గూండా!

- బాధితులకు న్యాయం చేయాలి
- రౌండ్‌టేబుల్‌లో వక్తల డిమాండ్
- పాల్గొన్న బాధితులు.. ఆదుకోవాలని వేడుకోలు



హైదరాబాద్, ఫిబ్రవరి 12(మనం ప్రతినిధి): గ్యాంగ్‌స్టర్ నయీం సర్కారీ గూండా అని, అతడిని పెంచి పోషించింది ప్రభుత్వాలేనని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పునరుద్ఘాటిం చారు. కమ్యూనిస్టులకు పెట్టని కోటగా ఉన్న నల్లగొండలో వామపక్ష ఉద్యమాన్ని అణిచివేసేందుకు ప్రభుత్వాలే నయీంను తయారు చేశాయని ఆరోపించారు. 'నయీం బాధితులకు న్యాయం' చేయాలనే అంశంపై సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ, సీపీఎం, టీజేఏసీ, సీపీఐఎంఎల్(న్యూడెమోక్రసీ), తెలంగాణ ప్రజా ఫ్రంట్, పౌర హక్కుల సంఘం నేతలు, నయీం బాధితుల పరిరక్షణ సమితి సహా పలు ప్రజా సంఘాలు, పార్టీలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. నయీం బాధితులు కూడా పాల్గొన్న ఈ భేటీలో వక్తలు మాట్లాడుతూ.. కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్ ప్రభుత్వాలు తమ వ్యతిరేకులను అంతమొందించేందుకు నయీంను పోషించాయన్నారు. చివరకు అధికారపక్ష నాయకులను బెదిరిస్తుండడం, బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాపై ఆరోపణలు ఉన్న సోహ్రాబుద్దీన్ కేసుతో నయీంకు సంబంధాలుండడంతో కేంద్రం నుంచి వచ్చిన ఒత్తిడి మేరకే అతన్ని కేసీఆర్ అంతమొందిచారన్నారు. నయీం, జస్టీస్ లోయ బతికుంటే అమిత్‌షా జైళ్లో ఉండేవాడన్నారు. నయీంను చంపినంత మాత్రాన బాధితులు ఆనందంగా లేరన్నారు. వేల సంఖ్యలో ఉన్న బాధితులను ఆదుకున్నప్పుడే, వారి నుంచి నయీం లాక్కున్న ఆస్తులను తిరిగి ఇప్పిచ్చినప్పుడే వారు సంతోషంగా ఉంటారని చెప్పారు. నయీం కేసును విచారించేందుకు వేసిన సిట్ చిన్నాచితక నేరస్తులపై కేసులు పెట్టి మసిపూసి మారేడుకాయ చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. నిజానిజాలు నిగ్గుతేల్చేందుకు కేసును సీబీఐకి అప్పగించాలన్నారు. ఏకు మేకుగా మారిన నయీం ఉదంతాన్ని ప్రభుత్వాలు గుర్తెరగాలన్నారు. మరో నయీం తయారవకుండా ఉండాలంటే అతడికి సహకరించినవారి వివరాలను, సహకరించిన తీరును బయటపెట్టాలన్నారు. నయీం కేసు వివరాలన్నింటితో ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజి న్యాయమూర్తి చంద్రకుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, టీజేఏసీ నేత ప్రభాకర్, సామాజిక వేత్త సజయ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు నరసింగరావు, తదితరులు మాట్లాడారు.

న్యాయం చేయాలనడిగితే.. నాపైనే కేసులు..

మా బ్యాంకులో పనిచేసేవారిని ముగ్గుర్ని చంపేసిండు. నన్ను కిడ్నాప్ తీవ్రంగా హింసించిండు. రూ. 10 కోట్లు ఇస్తవా చస్తవా అని బెదిరించిండు. ప్రాణ భయంతో 5 కోట్లు ఇస్తానని చెప్పి అక్కడి నుంచి బయటపడ్డ. ఈ విషయం బయట ఎక్కడచెప్పినా మరునాడే చంపేస్తాం అని నయీం హెచ్చరించాడు. ఆ తర్వాత దఫదఫాలుగా రూ.3.50 కోట్లు వసూలు చేసిండు. వాడు చచ్చినాక సిట్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లా. బ్యాంకును మోసం చేశానని పోలీసులు నాపైనే కేసులు పెట్టిర్రు.

- చీమల జగదీశ్ యాదవ్, చైర్మన్, గోకుల్ బ్యాంక్

నా భూమి ఇప్పించుండ్రి సారు

మహేశ్వరంలో మాకున్న 13ఎకరాలపై నయీం కన్నుపడింది. వ్యవసాయంపై ఆధారపడి బతికేటోళ్లం, ఆ భూమి ఇవ్వను అని చెప్పినం. 15రోజులు నన్ను తీవ్రంగా హింసించిండు. కిడ్నాప్ చేసి విపరీతంగా కొట్టిండు. చంపేస్తానని బెదిరించి బలవంతంగా భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నడు. నా భూమి నాకిప్పించండి సారు.

- గుప్ప బాపిరెడ్డి, మహేశ్వరం

నరకం అనుభవిస్తున్నాం

నయీం నా భర్తను కిడ్నాప్ చేసి బలవంతంగా మా ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అనంతరం అతన్ని చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడు. నయీం చనిపోయాక న్యాయం జరుగుతుందని ఆశించి సిట్ వద్దకు వెళ్లాను. నీ భర్త సంతకం పెట్టాడు. ఇంటితో నీకు సంబంధం లేదని సిట్ అధికారులు చెబుతున్నారు. నేను, నా ముగ్గురు పిల్లలు 11ఏళ్లుగా నరకం అనుభవిస్తున్నాం(ఏడుస్తూ). మాకు న్యాయం చేయాలి.

- వజ్రేశ్వరి గుప్త, నల్లగొండ

నేనూ బాధితుణ్ణే..

నన్ను చంపేందుకు నయీం 3 సార్లు ప్రయత్నించిండు. అతడి నుంచి తప్పించుకునేందుకు 2001 నుంచి 2004 వరకు రాష్ట్ర వెలుపల తలదాచుకున్న. నయీం అనేవాడు రాజ్యం ఉపయోగించుకున్న కోవర్టు. ఆ కోవర్టు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల లొసుగులు తెలుసు కుని వారినే బెదిరించే స్థాయికి ఎదిగిండు. హోంమం త్రులు, డీజీపీలు కూడా అతడితో అంటకాగారు. నల్లగొండ జిల్లా ప్రజాప్రతినిధులందరూ నయానో, భయానో నయీంతో దోస్తి చేసినవారే.

- వరవరరావు, విరసం నేత.

వాతావరణం

తెలుగు రాష్ట్రాల్లో మంగళవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలలో మార్పులేదు. చలిగాలుల తీవ్రత స్వల్పంగా తగ్గుతుంది. గంటకు 13 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 32 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 17 డిగ్రీలు

గాలిలో తేమ: 68 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: త్రయోదశి రా.10.35 తదుపరి చతుర్దశి; నక్షత్రం: ఉత్తరాషాఢ తె.4.54 తదుపరి శ్రవణం; వర్జ్యం: ఉ.10.59 - 12.47; దుర్ముహూర్తం: ఉ.9.05 - 9.50, మ.2.25 - 3.10; రాహుకాలం: మ.3.22 - 4.48; అమృతఘడియలు: రా.9.46 - 11.34; శుభసమయం: సా.4.49 - 6.00;

సూర్యోదయం: 6.47,

సూర్యాస్తమయం: 6.13



సామాజిక న్యాయమే బీజేపీ ఎజెండా

- హక్కుల చట్టంతో దివ్యాంగులకు మేలు
- ఏ చిన్న లోపమున్నా గుర్తింపు పత్రం
- విద్య ఉపాధి రంగాల్లో రిజర్వేషన్ల పెంపు
- మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం..
- గ్రామగ్రామానా బీజేపీ 'ధూంధాం'
- రాష్ట్రంలో అసమర్థ సర్కారు పాలన
- వచ్చిన నిధులను ఖర్చుపెట్టలేదు: లక్ష్మణ్

హైదరాబాద్, ఫిబ్రవరి 12(మనం న్యూస్): దివ్యాంగుల సంక్షేమంకోసం మోదీ ప్రభుత్వం 'దివ్యాంగుల హక్కుల చట్టా'న్ని తీసుకొచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. దీంతో కేవలం ఏడు కేటగిరీలు మాత్రమే ఉన్న దివ్యాంగుల జాబితా ప్రస్తుతం 21 కేటగిరీలకు పెరిగిందని తెలిపారు. విద్య ఉపాధి రంగాలలో దివ్యాంగులకున్న రిజర్వేషన్లు 3శాతం నుంచి 5శాతానికి పెరుగుతాయని వివరించారు. బోదకాలు, యాసిడ్ గాయాలు సహా ఏ చిన్న లోపమున్నా ఈ చట్టంతో దివ్యాంగులుగా గుర్తిస్తారని చెప్పారు. ఈ చట్టాన్ని రాష్ట్రంలో అమలుచేస్తే దాదాపు ఇప్పుడున్న 15 లక్షల దివ్యాంగులతో పాటు, మరో 15 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ చట్టం ప్రకారం బోదకాలు బాధితులకు 1500 పింఛను అందనుండగా.. రూ.1000 మాత్రమే ఇస్తామనడం సీఎం కేసీఆర్‌కు భావ్యంకాదన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం అమలు కోసం విధి విధానాలు అసెంబ్లీలో రూపొందించి, ఈ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో 'బీజేపీ ధూం ధాం' గోడపత్రికను, ఓ పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాబోయే ఎన్నికలను దష్టిలో పెట్టుకుని మోదీ సంక్షేమ పథకాలను, పార్టీ చేస్తున్న ప్రజా పోరాటాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడానికి గ్రామగ్రామాల్లో 'బీజేపీ ధూంధాం' నిర్వహిస్తోందని అన్నారు. వంద కళా బృందాలను ఇందుకోసం సమాయత్తం చేసినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కళాబృందాల పాత్ర ఎనలేనిదని, వారి సాయంతోనే కేసీఆర్ గద్దెనెక్కి ఇప్పుడు వారిని విస్మరించారని, బీజేపీ ధూం ధాం ప్రభుత్వ పతనానికి నాంది కానుందని లక్ష్మణ్ జోస్యం చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలతో పాటు, కుటుంబ పాలన, అవినీతి రాజకీయాలను ఈ బృందాల ద్వారా ప్రజలకు వివరిస్తామని తెలిపారు. సామాజిక న్యాయమే ఎజెండాగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా బాహుళ్యంలోకి వెళుతున్నామన్నారు. ఆడలేక మద్దెల దరువు అన్నట్లు.. కేంద్రం నుంచి విరివిగా నిధులు వస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టడంలేదని విమర్శించారు. ప్రజల కోసమా.. కాంట్రాక్టర్ల కోసమా?ప్రభుత్వం ఉన్నది ప్రజలు అవసరాలు తీర్చడానికా? లేక కాంట్రాక్టర్ల జేబులు నింపడానికా? అని డాక్టర్ లక్ష్మణ్ ప్రశ్నించారు. 14వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చిన నిధుల్లో యాభై శాతం కూడా ఖర్చు చేయలేదంటే, ప్రజలపై ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికే విడుదల చేసిన నిధులను ఖర్చు చేయలేని టీఆర్ఎస్ సర్కారు పెద్దలు ఇంకా నిధులు కావాలంటూ ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టడం ప్రజలను మభ్యపెట్టేందుకేనని మండిపడ్డారు. పట్టణాలు, మున్సిపాలిటీల కోసం కేంద్రం ఇచ్చిన నిధుల వివరాలతో పాటు అందులో రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన ఖర్చుల వివరాలను తెలుపుతూ శ్వేతపత్రం విడుదల చేయాలని ప్రభుత్వాన్ని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. టీఆర్ఎస్ నాయకులు రాజకీయాలు మాని, వచ్చిన నిధులను సక్రమంగా ఖర్చుపెట్టి పాలనపై దృష్టిపెట్టాలని హితవు పలికారు. కేసీఆర్ మాటలు కోటలు దాటుతున్నాయి కానీ చేతలు గడప దాటడంలేదని విమర్శించారు.

సుంకిరెడ్డికి 'రంగినేని' అవార్డు

- అందజేసిన మహారాష్ట్ర గవర్నర్
- ట్రస్టు సేవలకు విద్యాసాగర్‌రావు ప్రశంస

కరీంనగర్, ఫిబ్రవరి 12(మనం న్యూస్ బ్యూరో): ఢిల్లీకి రాజైనా తల్లికి కొడుకేనని, పుట్టిన గడ్డ కన్నతల్లితో సమానమని మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. సిరిసిల్లలో రంగినేని ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ ఏడాదికిగానూ రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారాన్ని విద్యాసాగర్ రావు సుంకిరెడ్డి నారాయణరెడ్డికి అందజేశారు. బడి పిల్లల 'కతల వాగు' 'కవితల సింగిడి' పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్



రావు మాట్లాడుతూ.. చిన్నతనంలో తాను తిరగాడిన గుర్తులను ఆయన జ్ఞప్తిచేసుకున్నారు. తన పుట్టిన రోజు నాడే పుట్టిన ఊరికి రావడంపై సంతోషం వ్యక్తంచేశారు. తల్లిదండ్రులులేని పిల్లలు, అనాథలను చదివించాలనే సంకల్పంతో రంగినేని ట్రస్ట్ ముందుకు రావడం గొప్పవిషయమని కొనియాడారు. ఈ ప్రాంతంలోని వ్యక్తి సినారే తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేశారన్నారు. తెలుగు భాష జీవితగమనాన్ని మార్చివేస్తుందన్నారు. సామాజిక పరిస్థితులను తమ భావాన్ని వ్యక్త పరుస్తుందన్నారు. తెలంగాణలో తెలుగు సాహిత్య సౌరభాన్ని ముందుకు తీసుకుపోవాలని సూచించారు. వచ్చే ఏడాది కూడా సాహిత్య అవార్డుల కార్యక్రమం నిర్వహించాలని కోరారు. సాహితీవేత్తలు రాసిన 108 కథలు సేకరించి పుస్తకాలు ప్రచురించాలన్నారు. ఉద్యమాల వెనక కలం, గళం ఉన్నందున సాహిత్యానికి అత్యంత ప్రాధాన్యం



ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో మంచి ప్రభుత్వం, మంచి ప్రతిపక్షం ఉంది. అలా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

రాష్ట్రంలో మహాకూటమి?

పావులు కదుపుతున్న కాంగ్రెస్.. టీడీపీ, బీఎల్‌ఎఫ్, సీపీఐ, టీజేఏసీతో మంతనాలు?

- సీట్ల సర్దుబాటుపై అంతర్గతంగా చర్చలు
- దీటుగా టీఆర్ఎస్ 'ఆకర్ష్' మంత్రం











హైదరాబాద్, ఫిబ్రవరి 12 (మనం ప్రతినిధి): రాష్ట్ర రాజకీయాల్లో ముందస్తు ఎన్నికల వేడి రాజుకుంటోంది. రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. టీఆర్ఎస్‌ను గట్టిగా ఎదుర్కొనేందుకు రాష్ట్రంలో మహా కూటమి ఏర్పడే అవకాశాలపై పలు రాజకీయ పార్టీలు చాప కింద నీరులా యత్నాలు ప్రారంభించాయి. టీఆర్ఎస్‌కు ఎంఐఎం, బీజేపీ మాత్రమే ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా మద్దతు ఇచ్చే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఇప్పటికే రాష్ట్రంలో పలు ప్రజా సంఘాలతో సీపీఎం ఆధ్వర్యంలో బహుజన్ ఫ్రంట్ ఏర్పడింది. మరోవైపు కోదండరామ్ టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టటంతో పాటు విపక్షాలతో కలిసే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది. మార్చి 10న కొత్త పార్టీని ప్రకటించే అవకాశం ఉంది. మరోవైపు బీసీలను ఐక్యం చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు కృష్ణయ్య తనదైన శైలిలో పావులు కదుపుతున్నారు. టీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కార్యాచరణ రూపొందించే పనిలో ఆయన ఉన్నట్టు సమాచారం. రాష్ట్రంలో బలమైన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ తెలంగాణలో కొత్త కూటమి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు సాగిస్తున్నట్టుగా విశ్వసనీయ సమాచారం. ఈ కూటమిలో సీపీఐతో పాటు బీఎల్ఎఫ్ ఉండే విధంగా రాజకీయ వ్యూహ రచన చేస్తున్నట్టు తెలుస్తుంది.

కూటమిలో టీడీపీతో పాటు టీజేఏసీ కలిసి వచ్చే విధంగా రాజకీయ సమీకరణాలు చేస్తున్నట్టు వినికిడి. అయితే.. సీట్ల సర్దుబాటుపైనే జోరుగా చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర సాధనలో ప్రధాన భూమిక పోషించిన కోదండరామ్ లాంటి వారు విపక్షాలతో కలిసి వస్తే బాగుంటుందని, ప్రత్యేకంగా పార్టీ పెడితే టీఆర్ఎస్‌కే లాభం కలుగవచ్చనే భావనను రాజకీయ పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు కోదండరామ్ పెట్టే పార్టీతోనే ఎన్నికల రంగంలోకి దిగితే ఎలా ఉంటుందనే ఆలోచన ప్రతిపక్షాల్లోని కొన్ని పార్టీల్లో చర్చ సాగుతుంది. కాగా మందకృష్ణ విషయంలో ఇప్పటికే పలు పార్టీలు ఐక్య వేదికగా ఏర్పడి ఆయనకు మద్ధతు ప్రకటించిన దాఖలాలున్నాయి. అందరూ కలిసి వస్తేనే కేసీఆర్‌ను ఓడించగలుగుతామంటూ కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ ఇటీవల సలు సందర్భాల్లో పేర్కొన్నారు. కేసీఆర్‌ను ఓడించటమే లక్ష్యంగా కాంగ్రెస్‌తో పాటు బీఎల్‌ఎఫ్, సీపీఐ, టీడీపీ, ఆచార్య కోదండరామ్, బీసీ నేత కృష్ణయ్య లాంటి వారు కృషి చేస్తున్నారు. కాగా వీరంతా ఏకతాటిపై ఎంత మేరకు వస్తారో అనేదే చర్చానీయాంశంగా మారింది. మరో వైపు కాంగ్రెస్ తన బలాన్ని, బలగాన్ని పెంచుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. ఇప్పటికే పలు అనుబంధ విభాగాలను ఏర్పాటు చేసింది. ఈ సారి ప్రత్యేకంగా ప్రొఫెషనల్స్‌తో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయటం గమనార్హం. ఇతర పార్టీల నేతలకు గాలం వేస్తూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్ నేతలు ముమ్మరం చర్యలు చేపడుతున్నారు. అధికారమే పరమావధిగా కాంగ్రెస్ నేతలు పావులు కదుపుతున్నారు. దేశంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రంలోనూ తన ఉనికిని చాటుకోవటంతో పాటు 2024లో తెలంగాణలో జెండా ఎగురేసే విధంగా ఆ పార్టీ అధిష్టానం పావులు కదుపుతుంది. దక్షిణాదికి ముఖ ద్వారంగా భావిస్తున్న తెలంగానలో వీలైనంత మేర పట్టు సాధించేందుకు బీజేపీ నేతలు ముమ్మరంగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రత్యక్షంగానైనా, పరోక్షంగా టీఆర్ఎస్‌తో లబ్ధి పొందే విధంగా బీజేపీ నేతలు చాపకింద నీరులా కృషి చేస్తున్నారు. తెలంగాణకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు తక్కువగా ఉన్నా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై విమర్శలు చేయటంలో టీఆర్ఎస్ వెనుకాడుతుండటంపై సర్వత్రా చర్చానీయాంశంగా మారింది.

రాజకీయ వ్యూహంలో కేసీఆర్..

రాష్ట్రంలో మరోసారి అధికారాన్ని చేజిక్కించుకునే క్రమంలో టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పటికే రాజకీయ చక్రం తిప్పుతున్నారు. ' ఆపరేషన్ ఆకర్ష్' ద్వారా వివిధ పార్టీలలోని నాయకులను తమ పార్టీలోకి చేర్చుకుంటున్నారు. గెలుపుగుర్రాల కోసం సర్వేలను భారీగా నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లడంటూ మంత్రులతో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులకు కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. మిషన్ కాకతీయ, భగీరథతో పాటు యువత, మహిళలు, కులవృత్తులు, దళిత, గిరిజన, బీసీలను ఆకట్టుకునే విధంగా బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించే పనిలో కేసీఆర్ నిమగ్నమైనట్టుగా ప్రచారం సాగుతోంది. డిసెంబరు, జనవరిలలో ఎన్నికలు వస్తే ప్రతిపక్షాల ఎత్తులను చిత్తు చేసే విధంగా రాజకీయ ప్రణాళికల రూపకల్పనలో కేసీఆర్ తలమునకలయ్యారని పార్టీ శ్రేణుల ద్వారా తెలిసింది.



మై హోం భూదందాపై విచారణ చేయాలి

- కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి డిమాండ్
- అసైన్డ్ భూములు కాజేసేందుకే చట్ట సవరణ
- ఆర్డినెన్స్ జారీ చేయడానికే అసెంబ్లీ ప్రొరోగ్

హైదరాబాద్, ఫిబ్రవరి 12(మనం ప్రతినిధి): మై హోం భూ దందాపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ నేత ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీ మీడియా హాల్ వద్ద రేవంత్ సోమవారం మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్, మహేశ్వరం మండలాల్లో మై హోం రామేశ్వర్ రావు పెద్ద ఎత్తున భూ దందాకు పాల్పడుతున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబం భారీ ఎత్తున అసైన్డ్ భూములను కాజేస్తోందని రేవంత్ ఆరోపించారు. రామేశ్వర్‌రావుకు లబ్ధి చేకూర్చేందుకు అసైన్డ్ భూముల చట్టానికి సరవణ తీసుకొస్తూ హడావుడిగా ఆర్డినెన్స్ జారీ చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఆ ఆర్డినెన్స్‌ను జారీ చేసేందుకు ప్రభుత్వం ఈ నెలలో బడ్జెట్ సమావేశాలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అసెంబ్లీని ప్రొరోగ్ చేసిందన్నారు. పేదలకు లబ్ధి చేకూర్చడానికి అనే ముసుగులో రామేశ్వర్‌రావుకు ప్రయోజనం కల్గించేందుకు ముఖ్యమంత్రే స్వయంగా ఈ పని చేస్తున్నారని ఆరోపించారు. శంషాబాద్, మహేశ్వరం మండలాల్లో రామేశ్వర్‌రావు నాలుగైదు వేల ఎకరాల భూమిని సేకరించారని, ఇందులో రెండు వేల వరకు అసైన్డ్ భూములు ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే దీనిపై వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములను రామేశ్వర్ రావుకు కట్టబెట్టేందుకే రంగారెడ్డి జిల్లా కలెక్టర్ 2017 డిసెంబర్ 18న ఒక మోమో జారీ చేశారని దీని ప్రకారం భూములను రెగ్యులరైజ్ చేేందుకు అంగీకరించనందునే సీనియర్ అధికారి బీఆర్ మీనాను బదిలీ చేశారని చెప్పారు. 2007లోనే దీర్ఘకాలంగా అసైన్డ్ భూములను అక్రమంగా అనుభవిస్తున్న అర్హులైన లబిధ్దారులకు రెగ్యులరైజ్ చేయాలని చేసిన చట్టానికి అసెంబ్లీ ఆమోదం తెలిపిందని చెప్పారు.

దళితుల సంక్షేమానికి ప్రభుత్వ కృషి

- షెడ్యూల్డ్ కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టం దేశానికే ఆదర్శం
- రాష్ట్ర విద్యుత్, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి
- గడువులోపు కేటాయించిన నిధులు ఖర్చు చేయాలని ఆదేశం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (మనం ప్రతినిధి): దళితుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర విద్యుత్, ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి స్పష్టం చేశారు. షెడ్యూల్డ్ కులాల ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టం అమలుపై సోమవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి జగదీష్ రెడ్డి మాట్లాడుతూ దళితుల సంక్షేమం కోసం రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి నిధి చట్టం అమలులోకి తీసుకువచ్చామన్నారు. ఆ చట్టం భారత్‌దేశానికే ఆదర్శంగా మారిందన్నారు. చట్టం అమలులోకి తెచ్చిన మొదటి సంవత్సరమే పెద్ద ఎత్తున నిధులు కేటాయించి దళితుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం 16.32 శాతం ఉన్న షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ. 14,375 కోట్లు కేటాయించి, వాటిలో రూ. 6,689 కోట్లు ఖర్చు పెట్టినట్టు వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం పూర్తి కావడానికి మరో 50 రోజులు ఉందని, గ డువు ముగిసే లోపే కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు పెట్టేందుకు ప్రణాళికలు రూపొందించినట్టు పేర్కొన్నారు. మొత్తం 197 సంక్షేమ, 219 ఉప సంక్షేమ పథకాలతో దళితుల అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలతో ఇప్పుడిప్పుడే సత్ఫాలితాలు వస్తున్నాయన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ స్టడీ సర్కిల్ కేవలం హైదరాబాద్‌లో మాత్రమే ఉండేదని ఇప్పుడు ప్రతి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా 100 మందికి పైగా దళితులు ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. దళితుల అభివృద్ధి కోసం ఖర్చు పెట్టే ప్రతీ పైసా పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవడంతోపాటు లబ్దిదారుల వివరాలను పెన్ డ్రైవ్ ద్వారా ప్రజాప్రతినిధులందరికీ అందజేయనున్నట్టు తెలిపారు. నిర్ణీత గడువులోపు నిధులు ఖర్చు చేయాలని అధికారులను ఆదేశించారు.



భారతదేశంలో సమాజం కులాల వారీగా విడిపోయిందని, అటువంటి పరిస్థితుల్లో మంచి సమాజాన్ని నిర్మించడమే కేసీఆర్ ధ్యేయంగా పెట్టుకున్నారని తెలిపారు. ఇప్పటివరకు వివాదాలకే పరిమితమైన దళితుల సంక్షేమ పథకాలు ఈ చట్టం అమలుతో కార్యరూపం దాల్చాయన్నారు. ఈ సమావేశంలో ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీర్ ఆర్. ఆచార్య, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రమాకృష్ణారావు, ఎస్సీ అభివృద్ధి కార్యదర్శి జ్యోతి బుద్ధా ప్రసాద్, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు కిషన్, గురుకుల పాఠశాలల కార్యదర్శి ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్, వ్యవసాయశాఖ కమిషనర్ జగన్ మోహన్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డైరెక్టర్ కరుణాకర్, జనరల్ మేనేజర్ ఆనంద్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నల్గొండలో రాజకీయ ఘర్షణలు సహజం

నల్గొండ జిల్లాలో రాజకీయ ఘర్షణలు సహజమని, గత 20 ఏండ్లలో రాజకీయ ఘర్షణలు లేని సంవత్సరమే లేదని మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. సచివాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి, జానారెడ్డి నియోజకవర్గాల్లో ఎలాంటి ఘర్షణలేవు కానీ నల్గొండలో గొడవలు జరగడానికి కారణం ఏమిటో కాంగ్రెస్ పార్టీ నాయకులే చెప్పాలన్నారు. ఇప్పుడున్న సీట్లు కూడా గెలువలేమనే భయంతోనే కాంగ్రెస్ పార్టీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. గతంలో బొడ్డుపల్లి శ్రీనివాస్ టీఆర్ఎస్‌లో చేరాడని, సస్పెండ్ చేస్తే బయటకు వెళ్లాడని, మళ్లీ పార్టీలోకి రాలేదని, అలాంటి ఆయనను ఎందుకు హత్య చేస్తారని ప్రశ్నించారు. శ్రీనివాస్ హత్యను అడ్డుపెట్టుకుని దివాలా కోరు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. శ్రీనివాస్‌ను వెంట తిరిగే వారే హత్య చేశారని ఆయన భార్య కూడా పోలీసులకు ఫిర్యాదు చేసిందని, మరుసటి రోజు మాట మార్చేలా చేశారన్నారు. గతంలో నల్గొండలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహాను కూడా ఈ విధంగానే హత్య చేశారన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సూర్యాపేటలోనూ, వేముల వీరేశం ప్రాతినిధ్యం వహిస్తున్న నకిరేకల్‌లో ఎలాంటి ఘర్షణలు జరుగలేదని నల్గొండలో కావాలనే ఈ విధంగా చేస్తున్నారన్నారని జగదీష్ రెడ్డి చెప్పారు.





అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం

- కొత్త జిల్లాల్లో రోడ్ల విస్తరణలో జాగ్రత్త
- పురపాలనలో టౌన్‌ప్లానింగే కీలకం
- గడువు లోపల అనుమతులివ్వాల్సిందే..
- లేకుంటే అధికారులకు జరిమానా విధిస్తాం
- మునిసిపల్ , ఐటీ శాఖ మంత్రి కేటీఆర్
- టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12(మనం ప్రతినిధి): నూతనంగా ఏర్పాటైనా జిల్లా కేంద్రాల్లో రోడ్ల విస్తరణ, అక్రమ కట్టడాలను అరికట్టడానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్త టౌన్ ప్లానింగ్ సిబ్బందితో జరిగిన సమావేశానికి జీహెచ్ఎంసీ కమిషనర్ డా.బి.జనార్ధన్‌రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ టి.చిరంజీవులుతో పాటు కేటీఆర్ హాజరయ్యారు.

రాష్ట్రవ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలు ప్రభుత్వం నుంచి సరికొత్త పాలన ఆశించారని, ఆ దిశగా అనేక పాలనా సంస్కరణలతో ముందుకు సాగుతున్నామని అన్నారు. టౌన్ ప్లానింగ్ శాఖలోనూ అనేక మార్పులు తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. సాధారణ పౌరుడికి అత్యంత పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని అనుమతులు వచ్చేలా డీపీఎంఎస్ విధానాన్ని అమలులోకి తీసుకుని వచ్చామని కేటీఆర్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ విధానంలో నెల రోజుల గడువును కుదించి 21 రోజుల్లోనే అన్ని అనుమతులు వచ్చేలా చేశామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారం రోజుల్లో దరఖాస్తులో లోపించిన పత్రాల సమాచారాన్ని దరఖాస్తుదారుడికి తెలియజేయాలన్నారు. అనుమతుల ప్రక్రియలో ఉన్న అనవసర ఆలస్యాన్ని తగ్గించేందుకే ఈ విధానం తీసుకు వచ్చామని తెలిపారు.

డీపీఎంస్ విధానంపై టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తి అవగాహన పెంచుకోవాలని, సంపూర్ణ పరిజ్ఞానంతో పనిచేయాలని మంత్రి అధికారులను కోరారు. ప్రజల్లో అధికార వ్యవస్థకు మరింత పేరు తెచ్చేలా ప్రతి ఒక్క అధికారి పనిచేయాలన్నారు. ప్రభుత్వం తెచ్చిన ఆన్‌లైన్ విధానంపై మంత్రి అధికారుల ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరిస్తుందని కేటీఆర్

డీపీఎంస్ విధానంపై అవగాహన పెంచుకోండి..

ఈ సందర్భంగా తెలిపారు. అయితే ప్రవేశ పెట్టిన 21 రోజుల గడువు లోపల అనుమతులు ఇవ్వకుండా ఆలస్యం చేసే అధికారులపైన టీఎస్ఐపాస్‌లో మాదిరి జరిమానాలు విధించే అంశాన్ని పరిశీలిస్తున్నామని అధికారులను హెచ్చరించారు. టౌన్ ప్లానింగ్ అధికారులతో ప్రతి మూడు నెలలకోసారి సమావేశం అవుతానని మంత్రి కేటీఆర్ ఈ సందర్భంగా తెలిపారు. పురపాలనలో టౌన్, కంట్రీ ప్లానింగ్ అధికారుల పాత్ర ఎంతో కీలకమైనదన్న మంత్రి, అధికారులకు ప్రభుత్వ ప్రాధాన్యతలను వివరించారు. దీంతోపాటు అన్ని పురపాలికల్లోని లేఅవుట్లలోని ఖాళీ ప్రదేశాలు(ఓపెన్ ప్లాట్లు) ను కాపాడడంలో మున్సిపల్ కమిషనర్లతో కలిసి పనిచేయాలన్నారు. ప్రస్తుతం నడుస్తున్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మంత్రి అధికారులను కోరారు. టౌన్ ప్లానింగ్ అధికారులు తమ విధుల్లో టెక్నాలజీ సహకారంతో విధులు నిర్వర్తించేందుకు అవసరమైన సూచనలివ్వాలనన్నారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు, సీడీఎంఏ, డీటీసీపీ మరియు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం.. అక్షర యజ్ఞం..
మంగళవారం, ఫిబ్రవరి 13

పశ్చిమాసియాలో ప్రధాని

ప్రధాని నరేంద్ర మోదీ చారిత్రాత్మక పశ్చిమాసియా దేశాల నాలుగు రోజుల పర్యటన శనివారం మొదలైంది. ఒమన్, యునైటెడ్ అరబ్ ఎమరేట్స్ (యూఏఈ), పాలస్తీనా పర్యటనలో భాగంగా పాలస్తీనాలో అవార్డు స్వీకరించారు. యూఏఈలో ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన భవంతి బుర్జ్ ఖలీఫా, అబూదాబీ నేషనల్ ఆయిల్ కంపెనీ తదితర ప్రాంతాలను మువ్వన్నెల జెండా రంగుల స్టిక్కర్లతో తీర్చిదిద్దారు. సుల్తాన్ ఖబూస్ బిన్ సయీద్ అల్ సయీద్‌తో విస్తృత చర్చల్లో భాగంగా భారత్-ఒమన్ ఎనిమిది ఒప్పందాలపై సంతకాలు చేశాయి. రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, రక్షణ, భద్రత సహకారాలపై ఈ ఒప్పందాలు కుదిరాయి. వాటిల్లో ముఖ్యమైనది పౌర, వ్యాపార సంబంధమైన ఒప్పందం కూడా ఉన్నది. రాయబార, ప్రత్యేక, సేవల అధికారస్థాయి అధికారులకు పాస్‌పోర్టులకు సంబంధించి పరస్పర వీసాల సడలింపు ఒప్పందంపై కూడా రెండుదేశాలు సంతాకాలు చేశాయి. రాజకీయ పరిణామాలతో సంబంధం లేకుండా రెండు దేశాల మధ్య సంబంధాలు బలంగా ఉన్నాయని ఒమన్‌లో భారతీయులనుద్దేశించి ప్రసంగిస్తూ మోదీ చెప్పారు. అబూదాబీలో నిర్మాణం కానున్న తొలి హిందూ దేవాలయానికి ఆయన శంకుస్థాపన చేశారు. అధిక చమురు క్షేత్రాలున్న ఒమన్‌లో తన పర్యటనతో ద్వైపాక్షిక సంబంధాల్లో గణనీయమైన ప్రోత్సాహం లభించగలదని ఆయన అన్నారు. ఈ పర్యటన కోసం తానెంతో కాలం నుంచి ఎదురు చూస్తున్నానని చెప్పారు. ఒమన్‌తో బంధం విక్రేత-వినియోగదారుల సంబంధం కాదని, రెండుదేశాల మధ్య బంధం దినదినాభివృద్ధిచెందుతూ మరింత పటిష్ఠమవుతోందని మోదీ చెప్పారు. ఒమన్ అభివృద్ధిలో భారతీయుల పాత్ర చిరస్మరణీయమైనదని సుల్తాన్ ఖబూస్ ప్రశంసించారు.

అయితే, ప్రవాస భారతీయుల సమావేశంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ, రాజకీయ ప్రస్తావన చేశారు. అలా విదేశీగడ్డపై రాజకీయాలను ప్రస్తావించడం ఆయనకు కొత్తేమీకాదు. గతంలోనూ అమెరికా పర్యటనల్లో ఆయన ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోశారు. ఇప్పుడు కూడా గత పాలకులపై ఆయన విమర్శలు కురిపించారు. భారత్‌లో గత 70 ఏళ్లలో అవినీతి, అక్రమాల ప్రభుత్వాలతో ప్రజలు విసుగెత్తిపోయారని, ఖజానాకు చిల్లుపొడిచారని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాని స్థాయిలో విదేశీగడ్డపై ఇలా రాజకీయాలు మాట్లాడడం ఎంతమాత్రం శోభస్కరంగా కనిపించదు. నైతిక రాజకీయాల అంశంలో ఉన్న సన్నటి గీత ఏనాడో అస్పష్టమైన నేపథ్యంలో నేడు రాజకీయాలు నడుస్తున్నాయని మరోసారి మోదీ గుర్తుచేశారు. అయినా వ్యక్తిపూజ, విలువల రాహిత్యాన్ని తలకెత్తుకున్నంత కాలం ఇలా అనైతిక రాజకీయాలు చోటుచేసుకుంటూనే ఉంటాయని గుర్తెరగాలి.

ఒమన్‌లో పర్యటన అనంతరం ఆయన పాలస్తీనా వెళ్లారు. గత ఏడాది ఇజ్రాయెల్‌లో పర్యటించి ఆ దేశంలో పర్యటించిన తొలి భారత ప్రధానిగా మోదీ నిలిచారు. పాలస్తీనాలో అధికారిక కార్యక్రమం లేకపోయినా పాలస్తీనాలో సంక్షోభం కొనసాగుతున్న నేపథ్యంలో మోదీ పర్యటన ప్రాముఖ్యం సంతరించుకుంది. హిందూత్వభావాలున్న పార్టీగా బీజేపీ పాలనలో కొనసాగుతున్నప్పటికీ పాలస్తీనా అధ్యక్షుడు మొహమద్ అబ్బాస్‌కు ఘనంగా అతిథి సత్కారాలు చేయడం ద్వారా పాలస్తీనా పట్ల దశాబ్దాలుగా అనుసరిస్తున్న భారత్ విధానంలో మార్పులేదని సూచించింది. ఈ ప్రాంత పరిణామాలపై భారత్ వైఖరిలో తులనాత్మకత ప్రతిబింబిస్తోంది. భారత్ అనుసరిస్తున్న వైఖరితో అటు పాలస్తీనా, ఇటు ఇజ్రాయెల్ రెండూ సంతృప్తినే వ్యక్తంచేస్తున్నాయి. గుజరాత్ ముఖ్యమంత్రిగా ముస్లింలపట్ల అనుసరించిన వైఖరితో అప్రతిష్ట మూటగట్టుకున్న మోదీ, ముస్లింలు భారత్‌లో ఉండకూడదంటూ తరచూ ప్రకటనలు చేసే బీజేపీ నేతల వ్యాఖ్యలను పరోక్షంగా ప్రోత్సహిస్తున్న నేపథ్యంలో ప్రధాని పాలస్తీనా పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. మోదీ పర్యటన ప్రభావం ఆర్థిక అంశాలపై కూడా ఉంటుంది. మరీ ముఖ్యంగా భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియాల వంటి తూర్పు, పశ్చిమాసియాల్లో చమురు వినియోగం పెరగడం, ఆసియా దేశాలు చమురు కొనుగోళ్లలో ముందుండడం, ఫలితంగా తమ అవసరాల మేరకు పశ్చిమాసియా దేశాలు తదనుగుణంగా అడుగులు వేస్తున్న నేపథ్యంలో అమెరికా వంటి పాశ్చాత్యదేశాలు ప్రత్యామ్నాయ ఇంధన ఏర్పాట్లకు దిగుతున్న నేపథ్యంలో పరిస్థితి భారత్‌కు అనుకూలంగా పరిణమిస్తోంది. ఈ పరిస్థితులను అందిపుచ్చుకుని ఆయా దేశాలతో వాణిజ్య, మార్కెట్ సంబంధాలను దృఢతరం చేసుకోవడంలో భారత్ కృతకృత్యమయ్యే చర్యలు చేపట్టాలి.



మంచిమాట



రోజుకి ఒక్కసారైనా నీలో నువ్వు సంభాషించు.. లేకపోతే ఒక అద్భుత వ్యక్తితో సంభాషించే అవకాశాన్ని కోల్పోతావు.

- స్వామి వివేకానంద

పేదల గూటికి ఆరోగ్య సంరక్షణ



సమీర్ శర్మ
సమాలోచన

అందరికీ ఆరోగ్యం విషయంలో ప్రధానమంత్రికి ఓ దృఢమైన అభిప్రాయం ఉన్నట్టు కనిపిస్తోంది. ఇందు కోసం ఓ బహుళార్థ సాధక విధానం రూపంలో ఆయన అనేక సమూలమైన మార్పులకు శ్రీకారం దిద్దారు. ఇది ప్రతి ఒక్కరికీ నివారక, నిరోధక, చికిత్సా రూపంలో ఆరోగ్య సంరక్షణ కల్పిస్తుంది. అంతేకాక, వివిధ స్థాయిల్లో చికిత్సా సౌకర్యాలు కల్పించి ఆరోగ్య సంరక్షణకు మార్గం సుగమం చేస్తుంది. ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని నిర్దేశించుకుని దీని అమలుకు వ్యూహాన్ని ప్రారంభించాల్సి ఉంటుంది. తన స్తోమతకు మించి ఆరోగ్యం మీదా, చికిత్స మీదా ఖర్చు చేయాల్సిన అవసరం లేకుండా చేయడమే దీని పరమార్థం. ప్రతి ఏటా ఏడు లక్షల మంది తమ ఆరోగ్యం కోసం, చికిత్స కోసం పెట్టే భారీఖర్చుతో పేదరికంలోకి కూరుకుపోతున్నట్టు అంచనా. ఆరోగ్యాన్ని కాపాడేందుకు, ఇందుకు సంబంధించిన ప్రాథమిక అవసరాలను తీర్చుకునేందుకు ఇప్పుడున్న ఆరోగ్య విధానాలనే పునర్నిర్మించి వాటికి కొత్త దిశానిర్దేశం చేయడం కూడా ఈ లక్ష్యంలో భాగం.


ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీల) ద్వారానే నివారక, నిరోధక ఆరోగ్య సంరక్షణ లభిస్తోంది. అయితే, పీహెచ్‌సీలకు వైద్యుల కొరత అధికంగా ఉంది. వారి పంపిణీ కూడా అరకొరగా ఉంది. సరైన వైద్యుని కోసం రోగులు ఒక్కోసారి 25 కిలోమీటర్ల వరకూ నడిచి వెళ్లాల్సి వస్తోంది. పీహెచ్‌సీలు కేవలం 5 శాతం ఔట్ పేషెంట్లకు మాత్రమే చికిత్సను అందించగలుగుతున్నాయి. చివరికి వారు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఫలితంగా ఔట్‌పేషెంట్లు సైతం తమ జేబుల నుంచి అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. భారతదేశంలో ఈ పరిస్థితి మరీ దయనీయంగా ఉంటోంది. ఇతర దేశాలతో పోలిస్తే స్తోమతకు మించి ఖర్చు చేయడమనేది భారతదేశంలో 64 శాతం వరకూ ఉంది. స్తోమతకు మించి ఖర్చు చేసే స్థాయిలను అధ్యయనం చేస్తే మొత్తం 192 దేశాలలో భారతదేశం 182వ స్థానంలో ఉంది.

ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను సామాన్య ప్రజానీకానికి అందుబాటులో తీసుకురావడం అత్యంత అవసరం. పీహెచ్‌సీల స్థాయి కంటే తక్కువ స్థాయిలో ఉన్న ఉప కేంద్రాలను అందుబాటులోకి తేవడానికి అవకాశం కల్పించాలి. పీహెచ్‌సీలు 25 గ్రామాల్లో ఆరోగ్య సంరక్షణ బాధ్యతలు తీసుకుంటుండగా ఉప కేంద్రాలు కనీసం నాలుగు గ్రామాల్లో ఆరోగ్య సంరక్షణను భుజాలకెత్తుకోవాల్సి ఉంటుంది. అంటే కొత్త విధానంలో, ఉప కేంద్రాల ద్వారా ప్రాథమిక, నివారక ఆరోగ్య సంరక్షణ కల్పించడం ప్రధానం. ఆరోగ్య సంరక్షణలో ఉప కేంద్రం అనేది నాలుగవ స్థాయిలో ఉంటుంది. ప్రజలకు అందుబాటులో ఉంటూ, అంటు వ్యాధులను, జీవనశైలి వ్యాధులను గుర్తిస్తూ వారికి చికిత్స అందించడం వీటి ప్రధాన ఉద్దేశం. అంతేకాక, ఈ విధానంలో ఏఎన్‌ఎంలు, ఎంపీడబ్ల్యూలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలంతా ఒకేచూరు (ఉప కేంద్రం) కింద ఉంటారు. దీనివల్ల ఇంటిస్థాయి నుంచి ఆరోగ్య సంరక్షణ, పారిశుద్ధ్యం, పౌష్టికాహారం వంటి అంశాల మీద సమన్వయంతో పనిచేయడానికి వీలు కలుగుతుంది.

డిజిటల్ టెక్నాలజీ వినియోగం

ఇక ఈ విధానాన్ని సక్రమంగా, సమర్థంగా అమలు చేయడానికి డిజిటల్ టెక్నాలజీ కూడా ఎంతగానో ఉపయోగపడుతుంది. ఉదాహరణకు, 70 శాతానికి పైగా రోగులు పీహెచ్‌సీ స్థాయిలో చికిత్స కోసం వస్తుంటారు. రోగులు అసలు పీహెచ్‌సీలకు రావాల్సిన అవసరమే లేకుండా ఇటువంటి వ్యాధి లక్షణాలను గుర్తించడానికి, నిర్ధారించడానికి డిజిటల్ టెక్నాలజీ ఉపయోగపడే పక్షంలో ఇది అత్యంత ఉపయుక్తంగా ఉంటుంది. (ప్రధాన మంత్రి జన్ ఔషధి కేంద్రాలను జోడించడం ద్వారా) తపాలా ద్వారానో, కొరియర్ ద్వారానో ఔషధాలను ఇంటి వద్దకే వెళ్లి అందజేయడానికి కూడా ఇది వీలు కల్పిస్తుంది. ఇది పీహెచ్‌సీ స్థాయిలో రద్దీని తగ్గించడానికి కూడా వీలు కల్పిస్తుంది. నివారక ఆరోగ్య సంరక్షణలో మరో ముఖ్య మైన అంశం అంటువ్యాధులు కానటువంటి వ్యాధులను ముందే గుర్తించడం. ఇందుకోసం తరచూ సార్వజనిక హెల్త్ చెకప్ చేయించడం అనివార్యమవుతుంది. సాయిల్ హెల్త్ కార్డు మాదిరిగానే దీని కోసం డిజిటల్ ఫ్యామిలీ హెల్త్ కార్డు జారీ చేయాల్సి ఉంటుంది.

ఇవన్నీ జరగాలంటే దేశంలో పీహెచ్‌సీల కంటే తక్కువ స్థాయిలో ఉన్న సుమారు 1,53,655 ఉప కేంద్రాలకు అప్‌గ్రేడ్ చేయాలి. దాదాపు 1.3 లక్షల ఉప కేంద్రాలు ప్రభుత్వ ఆధీనంలోనో, పంచాయతీ భవనాల్లోనో ఉన్నందువల్ల ప్రాథమిక సదుపాయాల మీద పెట్టాల్సిన ఖర్చు చాలావరకు తగ్గుతుంది. మరో సవాలు ఏంటంటే, అసలే వైద్యుల కొరత ఉన్న స్థితిలో ఉప కేంద్రాలను నిర్వహించేదెవరు? ఇక్కడో అవకాశం ఉంది. దేశంలో సుమారు 7.4 లక్షల మంది ఆయుష్ డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. ఈ ఆయుష్ డాక్టర్లు ఉప కేంద్రాలను నిర్వహించవచ్చు. చైనాలో మాదిరిగా దీనివల్ల సంప్రదాయిక వైద్యం, ఆధునిక వైద్యం సమన్వయంతో పనిచేయడానికి వీలుంది. అంతేకాదు, యోగా లాంటి సంప్రదాయిక ఆరోగ్య సంరక్షణ పద్ధతులను ప్రోత్సహించవచ్చు.



తరచూ ఆస్పత్రులకు వెళ్లాల్సి రావడం, ఆస్పత్రులలో చేరాల్సి రావడం వంటి వాటివల్ల ఖర్చులు పెరిగిపోతుండడంతో పేదలకు ఆరోగ్య సంరక్షణ అనేది ఓ ఉత్పాతం కింద అనుభవానికి వస్తోంది. ఈ భారీ ఖర్చులు వారి జీవనాన్ని కూడా దెబ్బ తీస్తున్నాయి.

దేశంలో ఆస్పత్రుల్లో చేరేవారి సంఖ్య రానురానూ పెరుగుతోంది. రాష్ట్రీయ స్వస్థ్ బీమా యోజన (ఆర్‌ఎస్‌బీవై) పథకాలను సమీక్షించినప్పుడు, స్తోమతకు మించిన వైద్య ఖర్చులను ఈ పథకాలు తగ్గించలేకపోతున్నాయనే విషయం స్పష్టమైంది. ఈ ఖర్చు గ్రామీణ ప్రాంతాల్లో 2004లో 5,752 రూపాయలు ఉండగా, 2014 నాటికి 5,904 రూపాయలకు పెరిగింది. ఇది పట్టణ ప్రాంతాల్లో 8,217 రూపాయల స్థాయి నుంచి 10,866 రూపాయలకు పెరిగింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో చేరినప్పుడు మాత్రమే పథకాలు వర్తిస్తున్నాయనే సంగతి కూడా ఈ సమీక్షలో బయటపడింది. బీమా పథకాలు గానీ, ఆరోగ్య రక్షణ పథకాలు గానీ ప్రాథమిక స్థాయిలోనో, నివారణ స్థాయిలోనో, జీవనశైలి వ్యాధులను నిర్ధారణ స్థాయిలోనో పట్టించుకోకుండా ఆస్పత్రులలో చేరిన తర్వాత చికిత్స ప్రారంభించిన తరువాత మాత్రమే అంటే సెకండరీ స్థాయిని దాటిన తర్వాత మాత్రమే పట్టించుకోవడం జరుగుతోంది.

పేద కుటుంబాలన్నిటికీ ఆరోగ్య సంరక్షణను సమకూర్చాల్సిన అవసరం ఉంది. అదనంగా, మధ్యతరగతి కుటుంబాలన్నిటికీ ఆరోగ్య సంరక్షణ పథకాల్లో అవకాశం కల్పించాలి. మధ్యతరగతివారు మాత్రం పూర్తిస్థాయిలో ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఇలా గనుక చేస్తే, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మధ్యతరగతి కుటుంబాలు కూడా తక్కువ ఖర్చుతో సరైన ఆరోగ్య సంరక్షణ పొందడానికి అవకాశం ఉంటుంది. మరో ముఖ్యమైన విషయమేమిటంటే, అటు ప్రభుత్వ ఆస్పత్రులలోనూ, ఇటు ప్రైవేట్ ఆస్పత్రులలోనూ అందిస్తున్న చికిత్స, ఆరోగ్య సంరక్షణకు స్వయం ప్రతిపత్తి కలిగిన వ్యవస్థలను కూడా ఏర్పాటు చేయాలి. అంటే సరైన పర్యవేక్షణ ఉండాలి. ఈ పథకాలను సమన్వయ పరచడానికి, అమలు చేయడానికి రాష్ట్రస్థాయి హెల్త్ అథారిటీని ఏర్పాటు చేయాలి. రాష్ట్రాలకు తమకు వీలైన, సౌకర్యవంతమైన వ్యవస్థలను ఏర్పాటు చేయడానికి స్వేచ్ఛను కలిగి ఉండాలి.

రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛ

అవసరమైతే రాష్ట్రాలు ప్రస్తుతం ఉన్న ట్రస్ట్, సొసైటీ, లాభేతర కంపెనీ, రాష్ట్ర నోడల్ ఏజెన్సీల ద్వారా ఈ పద్ధతిని అమలు చేయవచ్చు లేదా కొత్త మరో సంస్థను ఏర్పాటు చేయవచ్చు. జాతీయ స్థాయిలో, ఈ పథకాలను నిర్వహించడానికి జాతీయ ఆరోగ్య ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయవచ్చు. ఆస్పత్రుల ఎంపికకు, ధరల నిర్ణయానికి, చికిత్సా సౌకర్యాల కల్పనకు, పర్యవేక్షణకు, నాణ్యమైన హామీని ఇచ్చేందుకు, రోగుల భద్రతకు, ప్రమాణాలకు కావాల్సిన నియమ నిబంధనలను రూపొందించుకోవాల్సి ఉంటుంది. ఈ సంస్థలు ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధీనంలో పనిచేయడం వల్ల ఉపయోగం ఉంటుంది.

2018-19 కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన ఆరోగ్య సంరక్షణ పథకం, ఉప కేంద్రాల అప్‌గ్రేడ్ వంటివి పేదల ఆరోగ్య సంరక్షణ మీద సానుకూల ప్రభావాన్ని చూపిస్తాయి. ముఖ్యంగా పేదల జీవితాలను, జీవనాలను కాపాడడం దీని ఉద్దేశం. ఆరోగ్య సంరక్షణ మీద భారీగా ఖర్చు చేయాల్సి వస్తుండడం వల్ల పేదలు ఆహారం, విద్య వంటి ప్రధాన అంశాల మీద ఖర్చు తగ్గించుకోవాల్సి వస్తోంది. తరచూ ఆస్పత్రులకు వెళ్లాల్సి రావడం, ఆస్పత్రులలో చేరాల్సి రావడం వంటి వాటివల్ల ఖర్చులు పెరిగిపోతుండడంతో పేదలకు ఆరోగ్య సంరక్షణ అనేది ఓ ఉత్పాతం కింద అనుభవానికి వస్తోంది. ఈ భారీ ఖర్చులు వారి జీవనాన్ని కూడా దెబ్బ తీస్తున్నాయి. ఒక్కోసారి శాశ్వతంగా ఆర్థికంగా చితికిపోవాల్సి వస్తోంది కూడా. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల అమలుతో ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ల ఖర్చులు గణనీయంగా తగ్గి, పేద ప్రజల జీవనాల మీద పడుతున్న ప్రతికూల ప్రభావాన్ని సాధ్యమైనంత నివారించే అవకాశం ఉంది.

(వ్యాసకర్త కేంద్ర పట్టణాభివృద్ధి వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి. ఇందులోని అభిప్రాయాలు ఆయన వ్యక్తిగతం.)

పైసల పందేరంతో ఫలితమెవరికి?

ఓట్ల కొరకు కోటి అప్పులు. అందులో భాగంగా కులాల వారీగా, మతాల వారీగా వరాల జల్లులు కురిపించడం చూస్తూనే ఉన్నాం. ఇప్పటి ప్రభుత్వాలు వ్యవసాయదారుడిని కూడా ఇలాంటి వ్యవస్థలో భాగంగా మార్చుకుంటున్నారు. కానీ ఆత్మహత్యలు ఆగటంలేదు, పట్టణాలకు వలసలు తగ్గటం లేదు. అంటే దీనికి ప్రభుత్వాలు ఇచ్చే భిక్ష ముఖ్యం కాదనేది అర్థమవుతున్నది. దీనికి ముఖ్య కారణం, ఇప్పటి వ్యవసాయ విధానం లోప భూయిష్టమైనది. దీనిని చక్కదిద్దకుండా, రైతులకు డబ్బు పంచడం వల్ల లాభం కన్నా నష్టమే ఎక్కువ. డాక్టర్లు రోగ నిర్ధారణ చేయకుండా మందులివ్వడం లాంటిదే.

పశు సంపదను వ్యవసాయానికి అనుసంధానం చేయనంతకాలం, రైతుకు డబ్బు పంపకాలు చేస్తూ పోతున్నా, రైతు కష్టాలు ఆగవు. దీనివల్ల వాతావరణం అననుకూలంగా ఉన్నప్పుడు రైతుకు రక్షణ కవచంలాగ పనిచేస్తుంది.

వ్యవసాయానికి ముఖ్యమైనవి నేల, వాతావరణం. వాతావరణం మనచేతిలో లేనిది. గతంలో పంటల విధానం వాతావరణానికి అనుగుణంగా ఉండేది. ఇప్పటి పంటల విధానం, లాభార్జన విధానం. అంటే లాభాలు-నష్టాలు అతిగా ఉంటాయి. పండిన పంట చేతికి వచ్చేంత వరకు భద్రత లేదు. దీనికి తోడు ఇప్పుడు గాలి - నీటి కాలుష్యం తోడైంది.

అతివృష్టి- అనావృష్టిలాగా, దిగుబడులు తగ్గినప్పుడు పెరిగినప్పుడు రైతుకు నష్టంలేని విధా నాలు ప్రభుత్వాలు అమలు చేయాలి. మనం చూస్తూనే ఉన్నాం. ప్రతి సంవత్సరం రైతులు తమ పంటను రోడ్లపై పోసేయడం. దళారులు ధరలు తగ్గించడం, వగైరాలు. మద్దతు ధర నిర్ణయించినా దళారులు వాటి నుంచి బయటపడే విధానాలను తయారు చేసుకుంటారు.

మన ప్రజానాయకులు, శాస్త్రవేత్తలు ప్రతి దానికి డాక్టర్ ఎం.ఎస్ స్వామినాథన్ పేరు చెప్పుకొని పబ్బం గడుపుకుంటుంటారు. ఇప్పటి వ్యవసాయ దుస్థితికి కారణం ఆయనే గదా! 40 శాతం దాకా పండిన పంట వృథాగా పోతున్నది. అంటే అదే శాతంలో వనరుల నాశనం జరుగు తున్నదన్న మాట. వ్యవసాయం - వ్యవసాయధారుడు బాగుపడాలంటే చదువు, ఆరోగ్యం, జీవనోపాధి వ్యవస్థను ఏర్పాటు చేయాలి. ఇది లేనంతకాలం, పల్లెప్రజల చూపంతా పట్టణాలపైననే ఉంటుంది. దీనితో అరాచకాలు పెరుగు తాయనేది మనం మరువకూడదు. ఇక్కడ కొన్ని ముఖ్యమైన విషయాలను చూద్దాం.

- విత్తనాల గురించి మాట్లాడతారేగాని, దీనిపై ఎలాంటి నిర్దిష్టమైన ప్రణాళికలు చేయడం లేదు.

- లక్షల కోట్లు ఖర్చుపెట్టి కోటి ఎకరాలకు (గతంతో కలిపా లేక కొత్తగానో తెలియదు) కాలువల ద్వారా నీరందిస్తాం అంటారు. మరి బోర్లు, బావులు, ఉచిత విద్యుత్, వగైరాలు ఎందుకో! రంగారెడ్డి జిల్లాకు నీరు ఎలా ఇస్తారో (మరి ఇతర ప్రాంతాలకు) మరి. ఇప్పటివరకు ప్రణాళికలే లేవు. కృష్ణా నదిలో నీటి లభ్యత హెచ్చుతగ్గులు అత్యధికం?

- కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తను ఎంపీలతో కలిసి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌ని కలిసి ఒక వినతిపత్రం సమర్పించారు. '3 లక్షల టన్నుల బియ్యానికి ఎగుమతి అనుమతి ఇవ్వాలని'. అదే రోజు ఇంకొక ఎంపీల గ్రూపు ప్రధానమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించింది. 'ఎరువుల సబ్సిడీని రిటైలర్సుకు ఇవ్వండి, రైతులకు ఇవ్వవద్దని.'

ఈ రెండు విషయాలపై నేను ప్రధాన మంత్రికి 2011 మే 23న లేఖ రాశాను. దీనికి ప్రతిస్పందనగా ఎరువుల మంత్రిత్వ శాఖ నుంచి 2011 డిసెంబర్ 28న లేఖ అందింది. దీని సారాంశం... నేను చెప్పినట్లే ఎరువుల సబ్సిడీ రైతులకు అందిస్తాం. దీనితో పాటు గ్యాస్, కిరోసిన్ సబ్సిడీలు కూడా వినియోగదారుడికీ ఇస్తాం అని.

ప్రధానమంత్రికి నేను పంపిన లేఖలో మూడు విషయాలున్నాయి, అవి:


1. వ్యాపారులకు 3 లక్షల టన్నుల బియ్యం ఎగుమతికి అనుమతిస్తే, ఈ అనుమతిని అడ్డుపెట్టుకొని 2 నుంచి 3 సార్ల దాకా దీనిని ఎగుమతులకు వాడుకుంటారు. దీనివల్ల రైతుకు గాని, ప్రభుత్వానికి గాని ఎలాంటి లాభముండదు. దీనికి బదులు రైతు సంఘాలు ప్రభుత్వం కలిసి ఎగుమతి చేయడం ద్వారా ప్రభుత్వానికి రైతులకు లాభం చేకూరుతుంది.

2. మద్దతు ధర విషయానికి వస్తే, దీని అమలు దళారుల చేతిలో ఉంటది. రేషన్ బియ్యానికి పాలిస్ చేసి అమ్ముకోవడం ద్వారా, రైతు పండించి బియ్యానికి మద్దతు ధర లభించడం లేదు. అందుకని, మద్దతు ధర చెక్కుల రూపంలో అందించాలని సూచించాను. దీనిని అమలు పరిచే దిశలో వ్యవసాయ శాఖలోని ఉపమంత్రిలను రాష్ట్రానికి పంపి, ముఖ్యమంత్రితో సమావేశం చేశారు. ''మద్దతు ధర చెక్కుల రూపంలో రైతుకు ఇవ్వాలి'' కాని దీనిని అమలు పరచలేదు. దళారులకు లాభం చేకూర్చే దిశలో ప్రభుత్వం ఉంది.

3. 2009 కంటే ముందు ప్రధాన మంత్రికి, ప్లానింగ్ కమిషన్‌కు లేఖ రాశాను. ''ఎరువుల సబ్సిడీని రైతులకు ఇవ్వాలని, కంపెనీలకు ఇవ్వవద్దని.'' దీనివల్ల దొడ్డిదారిన పోయే 30 శాతానికి పై ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. అలాగే రైతుకు ఎరువులు లభిస్తాయి అని. తరువాత 11యం, అహ్మదా బాద్ ప్రొఫెసర్స్ ఒక రిపోర్టు ప్రధానికి పంపారు.'' సబ్సిడి రైతులకు ఇవ్వవద్దు, పరిశ్రమలకే ఇవ్వాలని. దీనిని వ్యతిరేఖిస్తూ దీనిపై విశ్లేషాత్మక రిపోర్టు ప్రధాన మంత్రికి పంపడం జరిగింది. దీని తరువాత ప్రభుత్వం ఎరువుల సబ్సిడీని రైతులకే ఇవ్వాలని నిర్ణయించడం తరువాత 2011 బడ్జెట్ లో దీనిని చెప్పారు. ప్రభుత్వాలు దీని మసిపూసి మారెడు కాయ చేసేవిధంగా అమలు పరుస్తున్నారు. గ్యాస్ విష యంలో తూచా తప్పకుండా అమలు జరుగుతున్నది. ఇది జరుగుతున్నప్పుడు ఎరువుల విషయంలో ఎందుకు జరగదు మరి, పాలకులకే తెలియాలి. దేశం బాగుండాలంటే - రైతు బాగుండాలి రైతు బాగుం డాలంటే - వ్యవసాయ విధానం బాగుండాలి అలా లేనంత కాలం రైతుల ఆత్మహత్యలు అగవు దేశం బాగుండదు. బడాబాబులు లక్షల కోట్లు ఆర్జించు కుంటూపోతారు.

సజ్జల జీవానందరెడ్డి
మాజీ ప్రధాన సాంకేతిక సలహాదారు
ప్రపంచ వాతావరణ సంస్థ / ఐక్యరాజ్య సమితి
040-23550480

'హక్కుల' ధిక్కారధీర!



హక్కుల కోసం ఆమె గొంతు ప్రతి సందర్భంలోనూ వినిపించేది. ప్రభుత్వం అనుసరించే అప్రజాస్వామిక విధానాలను, అసహనాన్ని, మతం పేరుతో మహిళలపై జరుగుతున్న అకృత్యాలను ఎదిరించడంలోనూ ఆమె ముందుండేవారు. ఆదివారం కన్నుమూసిన ప్రఖ్యాత పాకిస్థాన్ న్యాయవాది, మానవ హక్కుల నేత ఆస్మా జహంగీర్ (66) మానవహక్కుల కోసం దృఢంగా నిలబడిన మహిళ. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా, ఎన్ని బెదిరింపులొచ్చినా ఆమె లక్ష్యం సడలిపోలేదు. ఆమెకు దైవదూషణనేరంపై జైలు శిక్ష విధించినా ఆమె బెదిరిపోలేదు. అనేక అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్న ఆమె నోబెల్ పురస్కారానికి కూడా నామినేట్ అయ్యారు. మూడు దశాబ్దాల పాటు సునిశిత విమర్శలతో మానవ హక్కుల న్యాయవాదిగా ఆమె ప్రపంచ ప్రఖ్యాతిగాంచారు. ఇస్లామిక్ రాజ్యంగా నడుస్తున్న పాకిస్థాన్‌లో ఒక మహిళ మానవ హక్కుల ఉద్యమ నేతగా ఎదురొడ్డి నిలబడడమే కాకుండా అంతర్జాతీయ ఖ్యాతిగాంచడం నిజంగా చెప్పుకోదగిన అంశమే! గౌరవం పేరుతో మహిళలను దూషించడాన్ని ఆమె వ్యతిరేకించారు. నాస్తికులంటూ ముస్లిమేతరులను వేధించడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. మత తీవ్రవాదాన్ని నిరంతరం వ్యతిరేకించేవారు. అక్కడితో ఆగకుండా నియంతృత్వ పోకడలను నిరసిస్తూ ప్రజాస్వామ్య స్వేచ్ఛ కోసం పోరాడారు. పాకిస్థాన్‌లో సైనిక పాలనలో ప్రతి సమస్యాత్మక అంశంలోనూ ఆమె గొంతు వినిపించేది. బహిరంగంగా పోరాడేందుకు సిద్ధమయ్యేవారు. ఆమె తరచూ చేస్తుండే చమత్కార వ్యాఖ్యానాలు సంబంధితులకు ముళ్లలాగే గుచ్చుకునేవి. అవే ఆమెకు అనేకమంది అభిమానులను, అనుయాయులను తెచ్చిపెట్టింది. జనరల్ పర్వేజ్ ముషారఫ్ సైనిక పాలనకు వ్యతిరేకంగా 2007లో పాకిస్థాన్‌లో న్యాయవిభాగం చేసిన ఉద్యమంతో ఆమె మొట్టమొదటిసారిగా హక్కుల ఉద్యమానికి పరిచయమయ్యారు. ఆ సమయంలో పాకిస్థాన్ స్వతంత్ర మానవహక్కుల సంఘానికి చైర్‌పర్సన్‌గా ఉన్నారు. ఆ పరిస్థితుల్లో దేశంలో అత్యవసర పరిస్థితి విధించి ఉద్యమ నాయకులతో పాటు ఆమెనూ గృహనిర్బంధంలో ఉంచారు. 2017లో ఆక్స్‌ఫర్డ్‌లో ఇచ్చిన ఉపన్యాసంలో, 'సైనిక పాలన దేశాన్ని అథోగతిపాల్జేయగా, దేశంలోని రాజకీయ నేతలు మాత్రం పంజాలు విసురుతూ, ప్రజాస్వామ్యంతో ఆడుకుంటున్నా'రని ఆమె నిశితంగా విమర్శించారు. 1987లో తన సోదరి హీనా జిలానీతో దేశంలో మహిళల కోసం మొట్టమొదటి చట్టపరమైన సంస్థను ఏర్పాటుచేయడంద్వారా పాకిస్థాన్ మహిళల హక్కులకు ఆమె మార్గదర్శకురాలిగా నిలిచారు. రేప్ బాధితుల్ని వ్యభిచారిణులుగా చూపించే చట్టాల్లోని అంశాలపై కొద్ది సంవత్సరాలుగా ఆమె పోరాటం చేస్తున్నారు. మతతత్వ ఇస్లామిక్ గ్రూపులు మహిళలపై చేస్తున్న అమానుషదాడులను ఆమె తీవ్రంగా నిరసించారు. మారథాన్‌లలో మహిళలు పాల్గొనడాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ 2005లో ఆమె ఊరేగింపు నిర్వహించినందుకు అరెస్టయ్యారు. మానవ హక్కుల కార్యాలయాన్ని పోలీసులు చుట్టుముట్టారు. ఒకదశలో ఆమెపై భౌతికదాడికి ప్రయత్నించినా ఆమె వెనుదిరగలేదు. ఆస్మా జహంగీర్ మృతి పట్ల అంతర్జాతీయ మానవ హక్కుల కార్యకర్తలు నివాళులర్పించారు. ఆమె మరణం ఒక్క ఆమె కుటుంబసభ్యులకే కాకుండా గొంతు వినిపించలేని హక్కుల బాధితులందరికీ తీరని లోటని వారు సంతాపం ప్రకటించారు.

తాడేపల్లి శివరామకృష్ణారావు
7396955147

ఓం నమఃశివాయ



జ్యోతిర్లింగ దర్శనం సర్వపాపహరం. మహా శివరాత్రి సందర్భంగా జ్యోతిర్లింగాల వివరాలను 'మనం కుటుంబం'లో తెలుసుకుందాం. మనదేశంలో ప్రతి హిందువు తన జీవితంలో కనీసం ఒక్కసారైనా జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు పరితపిస్తారు. ఇక వయసు మళ్లాక జీవితం ఆధ్యాత్మిక బాట పట్టాక వీటిని దర్శించుకోవాలనే తపన అందరిలో కలగడం సహజం. భక్త సులభుడైన భోళా శంకరుడిని కనులారా చూడాలనుకునే వారు, కఠినమైన జ్యోతిర్లింగాల యాత్ర చేసి హరహర మహాదేవ అని శివుడిని ఆరాధిస్తారు. దేశవ్యాప్తంగా 12 ప్రాంతాల్లోని జ్యోతిర్లింగాల దర్శనంతో మానవ జన్మ ధన్యమవుతుంది. కోరిన కోర్కెలు తీర్చే జ్యోతిర్లింగ స్వరూపమైన ఆదిదేవుడిని దర్శించాలంటే ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చాలి.

మనం కుటుంబం
మంగళవారం, 13 ఫిబ్రవరి 2018
www.manamnews.com



శ్రీశైల మల్లికార్జున స్వామి

ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల అడవుల్లోని శ్రీశైలం కొండల్లో మల్లికార్జునుడి రూపంలో ఆ శివయ్య కొలువు దీరారు. పరమేశ్వరుడు భార్య గౌరీ దేవితో కలిసి స్వయంభువుగా శ్రీ భ్రమరాంబ సహిత మల్లికార్జునుడుగా వెలిశాడు. శ్రీశైల మహాక్షేత్రం... కర్నూలు జిల్లా దోర్నాల్ రైల్వేస్టేషన్ నుంచి 52 కిలోమీటర్లు, హైదరాబాద్‌కు 230 కిలోమీటర్ల దూరంలో ఉంది.

కేదారేశ్వరుడు

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో కేదారేశ్వర ఆలయం ఉంది. ఏప్రిల్ నుంచి నవంబరు నెల వరకే ఈ ఆలయాన్ని తెరుస్తారు. విష్ణుమూర్తి నరనారాయణులుగా కొన్ని వేల సంవత్సరాలు శివున్ని ధ్యానించి తపస్సు చేసి లోక కల్యాణార్థంఈ లింగాన్ని ప్రతిష్టించినట్లు పురాణ కథ. బొందితో స్వర్గానికి వెళ్లేందుకు పాండవులు ఈ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా నిర్మించారని ప్రతీతి. అంతరాలయంలో నేటికీ పాండ వులు, ద్రౌపది విగ్రహాలు ఉన్నాయి. ఆదిశంకరాచార్యుల సమాధి, శివపార్వతుల తపోభూమి, ఆదిదంపతుల కళ్యాణ సమయంలోని హోమ గుండాన్ని నేటికీ దర్శించవచ్చు. హరిద్వార్ నుంచి గౌరీకుండ్ వరకు బస్సు మార్గం ఉంది, ఆతరువాత గుర్రాలమీద ప్రయాణించి కేదార్‌నాథ్ చేరవచ్చు. లేదా నడుచుకుంటూ వెళ్లి కేదారేశ్వరుడిని దర్శించుకోవచ్చు.



విశ్వనాథేశ్వరుడు

ప్రళయ కాలంలో కూడా భూమిపై ఏమాత్రం చెక్కుచెదరకుండా ఉండే అతి పురాతన నగరంగా కాశీ నగరం పేరుగాంచింది. విశ్వనాథేశ్వరుడి జ్యోతిర్లింగం కాశీ క్షేత్రంలో ఉంది. గంగానది తీరంలో బౌద్ధ, జైన మతాలవారు, హైందవులు అనేకమంది తీర్థయాత్రికులు కాశీ విశ్వేశ్వరుని దర్శించుకుంటారు. అవిముక్త జ్యోతిర్లింగంగా నిలిచే విశ్వేశ్వరాలయం బంగారు శిఖరాలను కలిగి ఉంది. విశ్వనాథ దేవాలయం సన్నిధిలో విశాలాక్షి అమ్మవారు కూడా కొలువై ఉన్నారు. కాశీలో ఎన్నో ఆలయాలు, గంగానదీ తీరంలో మరెన్నో స్నాన ఘట్టాలు ఉన్నాయి. ఈ క్షేత్రంలో స్నాన, దాన, హోమం చేసిన వారికి ఈశ్వర వరప్రసాదంతో మరుజన్మ ఉండదని ప్రతీతి. సమీపంలోనే అన్నపూర్ణేశ్వరి శక్తి పీఠం కూడా ఉంది. ఇక అంత్యదశలో ఇక్కడ మరణించేందుకు వచ్చే భక్తులకు లెక్కేలేదు.



సోమనాథ్ ఆలయం

దేశంలోని మొత్తం 12 జ్యోతిర్లింగాలలో ఒకటైన సోమనాథేశ్వరుడు గుజరాత్ రాష్ట్రం లోని సౌరాష్ట్ర జిల్లాలో కొలువై ఉన్నాడు. ఈ క్షేత్రాన్ని దర్శించిన శ్రీకృష్ణ పరమాత్ముడు తన లీలతో వెలిగించిన దీపం నేటికీ ప్రజ్వరిల్లుతుండటం ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడ ఉన్న చంద్రకుండంలో స్నానం చేసి సోమ నాథేశ్వరుడిని దర్శిస్తే సర్వ పాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. చంద్రుడే స్వయంగా ఈ సోమనాథేశ్వరుడిని ప్రతిష్టించినట్లు పురాణ గాథలు చెబుతున్నాయి. చరిత్రను బట్టి చూస్తే ఎన్నో సార్లు ఈ ఆలయంపై దండయాత్రలు జరిగాయి. దీంతో ఇక్కడ సరికొత్త సోమనాథ ఆలయాన్ని పునర్‌నిర్మించారు.



మహాకాళేశ్వర జ్యోతిర్లింగం



మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఉజ్జయినీ పట్టణంలో శ్రీ మహాకాళేశ్వరాలయం ఉంది. ఈ దేవాలయం రుద్రసాగరం సమీపాన ఉంది. క్షిప్ర నదీ తీరంలో మంత్ర శక్తి వల్ల ఉద్భవించిన స్వయంభూ జ్యోతిర్లింగం. తాంత్రిక మంత్రాలతో ఇక్కడ పూజలు నిర్వహిస్తారు. ఆలయ ముఖద్వారం దక్షిణాభిముఖంగా, శ్రీచక్ర యంత్రం తిరగేసి ఉండడం ఇక్కడి ప్రత్యేకత. ఐదు అంతస్తుల్లో ఉన్న ఆలయంలో మహాకాళేశ్వరుడికి ప్రాతఃకాలం భస్మాభిషేకం చేస్తారు. ఇక్కడ కాలభైరవునికి మద్యం నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ దేవాలయంలోని మహాకాళేశ్వరుని విగ్రహాన్ని ''దక్షిణామూర్తి'' అని కూడా అంటారు. ఉజ్జయినిలో శివలింగాలు మూడు అంతస్థులుగా ఉంటాయి. అన్నింటి కంటే కింద ఉన్నది మహా కాళ లింగం. మధ్యలో ఉండేది ఓంకార లింగం, ఆ పైన ఉండేది నాగేంద్ర స్వరూపమైన లింగం.

రామేశ్వరం


తమిళనాడు రాష్ట్రంలో రామేశ్వరాలయం ఉంది. ఇక్కడి నిర్మాణ శైలికి చాలా పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. రామేశ్వరంలోని బావుల్లో నీటితో స్నానం చేస్తే సమస్త బాధలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. ఇక్కడ మొత్తం 64 తీర్థాలు ఉన్నాయి. రామనాథ స్వామి కొలువై ఉన్న రామేశ్వరం ఓ చిన్న ద్వీపం.



ఓంకారేశ్వరుడు

మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖాండ్వా జిల్లాలో ఈ పుణ్యక్షేత్రం ఉంది. వింధ్య పర్వతాల్లో, నర్మదా నదీ తీరంలో ఓంకారేశ్వరుడు వెలిశాడు. సంస్క ృత ఓం ఆకారంలో వెలసిన ఈ క్షేత్రంలోని ఓంకారేశ్వర లింగం, అమరేశ్వర లింగం పక్కపక్కనే ఉండడం విశేషం. ఇక్కడ ఉన్న రెండు కొండల మధ్య నర్మదా నదిని, ఈ క్షేత్రాలను ఆకాశం నుంచి చూస్తే 'ఓం' ఆకారంగా కనిపిస్తుందిట. అందుకే దీనికి ఓంకారేశ్వర క్షేత్రం అని పేరు.





త్రయంబకేశ్వరుడు

మహారాష్ట్రలోని నాసిక్‌కు 30 కిలోమీటర్ల దూరంలో త్రయంబకేశ్వరాలయం ఉంది. బ్రహ్మవిష్ణువుల ప్రార్థనలతో స్వయంభువుగా వెలసి బ్ర హ్మాతో త్రయంబకేశ్వరుడిగా కీర్తనలందుకొన్న త్రయంబకేశ్వర క్షేత్రం కథనాలు ప్రచారంలో ఉన్నాయి. త్రినేత్రుడు ఈ క్షేత్రంలో త్రయంబకేశ్వరుడిగా భక్తుల సేవలందుకుంటున్నారు.



భీమేశ్వర లింగం

మహారాష్ట్రలోని సహ్యాద్రి కొండల్లో పూణేకు 110 కిలోమీటర్ల దూరంలో కృష్ణా నది ఉపనది భీమా నది ప్రాంతంలో శివయ్య భీమశంకర జ్యోతిర్లింగంగా వెలిశారు. భీమశ్వర ఆలయాన్ని 13వ శతాబ్దంలో నాగరా పద్ధతిలో పీష్వాల దీవాన్ అయిన నానా ఫడ్నవీస్ నిర్మించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తున్నది. ముంబై, పుణె, ఔరంగాబాద్, అహ్మద్‌నగర్ ప్రాంతాల నుంచి వివిధ రకాల రవాణా సౌకర్యాలు ఈ స్థలానికి ఉన్నాయి. ముంబై, పుణె నుంచి బస్సు సౌకర్యం ఉంది.

వైద్యనాథేశ్వరుడు

జార్ఖండ్ రాష్ట్రంలో సంతాల్ పరగణా ప్రాంతంలో దేవఘడ్ జిల్లాలో వైద్యనాథేశ్వరాలయం ఉంది. పాట్నా నుంచి 220 కిలోమీటర్ల దూరంలో ఉంది. మహారాష్ట్రలో కట్నీపూర్ దగ్గర ఉన్న పెద్ద శివాలయాన్ని కూడా వైద్యనాథ జ్యోతిర్లింగంగా పూజిస్తున్నారు. ఈ రెండింటి నేపథ్యమూ రామాయాణాంతర్గత రావణాసురిడి కథతో ముడి పడి ఉంది. ఈ లిం గా న్ని పూజించే వారికి వ్యాధులు నయం అవు తుండడం వల్ల వైద్యనాథేశ్వరుడిగా మహా శివుడిని పిలుస్తారు.



నాగనాథేశ్వరుడు

అరణ్యవాసంలో భాగంగా దారుకా వనంలో ఉన్నప్పుడు పాండవులే స్వయంగా ఈ ఆలయాన్ని నిర్మించినట్లు పురాణ గాథ. మనదేశంలో రెండు, మూడు చోట్ల ఉన్న నాగనాథేశ్వరుడి ఆలయాల్లో ఏది జ్యోతిర్లింగం అన్న విషయంపై స్పష్టత లేదు. అయితే ఎక్కువగా ప్రాచుర్యంలో ఉన్న నాగనాథేశ్వర దేవాలయం మాత్రం గోమతి. గుజరాత్‌లోని ద్వారకాధీష్ సమీపంలో ఉన్నదాన్నే జ్యోతిర్లింగంగా అత్యధికులు విశ్వసిస్తున్నారు.



ఘృష్ణేశ్వరుడు

మహారాష్ట్రలోని ఔరంగబాద్ పట్టణానికి 30 కిలోమీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. ఘృష్ణేశ్వర్‌కు అత్యంత సమీపంలోనే ప్రపంచ ప్రసిద్ధిగాంచిన అజంతా ఎల్లోరా గుహలున్నాయి. దేవగిరి కొండపై ఘృష్ణేశ్వరుని ఆలయం వెలిసింది. శైవులు, వీర శైవులకు ఘృష్ణేశ్వర్ పరమపవిత్రమైన ప్రాంతంగా నిలిచింది.



పీఎఫ్‌పై వడ్డీ 8.65 శాతమే

- 2018లోనూ ఈపీఎఫ్‌వో కొనసాగింపు
- 21న భేటీ కానున్న ధర్మకర్తల బృందం
- చందాదారుల ఖాతాకు ఈటీఎఫ్ జమ!
- తాజా ప్రతిపాదన.. సమావేశంలో చర్చ?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) 2017-18కిగాను 5 కోట్ల మంది చందాదారుల భవిష్యనిధిపై వడ్డీని 8.65 శాతంగానే కొనసాగించనుంది. ఈ నెల 21న ఈపీఎఫ్‌వో ధర్మకర్తల బృందం సమావేశం కానున్న నేపథ్యంలో సంస్థ వర్గాలు సోమవారం ఈ మేరకు తెలిపాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018)లో వడ్డీ శాతం కొనసాగింపునకు వీలుగా లోటు భర్తీకోసం రూ.2,886 కోట్ల విలువైన ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్)లను ఈ నెలలోనే ఈపీఎఫ్‌వో విక్రయించింది. కాగా, 2015-16లో చందాదారులకు 8.8 శాతం వడ్డీ ఇవ్వగా, 2016-17లో ధర్మకర్తల మండలి దీన్ని 8.65 శాతానికి తగ్గించింది. తనవద్దగల నిధులపై 16 శాతం ప్రతిఫలం వంతున ఈపీఎఫ్‌వో రూ.1,054 కోట్లు ఆర్జించింది. దీనికి ఈటీఎఫ్‌ల అమ్మకంద్వారా సమకూరిన నిధులను కలిపితే 2018లోనూ 8.65 శాతం వడ్డీని కొనసాగించేందుకు ఇబ్బంది ఉండదని ఈపీఎఫ్‌వో వర్గాలు పేర్కొంటున్నాయి. మరోవైపు తాజా సమావేశం చర్చనీయాంశాలతోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సర ఆదాయ అంచనాలను ధర్మకర్తల బృందానికి ఇంకా అందజేయలేదని తెలిపాయి. వీటిని 21నాటి భేటీ సమయంలో సమర్పించే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నాయి. ఇక 2015 ఆగస్టు నుంచి ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెడుతున్న ఈపీఎఫ్‌వో ఇప్పటిదాకా రూ.44వేల కోట్లను మదుపు చేసింది. అయితే, తొలిసారిగా ఇందులో రూ.2,286 కోట్ల విలువైన ఈటీఎఫ్‌లను ఇటీవలే విక్రయించింది. తాజా సమావేశం సందర్భంగా ఈటీఎఫ్‌లను చందాదారుల భవిష్యనిధి ఖాతాలకు జమ చేసే ప్రతిపాదనపై ధర్మకర్తల బృందం చర్చించనుందని సమాచారం. చందాదారులలో చాలామందికి ఆర్థిక అవగాహన లేకపోవడంతో ఈ మేరకు యోచిస్తున్నట్లు ఈపీఎఫ్‌వో వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే, దీనిపై నిర్ణయాధికారాన్ని ఉద్యోగులకే వదిలేయాలన్న ప్రతిపాదన కూడా పరిగణనలో ఉంది.

ముప్పేట దాడి



ఒకేసారి 3 రకాల జ్వరాలు.. **మలేరియా.. డెంగ్యూ.. చికన్‌గున్యా**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: వర్షాకాలం వస్తోందంటే మలేరియా, డెంగ్యూ, చికన్‌గున్యా.. ఇలాంటి జ్వరాల్లో ఏదో ఒకటి పీడిస్తుందున్న భయం మాత్రమే ఇప్పటిదాకా ఉండేది. కానీ, ఇప్పుడు ఒకేసారి మూడు రకాల జ్వరాలూ ముప్పేట దాడి చేస్తాయన్న సంగతి వెల్లడైందని వైద్యవర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికైతే ఓ రెండుమూడు కేసులు వెలుగులోకి వచ్చాయని, ఇది ఇలాగే కొనసాగితే రోగులకు చికిత్స చాలా కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. జామియా మిలియా ఇస్లామియా (జేఎంఐ) పరిశోధకులు ఇలాంటి రెండు కేసులు తమ దృష్టికి వచ్చినట్లు వెల్లడించారు. ఈ మేరకు 2016 ఆగస్టులో ఓ మూడేళ్ల బాలుడు జేఎంఐ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చాడని.. అతడికి ఈ మూడు జ్వరాలూ సోకాయని పరిశోధకులలో ఒకరైన డాక్టర్ మహ్మద్ అబ్దుల్లా తెలిపారు. రెండో కేసులో 21 ఏళ్ల విద్యార్థి ఒక నెల తర్వాత అదే కేంద్రానికి రాగా.. అతడికీ ఈ మూడు జ్వర లక్షణాలు కనిపించాయని పేర్కొన్నారు. ఇద్దరికీ బాగా తీవ్రస్థాయిలో జ్వరంతోపాటు చలి, ఏదో ఇబ్బందిగా అనిపించడం, ఒళ్లు నొప్పులు, తలనొప్పిలాంటి లక్షణాలున్నాయి. వాళ్లకు

దోమల నియంత్రణే ప్రధానం

పారిశుధ్య లోపం కారణంగా దోమలు విజృంభించడమే ఈ జ్వరాల వ్యాప్తికి ప్రధాన కారణమని అపోలో ఆస్పత్రి జనరల్ మెడిసిన్ డిపార్టుమెంట్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సురంజిత్ చటర్జీ అన్నారు. ప్రధానంగా వర్షాకాలంతోపాటు ఆ తర్వాతి సమయంలో కూడా ఎక్కడ పడితే అక్కడ నీళ్లు నిల్వ ఉండటం వల్ల రెండు రకాల దోమలు పుట్టుకొస్తున్నాయని, ఏటా దేశంలోని పలు ప్రాంతాల్లో ఈ జ్వరాలు విస్తరిస్తున్నాయని ఆయన చెప్పారు. ఇంతవరకు ఏవో రెండు రకాల జ్వరాలతో మాత్రమే వచ్చేవారు గానీ.. ఇప్పుడు ఒకేసారి మూడు రకాల జ్వర లక్షణాలు ఉండటం.. రక్తపరీక్షలలో అవి నిర్ధారణ కావడంతో ముప్పు చాలా తీవ్రస్థాయిలో ఉందన్నది స్పష్టమవుతోందన్నారు.

మూడు రకాల జ్వరానికి సంబంధించిన రక్త పరీక్షకు వారు సూచించారు. ఆ మేరకు తొలుత అందిన ఫలితాల్లో మలేరియా సోకినట్లు తేలడంతో దానికి చికిత్స ప్రారంభించారు. ఆ తర్వాత అందిన రక్త పరీక్ష ఫలితాలు చూసి వైద్యులు ఆశ్చర్యపోయారు. వీటిలో మిగిలిన రెండు జ్వరాలు కూడా సోకినట్లు అవి వెల్లడించడమే ఇందుకు కారణం. దీంతో ఇలాంటి ముప్పేట దాడిని ఎదుర్కొనడానికి జాతీయ స్థాయి కార్యాచరణ ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలని వైద్యవర్గాలు అభిప్రాయపడ్డాయి. ఈ రెండు కేసులు మాత్రమేగాక ఢిల్లీలోని పశ్చిమవిహార్ ప్రాంతంలోగల శ్రీ బాలాజీ యాక్షన్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌కు గత నెలలో చికిత్స కోసం వచ్చిన 55 ఏళ్ల వ్యక్తికి కూడా ఈ మూడు రకాల జ్వరాలు ఉన్నట్లు గుర్తించి వైద్యులు అవాక్కయ్యారు. ఈ జ్వరాల్లో అనాఫిలిస్ దోమవల్ల మలేరియా సోకుతుండగా ఎడిస్ ఈజిప్టై దోమల వల్ల డెంగ్యూ, చికన్‌గున్యా వ్యాధులు వ్యాపిస్తాయన్నది తెలిసిందే. ఇలా మూడు జ్వరాలూ ముప్పేట దాడిచేస్తే చికిత్స ఎలా ఉండాలన్నది ఇప్పటి దాకా ఎవరి ఊహలకూ అందని అంశమే. ఈ నేపథ్యంలో ప్రస్తుతం మూడింటికీ విడివిడిగా చికిత్స చేస్తున్నారు.

చికిత్స చేసేదిలా..

శ్రీ బాలాజీ యాక్షన్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఒకేసారి ఈ మూడు జ్వరాలకు ముమ్మరంగా చికిత్స చేశారు. అందులో ఇంట్రావీనస్ అర్టెసునేట్, సెఫ్ట్రియాగ్జోన్, పాంటోసిడ్, పాసిమోల్, ఎమెసెట్, మ్యుకైన్ జెల్.. వీటన్నింటితో పాటు ఇంట్రావీనస్ డెక్స్‌ట్రోజ్, రింగర్ లాక్టేట్, డెక్స్‌ట్రోజ్ నార్మల్ సెలైన్ పెట్టారు. అప్పుడు కొంతవరకు ఆ జ్వరాలు అదుపులోకి వచ్చాయి.

పురుషోత్తం బెయిల్ పిటిషన్

- హైకోర్టులో దాఖలు.. రేపు విచారణ



హైదరాబాద్, ఫిబ్రవరి 12 (మనం ప్రతినిధి): తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగం డైరెక్టర్ పురుషోత్తమ్‌రెడ్డి తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని సోమవారం హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన రిట్‌ను హైకోర్టు బుధవారం విచారణ జరపనుంది. తాను పోలీసుల విచారణకు సహకరిస్తారనని, బెయిల్‌మంజూరు చేయాలని రిట్‌లో హైకోర్టును కోరారు.ఇదిలా ఉండగా పురుషోత్తమ్‌రెడ్డి అల్లుడు, బావమరిది వేరువేరుగా తమను ఏసీబీ అధికారులు బెదిరింపులు, వేధింపులకు గురిచేస్తున్నారని దాఖలు చేసిన వ్యాజ్యాలపై సోమవారం విచారణ జరిగింది. బెదిరింపులు, వేధింపులు, సాధింపులు లేకుండా దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన రూలింగ్ మేరకు తమను దర్యాప్తు జరిపేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ పురుషోత్తంరెడ్డి అల్లుడు జి. నిపుణ్ రెడ్డి దాఖలు చేసిన రిట్‌ను ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి ఏవీ శేషసాయి విచారణ జరిపారు. చట్ట వ్యతిరేకంగా ఇష్టానుసారంగా ఏసీబీ పోలీసులు వ్యవహిస్తున్నారని నిపుణ్‌రెడ్డి లాయర్ వాదించారు. పిటిషనర్ సోదరుడు నిశాంత్‌రెడ్డిని అర్ధరాత్రి పోలీసులు అరెస్ట్ చేయడం అందుకు ఉదాహరణ అన్నారు. పురుషోత్తమ్‌రెడ్డి సంపాదననకూ, ఆయన కుమార్తెను పెళ్లి చేసుకున్న పిటిషనర్ నిపుణ్‌రెడ్డికీ సంబంధం ఏమిటని ప్రశ్నించారు. మూడు దశాబ్దాలుగా వ్యాపారాలు చేస్తున్నారని, రెండేళ్ల క్రితం పురుషోత్తమ్‌రెడ్డి కుమార్తెను వివాహం చేసుకున్నారని, రాత్రికి రాత్రే నిపుణ్‌రెడ్డికి డబ్బు వచ్చేయలేదన్నారు. పురుషోత్తమ్‌రెడ్డి ఎక్కడు న్నారో చెప్పాలని పోలీసులు వేధిస్తున్నారని న్యాయవాది వాదించారు. పిటిషనర్ ఆరోపణలపై కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీని న్యాయ మూర్తి ఆదేశించారు. విచారణ 19కి వాయిదా పడింది. పురుషోత్తంరెడ్డి బావ మరిది శ్రీనివాస్‌రెడ్డి కూడా తనను ఏసీబీ పోలీసులు వేధిస్తున్నారంటూ హైకోర్టులో పిటిషన్ వేశారు. పురుషోత్తంరెడ్డి అక్రమ సంపాదన అంతా శ్రీనివాస్‌రెడ్డి ద్వారానే లావాదేవీలు జరిగాయని ఏసీబీ లాయర్ వాదించారు.

హరహర.. మహాదేవ!

- శివరాత్రికి శివాలయాలు ముస్తాబు
- రాజన్న ఆలయంలో మొదలైన వేడుకలు
- కురవి బ్రహ్మోత్సవాలకు అంకురారోపణ
- సీఎం కేసీఆర్ శివరాత్రి శుభాకాంక్షలు

మనం న్యూస్ నెట్‌వర్క్, ఫిబ్రవరి 12: లయకారుడు.. ఆది దేవుడు..భక్తవశంకురుడు..నీలకంఠుడి పర్వదినమైన మహాశివరాత్రి కోసం.. రాష్ట్ర వ్యాప్తంగా శివాలయాలు ముస్తాబయ్యాయి. అభిషేకాలు, ప్రత్యేక పూజలు, శివకల్యాణోత్సవాలు, కుంకుమార్చనలు, జాగరణలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీరాజరాజేశ్వరీ స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శివరాత్రి సందర్భంగా రాజన్న ఆలయంలో 3 రోజులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రాత్రి 9 గంటలకు నిశిపూజ, అనంతరం మహాశివరాత్రి పూజలు నిర్వహిస్తారు. ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేశారు. రాజేంద్ర గుడిచెరువు ఆవరణలో శివార్చన పేరిట సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఒకేసారి పదివేల మంది జాగారాలు నిర్వహించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. జాతర ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1.20కోట్లు కేటాయించింది. శివరాత్రి సందర్భంగా ఐదు లక్షల మంది భక్తులు వస్తారని, అందుకు తగిన విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 1600 మంది పోలీసులతో పెద్దఎత్తున బందోబస్తును నిర్వహిస్తున్నారు. 800 మంది కార్మికులతో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టారు. రాష్ట్రంలో ప్రముఖ శైవ క్షేత్రాలైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం, ఏడుపాయల, కీసర ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మరోవైపు, మహబూబాబాద్ కురవి మండల కేంద్రంలో కొలువై ఉన్న శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి జాతర సోమవారం అంకురారోపణ పూజలతో ప్రారంభించారు.





స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

రాజన్న క్షేత్రంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం భక్తులు యధావిధిగా స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి 9 గంటలకు నిశిపూజ అనంతరం భక్తులకు సర్వదర్శనంతో పాటు రాత్రి 12 గంటల నుండి తెల్లవారు జామున 3 గంటల వరకు స్థానికులకు దర్శన సౌకర్యాన్ని ఆలయాధికారులు ఏర్పాటుచేశారు. ఉదయం 3.30 పిమిషాల నుండి 4 గంటల వరకు ఆలయ శుద్ధి, మంగళవాయిద్యాలు, 4 గంటల నుండి 4.25 వరకు సుప్రభాతం, 4.25 నుండి 6 గంటల వరకు ప్రాతకాల పూజ అనువంశిక అర్చకుల దర్శనము, మంగళవారం మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఉదయం 7 గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. 8 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పట్టువస్త్రాల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనికి దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డితో పాటు ఇతర మంత్రులు స్థానిక ఎమ్మెల్యే రమేష్‌బాబు, జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్ హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే మంగళవారం సాయంత్రం 4 గంటలకు 4 నుండి 5 గంటల వరకు శివస్వాముల కోసం ప్రత్యేంగా దర్శన సమయాన్ని అధికారులు కేటాయించారు. 6.05 నిమిషాలకు స్వామివారికి మహాలింగార్చన, రాత్రి 11.35 గంటలకు లింగోద్భవ సమయాన మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఆలయ అర్చకులు నిర్వహించనున్నారు.

కేసీఆర్ శివరాత్రి శుభాకాంక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (మనం ప్రతినిధి): ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు మహాశివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించేలా భగవంతుడు దీవించాలని ప్రార్థించినట్లు చెప్పారు. మహాశివరాత్రి సందరేంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున శివాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికార యంత్రాంగాన్ని సీఎం ఆదేశించారు. కాగా, గవర్నర్ నరసింహన్ కూడా వేరొక ప్రకటనలో రాష్ట్ర ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రులు హరీశ్‌రావు, లక్ష్మారెడ్డి, ఎంపీ కవిత తదితరులు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

భక్తులకు పర్యాటకశాఖ ప్రత్యేక ప్యాకేజీ..

మహాశివరాత్రి సందరాన్నీ పురస్కరించుకుని పర్యాటకశాఖ భక్తులకు ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. నాలుగు ప్రముఖ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులతో పాటు ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ నుంచి శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం, రామప్ప ఆలయాలకు పర్యాటకశాఖ ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది.

విశ్వనగరంగా మహానగరం

మొదటి పేజీ తరువాయి

నగరం నడిబొడ్డున ఉన్న స్థలాలతో పాటు, శివార్లలో ఉన్న భూములను బహిరంగ మార్కెట్లో అమ్మడం ద్వారా వేల కోట్ల రూపాయలు వచ్చేవి. 2004 నుంచి 2008వరకు అభివృద్ధిలో ఉన్న సంస్థ క్రమంగా ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. ఈ స్థితిలో ఉన్న హెచ్ఎండీఏను రెండేండ్లలోనే అభివృద్ధి పథంలో నిలిపేలా కమిషనర్ కృషి చేశారు. భవిష్యత్‌ను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ రూపొందించారు. ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఈ ఏడాది పొడవునా భూముల వేలానికి ఏర్పాట్లు చేస్తున్నారు. విశ్వనగరానికి అవసరమైన స్థాయిలో మౌలిక సౌకర్యాలు కల్పించడం ద్వారా వీటికి ప్రత్యేక విలువను రాబట్టనున్నారు. దీనివల్ల మరెంతో ఆదాయం చేకూరనుంది.

ఏడు జిల్లాల్లో హెచ్ఎండీఏ..!

హెచ్ఎండీఏ ఏడు జిల్లాలు.. 85 మండలాలు.. 849 గ్రామాలు.. 7228 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. గ్రేటర్ హైదరాబాద్‌ను మినహాయిస్తే 5,965 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని ప్రాంతాల్లో లే అవుట్లు, భవనాల నిర్మాణ అనుమతుల జారీ అధికారం సంస్థకు ఉంది. ఇక్కడ ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి కోసం మాస్టర్‌ప్లాన్-2031ను రూపొందించారు. 12 జోన్ల ప్రకారమే అభివృద్ధిపరమైన అనుమతులు జారీ చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో అభివృద్ధి పర్యవేక్షణ బాధ్యత చేపట్టిన హెచ్ఎండీఏకు ఆదాయం పెరిగింది. దీనితో రెట్టించిన ఉత్సాహంతో 2018లో సరికొత్త లక్ష్యాలతో ముందడుగు వేస్తోంది.

కోర్టు చిక్కులన్నీ క్లియర్ చేసి..

కోర్టు చిక్కుల్లో ఉన్న భూములు ఒక్కొక్కటిగా సంస్థకు చెందేలా చేశారు. ప్రస్తుతం హెచ్ఎండీఏలో ల్యాండ్ బ్యాంక్‌లో వందల ఎకరాలు ఉన్నాయి. కొన్ని భూములు అభివృద్ధి చేసిన లే అవుట్లలో ఉండగా, కొన్ని ప్రాంతాల్లో చేయాల్సి ఉంది. అభివృద్ధి చేసిన లే అవుట్లలో ఉన్న ప్లాట్లను గుర్తించి ఆన్‌లైన్‌లోనే వేలం ద్వారా అమ్మేటందుకు చర్యలు చేపట్టారు. ఉప్పల్ భగాయత్, లే అవుట్లలో మిగిలిన ప్లాట్లు, ప్రైవేటు రియల్ ఎస్టేట్ సంస్థలు గిఫ్ట్ డీడ్ కింద ఇచ్చిన ప్లాట్ల అమ్మకానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.1800 కోట్ల అంచనా...

కమిషనర్ ఏ ఒక్క భూ వివాదాన్నీ తేలికగా తీసుకోలేదు. అన్ని స్థాయిలో సుప్రీం కోర్టుకు నేరుగా వెళ్లి తమ భూములకు సంబంధించిన ఆధారాలను సమర్పించి సంస్థకు దక్కేలా చేశారు. అలా హెచ్ఎండీఏ పరిధిలో వివాదాలు పరిష్కరించి భూములను, ప్లాట్లను విక్రయించేందుకు సన్నాహాలు ప్రారంభించారు. దశల వారీగా వాటిని ఆన్‌లైన్‌లోనే బహిరంగ వేలంలో విక్రయించాలని నిర్ణయించారు. పాత లేఅవుట్లలో మిగిలి పోయిన 'స్ట్రే బిట్స్' సుమారు 3.63 లక్షల గజాలు అమ్మడంతో సుమారు రూ. 500 కోట్లు,ప్రైవేట్ లేఅవుట్లలో రియల్ ఎస్టేట్ సంస్థలు, గిఫ్ట్ డీడ్ రూపంలో ఇచ్చిన ప్లాట్లు 1.50 లక్షల గజాలను విక్రయించడం ద్వారా మరో రూ.150 కోట్ల ఆదాయం రానుంది.

టౌన్‌షిప్‌ల నిర్మాణం దిశగా అడుగులు..

హెచ్ఎండీఏ కొత్తగా మోడల్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలని భావిస్తోంది. దీనికి సంబంధించిన భూములు సైతం కోకాపేట, మియాపూర్, మహేశ్వరం వంటి ప్రాంతాల్లో ఉన్నాయి. ప్రధానంగా ఉప్పల్ -భగాయత్‌లో రైతుల కోసం 413 ఎకరాల్లో చేసిన లేవుట్లకు వారికి పంపిణీ చేయగా మిగిలిన 1.75 లక్షల గజాలను విక్రయించడం ద్వారా సుమారు రూ.800 కోట్లు, మరో 72 ఎకరాల్లో అభివృద్ధి చేసిన లేఅవుట్లో 82 ప్లాట్లను విక్రయించడంతో రూ. 600 కోట్లు హెచ్ఎండీఏ ఖజానాకు రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇక కొత్తగా అమల్లోకి వచ్చిన ల్యాండ్ పూలింగ్ స్కీం ద్వారా ఈఏడాది ప్రైవేటుల్లోనూ హెచ్ఎండీఏ లేఅవుట్లను అభివృద్ధి చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. అవి ఈ ఏడాదిలోనే ప్రారంభమవుతాయని, దీంతో ఈ ఏడాది పొడవునా భూములు విక్రయించేందుకు హెచ్ఎండీఏకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

అక్రమ కట్టడాలను నియంత్రిస్తాం

హైదరాబాద్ మహానగరాన్ని విశ్వనగరంగా మార్చడంలో హెచ్ఎండీఏ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. నేను కమిషనర్‌గా బాధ్యతలు తీసుకున్నప్పుడు హెచ్ఎండీ బ్యాంక్ నిలువ రూ.13కోట్లు ఉంది. అది జీతాల వరకు సరిపోయేది. అనంతరం ఒక్కొక్క సమస్యను అధిగమిస్తూ అభివృద్ధిలోకి వచ్చాం. ఇప్పుడు అప్పుల నుంచి నిధులిచ్చే స్థాయికి వచ్చాం. బాలానగర్ ఫ్లైఓవర్, సంగారెడ్డి, భువనగిరి, పటాన్ చెరుకు నిధులిచ్చాం.

- టి.చిరంజీవులు, హెచ్ఎండీఏ కమిషనర్



జాగిలాల పాసింగ్ అవుట్ పరేడ్

ఇంటలిజెన్స్ శాఖ భద్రతా విభాగం 17వ బ్యాచ్‌కు చెందిన జాగిలాలు, వాటి ట్రైనర్ల పాసింగ్ అవుట్ పరేడ్ సోమవారం నాడు మొయినాబాద్‌లోని పోలీస్ శిక్షణకేంద్రంలో నిర్వహించారు. దీక్షంత్ పరేడ్ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఎస్ ఎస్‌కే జోషికి గౌరవ వందనం చేస్తున్న పోలీస్ జాగిలాలు, వాటి శిక్షకులు.. శిక్షణ కాలంలో ప్రతిభ చూపిన జాగిలానికి సీఎస్ అభినందనలు.

స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రపంచ రికార్డు

15 వేల మంది రోడ్లు ఊడ్చి.. గుజరాత్ రికార్డును తుడిచేశారు భారీ సంఖ్యలో విద్యార్థుల హాజరు





హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 12(మనం ప్రతినిధి): హైదరాబాద్‌లోని రాంనగర్ డివిజన్‌లో చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ రికార్డులకు ఎక్కింది. సోమవారం ఉదయం 15,320 మంది విద్యార్థులు ఈ కార్యక్ర మంలో పాల్గొని, ఏకకాలంలో రోడ్లను ఊడ్చి హైరేంజ్ వరల్డ్ రికార్డును నగరానికి తీసుకొచ్చారు. గతేడాది గుజరాత్‌లో 5,058 మందితో రోడ్లు ఊడ్చి రికార్డు నెలకొల్పగా.. తాజా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులు ఈ రికార్డును తుడిచేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్-2018లో నగరవాసులందరూ పాల్గొని దేశంలో హైదరాబాద్ నగరాన్ని నెంబర్‌వన్‌గా నిలబెట్టాలని రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేద్కర్ ప్రభుత్వ కళాశాలలోని రాంనగర్ కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు వి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో రికార్డు స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హోంమంత్రి నాయిని నర్సింహ్మారెడ్డి, ప్రభుత్వసలహాదారు వివేక్, జీహెచ్ఎంసీ కమిషనర్ డా.బి.జనార్ధన్‌రెడ్డి, విద్యార్థులతో కలిసి మంత్రి స్వచ్ఛ కార్యక్రమంలో ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ దేశంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రారంభం చేయక ముందే రాష్ట్రంలో మన ముఖ్యమంత్రి కేసీఆర్ స్వచ్ఛహైదరాబాద్ కార్యక్రమంప్రారంభించారన్నారు. అదే స్ఫూర్తితో 2017లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భారతదేశ వ్యాప్తంగా ఉన్న మెట్రోనగరాల్లో హైదరాబాద్‌కు అగ్రస్థానం దక్కిందని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. దీని కింద నగరాన్ని 400 యూనిట్లుగా విభజించి జీహెచ్ఎంసీ సహకారంతో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఉద్ఘాటించారు. హైదరాబాద్ జనాభా కోటి దాటిన నేపథ్యంలో కేవలం 22 వేలమంది పారిశుధ్య కార్మికులు నగరాన్ని పూర్తిస్థాయిలో క్లీన్‌గా ఉంచడం సాధ్యంకాదన్నారు. కాబట్టి విద్యార్థులందరూ పరిశుభ్రతకోసం కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఇందుకోసం మన ఇంట్లోనే ప్రతిజ్ఞ తీసుకుంటే హైదరాబాద్ పరిశుభ్రంగా మారుతుందన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2018 సర్వేలో అందరం పాల్గొని హైదరాబాద్‌ను జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో ఉంచేందుకు కృషి చేద్దామని మంత్రి పిలుపునిచ్చారు. 44 లక్షల నీలంరంగు, ఆకుపచ్చ బుట్టలు ఇంటింటికి పంపిణీ చేశామ అయితే చాలామంది వాడటంలేదని మంత్రి అన్నారు.

విద్యార్థులూ పెద్దవాళ్లను మార్చండి..

స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు కేటీఆర్ కొన్ని సూచనలు చేశారు. చెత్త తొలగింపు విషయంలో మీ ఇంట్లో పెద్దవాళ్లలో మార్పు రావాలంటే మీరు బుద్ధి చెప్పాలని మంత్రి కేటీఆర్ సూచించారు. నగరం బాగుంటే మేం బాగుంటామని గట్టిగా పట్టుబట్టండి, ప్రతిజ్ఞ తీసుకోండి చెప్పారు. ఇది మీరు చేస్తే తప్పకుండా హైదరాబాద్ నగరానికి మంచి ఫలితాలు వస్తాయి అన్ని కేటీఆర్ అన్నారు. ఎంత ప్రయత్నంచేసినా మీ అందరి కృషి లేనిదే ఏదీ సాధ్యం కాదని కేటీఆర్ అన్నారు. అనంతరం మంత్రి కేటీఆర్ అధికారులు, విద్యార్థులు, నాయకుల అందరితో కుడి చేతి ముందుకు చాచి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మహముద్ అలీ, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు వివేక్, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి తో పాటు పలువురు పాల్గొన్నారు. వేలాదిగా తరలివచ్చిన విద్యార్థులతోపాటు జీహెచ్ఎంసీ కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

స్వచ్ఛత ప్రతిజ్ఞ..

'ఇంట్లోని తడి, పొడి చెత్తను తప్పనిసరిగా వేరు చేస్తాను. తడి చెత్తతో ఎరువు తయారు చేస్తాను. బహిరంగ ప్రదేశంలో మూత్రం పోయను. ఇతరులనూ పోయనివ్వకుండా చైతన్యం పరుస్తాను. మాంసాన్ని తీసుకుపోవడానికి టిఫిన్ బాక్సులను, కూరగాయాలు, సరుకుల కోసం జ్యూట్ లేదా క్లాత్ బ్యాగునే వాడుతాను. పాన్ తిని బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయను. సిగరెట్‌ను బహిరంగ ప్రదేశాల్లో తాగను. ఇతరులను తాగనివ్వను. ఇంటి నిర్మాణ వ్యర్థాలను ప్రభుత్వం సూచించిన ప్రదేశాల్లోనే వేస్తాను. చెత్త కాల్చి గాలిని కలుషితం చేయను. హైదరాబాద్ మహానగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కంకణబద్ధుడనై ఉంటాను'





హిమాచల్ ప్రదేశ్ రాజధాని షిమ్లాను మంచు దుప్పటి కమ్మేసింది. రెండు రోజులుగా విపరీతంగా మంచు కురుస్తోంది.. రోడ్లు, ఇళ్లు తేడా లేకుండా మంచు కప్పేసింది. అతిశీతల వాతావరణంలో కూడా.. పర్యాటకులు సిమ్లాకు పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు. టూరిస్టులు ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు

కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా కంబర్


- 20 ఏళ్ల తర్వాత మూడో కన్నడ వ్యక్తిగా రికార్డు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: ప్రముఖ కన్నడ కవి, రచయిత చంద్రశేఖర కంబర్ కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత అయిన కంబర్.. సాహిత్య అకాడమీ అధ్యక్ష ఎన్నికల్లో మరాఠీ రచయిత బాల్‌చంద్ర వి నెమాడే, ఒడిశా రచయిత ప్రతి భారాయ్‌లతో పోటీ పడ్డారు. కంబర్ ప్రస్తుతం అకాడమీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. సోమవారం జరిగిన ఈ ఎన్నికల్లో కంబర్ విజయం సాధించారు. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడిగా కంబర్ ఎన్నికై ఈ పదవి చేపట్టిన మూడో కన్నడ వ్యక్తిగా నిలిచారు. గతంలో కర్ణాటకకు చెందిన వినాయక కృష్ణ గోకక్(1983), యూఆర్ అనంతమూర్తి(1993) అకాడమీ అధ్యక్షులుగా వ్యవహరించారు. మళ్లీ ఇరవై ఏళ్ల తర్వాత కన్నడ రచయిత ఒకరు సాహిత్య అకాడమి అధ్యక్షుడిగా ఎన్నిక కావడం గమనార్హం. 1937, జనవరి 2న జన్మించిన కంబర్ పలు కన్నడ సినిమాలకు దర్శకత్వం కూడా వహించారు. హంపీలోని కన్నడ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ఉపకులపతిగా కూడా ఉన్నారు. 1991లో సాహిత్య అకాడమీ అవార్డు, 2011లో జ్ఞానపీఠ్ అవార్డు అందుకున్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. కేంద్ర సాహిత్య అకాడమీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా పదేళ్లు కొనసాగించారు. 2013లో అకాడమీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కర్ణాటక నుంచి ఎమ్మెల్సీగా కూడా బాధ్యతలు నిర్వహించిన కంబర్.. కేంద్ర నాటక అకాడమీ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వహించారు.

యుద్ధ సంసిద్ధతకు.. మాకు 3రోజులు చాలు

- సైన్యానికి ఆరేడు నెలలు అవసరం
- ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భగవత్ వివాదాస్పద వ్యాఖ్య
- సైన్యాన్ని అవమానించడమే.. రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం నెలకొంటే భారత సైన్యం కంటే వేగంగా స్పందించే సామర్థ్యం తమకుందంటూ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. బీహార్‌లో పర్యటిస్తున్న భగవత్ ముజఫర్‌పూర్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైతే సైనికులకు దీటుగా కార్యకర్తలను సన్నద్ధం చేయగల సత్తా సంఘ్‌కు ఉందని, రాజ్యాంగం అనుమతిస్తే అందుకు తాము సిద్ధమని భగవత్ వ్యాఖ్యానించారు. కేవలం మూడంటే మూడు రోజుల్లో ప్రతీ కార్యకర్తనూ యుద్ధానికి సిద్ధం చేసే సామర్థ్యం సంఘ్‌కు ఉందని.. ఇదేపని చేయడానికి సైన్యానికి ఆరేడు నెలలన్నా పడుతుందని పేర్కొన్నారు. ముజఫర్‌పూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలతో భగవత్ మాట్లాడుతూ.. భారత్ శక్తిమంతమైన హిందూ దేశంగా ఆవిర్భవించిననాడు ఆర్‌ఎస్‌ఎస్ ఉనికి కోల్పోతుందన్నారు. అప్పుడు సంఘ్ అవసరంలేదని చెప్పారు. ఆ కలను సాకారం చేసుకోవడానికి భారతీయ యువత తప్పనిసరిగా సంఘ్‌లో చేరాలని పిలుపునిచ్చారు. సమయం ఉంటే ప్రతిరోజూ లేదంటే నెలకోసారి అయినా తోటి సభ్యులను కలుసుకోవాలని సూచించారు. దానికీ సమయంలేదంటే సంఘ్ పేర్కొన్న ఆరు ప్రాథమిక నియమాలను పాటించాలని భగవత్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయన మరో అడుగు ముందుకేసి సంఘ్ కార్యకర్తలను సైన్యంతో పోల్చారు. దీనిపై వివరణ ఇస్తూ.. సంఘ్ సైనిక సంస్థ కాదని, తమది కేవలం పరివారిక్(కుటుంబ) ఆర్గనైజేషన్ అని పేర్కొన్నారు. అయితే, క్రమశిక్షణ, యుద్ధ సంసిద్ధత విషయంలో సైన్యంతో సరితూగగల సామర్థ్యం ఉందని స్పష్టం చేశారు. దేశం సంక్షోభ స్థితిలో ఉంటే ప్రాణాలను అర్పించేందుకు సంఘ్ కార్యకర్త సంతోషంగా ముందుకొస్తాడని వివరించారు. ఆపై 'యుద్ధం కోసం సిద్ధపడాలంటే ఆర్మీకి ఆరు నుంచి ఏడు నెలల సమయం పడుతుంది. అదే ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలకు మూడురోజులు చాలు' అని భగవత్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై ఇటు రాజకీయ వర్గాలలోనూ అటు సామాజిక మాధ్యమాలలోనూ వివాదాస్పదమయ్యాయి. దీనిపై తీవ్ర వివాదం రేగుతోంది. ఈ వ్యాఖ్యలు సైనికులను అవమానించడమేనని నెటిజన్లు మండిపడుతున్నారు. భగవత్ వ్యాఖ్యల నేపథ్యంలో సోమవారం ట్విట్టర్‌లో దుమారం రేగింది. ఆర్‌ఎస్‌ఎస్ ఇన్‌సల్ట్స్ ఆర్మీ పేరుతో హ్యాష్‌ట్యాగ్ వైరల్‌గా మారింది. ఆర్‌ఎస్‌ఎస్‌ను విమర్శిస్తూ గంటలకొద్దీ పలువురు ట్వీట్లు చేశారు. భగవత్ వ్యాఖ్యలపై స్పందించేందుకు బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా నిరాకరించారు. ఏదేశంకోసం ప్రాణాలొడ్డిన సైనికులను భగవత్ అగౌరవపరిచారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. భగవత్ వ్యాఖ్యలపై రాహుల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆర్‌ఎస్‌ఎస్ దీనిపై బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ వ్యాఖ్యలు ప్రతి భారతీయుడిని అవమానించేలా ఉన్నాయని, జాతి కోసం మరణించిన సైనికులను అగౌరవపరిచేలా ఆయన మాట్లాడారని రాహుల్ తప్పుపట్టారు. సైనికులంతా జాతీయ పతాకానికి శాల్యూట్ చేస్తారని.. భగవత్ చేసిన వ్యాఖ్యలు జాతీయ పతాకాన్ని కూడా అవమానించినట్టేనని రాహుల్ ట్వీట్ చేశారు. భగవత్ తన వ్యాఖ్యలతో అమర సైనికులను అవమానించారని రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) మండిపడింది.దేశ రక్షణలో వెలకట్టలేని త్యాగాలు చేస్తున్న భారత సైన్యాన్ని అగౌరవపరచడమేనని ఆరోపించారు. కాగా, భారత సైనిక సామర్థ్యాన్ని కించపరచడం భగవత్ ఉద్దేశం కాదని, వాటి మధ్య పోలికకు అర్థమేలేదని ఆర్‌ఎస్‌ఎస్ వివరణ ఇచ్చింది. సంఘ్‌చాలక్ వ్యాఖ్యలను వక్రీకరించారని పేర్కొంది.

48 గంటల్లో రెండో ఉగ్రదాడి

శ్రీనగర్‌లో తెగబడ్డ ముష్కరులు.. సీఆర్‌పీఎఫ్ క్యాంపులో జవాను మృతి.. సున్జవాన్‌లో మూడో రోజూ ఆపరేషన్



జమ్ము/శ్రీనగర్/ఇస్లామాబాద్, ఫిబ్రవరి 12: గట్టిగా 48 గంటలు గడిచేలోపే పాక్ ముష్కర మూకలు మరోదాడికి తెగబడ్డాయి. జమ్ములోని సున్జవాన్ ఆర్మీ క్యాంపుపై దాడిచేసి ఆరుగురిని పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులు శ్రీనగర్‌లో ఓ సీఆర్పీఎఫ్ జవాన్‌ను బలితీసుకున్నారు. సోమవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో ఇద్దరు ఉగ్రవాదులు శ్రీనగర్‌లోని కరణ్ నగర్‌లో గల సీఆర్పీఎఫ్ క్యాంపుపై దాడికి పాల్పడ్డారు. 49వ బెటాలియన్‌కు చెందిన క్యాంపు వద్ద ఇద్దరు భారీ ఆయుధాలతో సంచరించడం గుర్తించిన సెంట్రీ వారిపై కాల్పులు జరిపాడు. దీంతో అప్రమత్తమైన బలగాలు వారిని మట్టుబెట్టే ప్రయత్నం చేశాయి. అయితే ఉగ్రవాదులు అక్కడి నుంచి తప్పించుకునే సమీపంలోని ఓ పాడుబడిన ఇంట్లో నక్కారు. ఆ ఇంటిని చుట్టుముట్టి సీఆర్పీఎఫ్ జవాన్లు కాల్పులు జరుపుతున్నారు. ఎదురు కాల్పుల్లో ఓ జవాను ప్రాణాలు కోల్పోయాడు. ఈ నెల ఇదే ప్రాంతంలో లష్కరే తొయిబా ఉగ్రవాదులు దాడి చేసి పోలీసు కస్టడీలో ఉన్న ఉగ్రవాది నవీద్ జట్టూ అలియాస్ అబూ హంజాలాను తప్పించుకుని తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా, జమ్ములోని సున్జవాన్ ఆర్మీ క్యాంపుపై శనివారం జరిగిన ఉగ్రదాడికి సంబంధించిన ఆర్మీ సెర్చ్ ఆపరేషన్ మూడో రోజూ కొనసాగింది. శనివారం తెల్లవారుజామున 4.55 గంటల సమయంలో పాక్‌కు చెందిన ముగ్గురు జైషే మహ్మద్ ఉగ్రవాదులు క్యాంపుపై దాడి చేసి సమీపంలోని క్వార్టర్స్‌లో దూరిన విషయం తెలిసిందే. దీంతో వెంటనే క్వార్టర్స్‌ను చుట్టుముట్టిన సైనికులు వారిని శనివారం అర్ధరాత్రికల్లా మట్టుబెట్టేశారు. మూడు మృతదేహాలతో పాటు గ్రనేడ్లు సహా భారీ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే క్వార్టర్స్‌లో ఇంకా ముష్కరులేమైనా మిగిలి ఉన్నారేమోనని ఆది, సోమవారాల్లో కూడా సైనిక ఆపరేషన్ కొనసాగించారు. ఈ ఘటనలో ఐదుగురు సైనికులు సహా ఓ జవాను తండ్రి ప్రాణాలు కోల్పోగా.. పది మంది గాయపడ్డారు.

పాక్‌కు సర్జికల్ స్ట్రైక్స్ భయం!

సున్జవాన్ ఆర్మీ క్యాంపుపై జైషే ఉగ్రవాదులు చేసిన దాడికి ప్రతీకారంగా భారత సైన్యం మళ్లీ సర్జికల్ స్ట్రైక్స్‌కు దిగుతుందేమోనని పాక్‌కు భయం పట్టుకుంది. ఈ దాడితో తమకెటువంటి సంబంధం లేదని, తామెవరికీ ఆయుధాలు ఇచ్చి ప్రోత్సాహించలేదని సోమవారం పాక్ విదేశాంగ శాఖ పేర్కొంది. ఎటువంటి విచారణ లేకుండానే జైషే మహ్మద్ ఉగ్రవాదులే ఆ దాడి చేశారని ఎలా తెలుస్తారని, ఈ తరహా ప్రకటనలు భారత్ బాధ్యతా రాహిత్యానికి చిహ్నమని తెలిపింది. కశ్మీర్‌లో ఆ దేశంపై చలరేగుతున్న తిరుగుబాటును కప్పిపుచ్చుకునేందుకే ఇటువంటి ప్రకటనలు చేస్తోందని, దీనిపై అంతర్జాతీయ సమాజం స్పందించి భారత్ నియంత్రణ రేఖ దాటి దాడులు చేయకుండా చూడాలని కోరింది. కాగా, 2016లో ఉరీ సైనిక స్థావరంపై ఉగ్రదాడి తర్వాత మన సైనికులు సరిహద్దు దాటి పాక్ ముష్కరుల స్థావరాలను తుడిచిపెట్టేసి వచ్చిన విషయం తెలిసిందే.

మృత్యువును జయించి.. బిడ్డకు జన్మ

సున్జవాన్ ఆర్మీ క్వార్టర్స్‌లో గాయపడిన ఓ జవాను ఇంట ఆపత్కాలంలో అనూహ్యంగా సంతోషం వెల్లివిరిసింది. ఉగ్రవాదుల కాల్పుల్లో రైఫిల్‌మ్యాన్ నజీర్



అహ్మద్ సహా అతడి షాజాద్ ఖాన్ (24) తీవ్రంగా గాయపడ్డారు. 35 వారాల నిండు గర్భిణి అయిన షాజాద్ వెన్నులో తూటా దిగింది. ఆర్మీ ఆస్పత్రికి తరలించగా తీవ్ర రక్తస్రావం కావడంతో తల్లీబిడ్డలిద్దరికీ ప్రాణాపాయం ఉందని వైద్యులు చెప్పారు. దీంతో కనీసం తల్లినైనా కాపాడాలని ఆ కుటుంబసభ్యులు వేడుకున్నారు. దీంతో సిజేరియన్ చేసి ముందుగా బిడ్డను బయటకు తీయాలని వైద్యులు నిర్ణయించుకున్నారు. షాజాద్ మరింత రక్తం కోల్పోకుండా ఆమెకు బ్లడ్ ఎక్కిసూ శస్త్రచికిత్స చేశారు. అదృష్టవశాత్తు పూర్తి ఆరోగ్యంతో పండంటి ఆడ శిశువు ప్రాణాలతో ఈ ప్రపంచంలోకి వచ్చింది.

ఆర్మీ అధికారులకు ఊరట

- షోపియాన్ కేసులో ఎఫ్ఐఆర్‌పై సుప్రీం స్టే
- వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: జమ్ము కశ్మీర్‌లోని షోపియాన్‌లో అల్లరి మూకలను కట్టడి చేసేందుకు కాల్పులు జరిపిన కేసులో ఆర్మీ అధికారులకు ఊరట లభించింది. మేజర్ ఆదిత్య కుమార్ సహా మరి కొందరు ఆర్మీ సిబ్బందిపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌పై సుప్రీం కోర్టు స్టే విధించింది. అలాగే ఈ కేసులో వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని జమ్ము కశ్మీర్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇటీవల షోపియాన్ ప్రాంతంలోని గనోవ్‌పోరా గ్రామంలో అల్లరి మూకలు రాళ్ల దాడులకు దిగడంతో వారిని అదుపు చేసేందుకు 10 గఢ్‌వాల్ రైఫిల్స్ బెటాలియన్ కాల్పులు జరిపింది. ఈ ఘటనలో ముగ్గురు పౌరులు మరణించడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం దీనిపై దర్యాప్తునకు ఆదేశించింది. దీంతో మేజర్ ఆదిత్య కుమార్ సహా మరికొందరిపై హత్య, హత్యాయత్నం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో తమ కుమారుడిపై తప్పుడు కేసు పెట్టారని, విధి నిర్వహణతో తప్పనిసరి పరిస్థితుల్లో జరిగిన కాల్పులకు సైనికులను వేధిస్తున్నారని, ఈ కేసును కొట్టేయాలని కోరుతూ మేజర్ తండ్రి లెఫ్టినెంట్ కల్నల్ కరమ్‌వీర్ సింగ్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిని నెల 9న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం విచారణకు స్వీకరించింది. తాజాగా సోమవారం దీన్ని విచారించిన ధర్మాసనం ఈ కేసులో చర్యలను నిలిపేయాలని జమ్ము కశ్మీర్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీనిపై రెండు వారాల్లోగా వివరణ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులిచ్చింది. అలాగే పిటిషన్‌కు సంబంధించిన వివరాలను అటార్నీ జనరల్ వేణు గోపాల్‌కు, ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అందించాలని కరమ్‌వీర్ సింగ్‌కు సూచించింది.

స్నేహ సంబంధాలకు ఊపు


- ఒమన్‌లో పర్యటనపై ప్రధాని మోదీ
- రెండు దేశాల మధ్య 8 ఒప్పందాలు
- సుల్తాన్ ఖబూస్‌తో సౌహార్ద సమావేశం
- 125 ఏళ్లనాటి శివాలయంలో ప్రార్థనలు
- పరిశ్రమాధిపతులతో ప్రత్యేకంగా భేటీ
- పెట్టుబడులతో రావాలంటూ ఆహ్వానం



మస్కట్, ఫిబ్రవరి 12: ఒమన్‌లో తన పర్యటన ద్వైపాక్షిక సంబంధాలకు గణనీయ ఉత్తేజమిస్తుందని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ చమురు సంపన్న దేశం అగ్ర నేతల చర్చల అనంతరం 8 ఒప్పందాలపై సంతకాలు పూర్తయిన నేపథ్యంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తనకు సాదర స్వాగతం పలికి అపూర్వ ఆతిథ్యమిచ్చిన సుల్తాన్ ఖబూస్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఈ పర్యటన తనకు చిరకాలం గుర్తుండి పోతుందని పేర్కొన్నారు. ''రెండు దేశాల ప్రజల మధ్య శతాబ్దాల సంబంధాలు మరింత బలోపేతం కావడానికి నా పర్యటన దోహదం చేసింది. వాణిజ్యం, పెట్టుబడుల బంధంసహా అన్ని రంగాలలోనూ స్నేహసంబంధాలకు ఇది గణనీయంగా ఊపునిస్తుంది'' అని వ్యాఖ్యానించారు. మూడు దేశాల పర్యటన చివరి అంకంలో భాగంగా ఆదివారం రాత్రి ఒమన్ చేరుకున్న ప్రధాని వివిధ అంశాలపై సుల్తాన్ ఖబూస్‌తో విస్తృతంగా చర్చించారు. తమ దేశ ప్రగతి పయనంలో పాలుపంచుకుంటున్న 8 లక్షల మంది భారతీయుల కృషిని సుల్తాన్ ఈ సందర్భంగా ప్రశంసించారు.

పురాతన శివాలయంలో అభిషేకం

ఈ ప్రాంతంలోని అత్యంత పురాతన ఆలయాల్లో ఒకటైన శివాలయంలో ప్రధాని ఈశ్వరాభిషేకం చేయించారు. ఆలయ నిర్వాహకులతో కొద్దిసేపు ముచ్చటించారు. గుజరాత్‌కు చెందిన వర్తక సమాజం 125 ఏళ్లకిందట ఈ ఆలయాన్ని నిర్మించగా, 1999లో ఈ ప్రాంగణాన్ని పూర్తిగా నవీకరించారు. ''ఈ పురాతన ఆలయంలో శివార్చనతో ఆ మహాదేవుని ఆశీర్వాదం నాకు దక్కిన అనుభూతి కలిగింది'' అని అనంతరం ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు. అలాగే మస్కట్‌లోని అతిపెద్ద, అత్యంత విశిష్ట సుల్తాన్ ఖబూస్ మసీదును కూడా సందర్శించారు. అంతకుముందు ప్రవాస భారతీయుల సమావేశంలో మోదీ ప్రసంగించారు. అలాగే గల్ఫ్ దేశాల, పశ్చిమాసియా ప్రాంత పరిశ్రమాధిపతులతోనూ సోమవారం ఆయన సమావేశమయ్యారు. పెట్టుబడులకు భారత్ ఆకర్షణీయ గమ్యమని, అత్యంత వాణిజ్య సౌలభ్యంగల దేశమని ఈ సందర్భంగా వారికి వివరించారు. పరిశ్రమల స్థాపనకు, వ్యాపార-వాణిజ్యాలకు అడ్డంకిగా ఉన్న పలు కాలం చెల్లిన చట్టాలను రద్దుచేశామని వివరించారు. అలాగే ఆర్థిక అశక్తత-దివాలా స్మృతిని సంస్కరించినట్లు పేర్కొన్నారు. తనిఖీ-లైసెన్సు రాజ్యానికి స్వస్తి పలికామని, స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునే సౌహార్ద వాతావరణం కల్పించామని తెలిపారు. కాగా, భారత్-ఒమన్‌ల మధ్య కుదిరిన ఎనిమిది అవగాహన ఒప్పందాలు ఆయా రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తృతం చేస్తాయని ఇక్కడి భారత రాయబారి ఇంద్రమాన్ పాండే అన్నారు.



జయ 'చిత్రపటం'పై వివాదం

- తమిళనాడు అసెంబ్లీలో ఆవిష్కరణ.. తొలగించాలని హైకోర్టుకు డీఎంకే

చెన్నై, ఫిబ్రవరి 12: తమిళనాడు అసెంబ్లీలో దివంగత సీఎం జయలలిత చిత్రపటాన్ని ఏర్పాటు చేయడంపై వివాదం రాజుకుంది. సోమవారం ఉదయం 9:30 గంటలకు అసెంబ్లీలో ఏడడుగుల జయలలిత చిత్రపటాన్ని స్పీకర్ ధన్‌పాల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పళనిసామి, ఉప ముఖ్యమంత్రి పన్నీరు సెల్వం, మంత్రులు, అన్నా డీఎంకే ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కాగా కార్యక్రమం జరిగిన గంటకే అంటే ఉదయం 10:30 గంటలకు ప్రతిపక్ష డీఎంకే అభ్యంతరం వ్యక్తం చేస్తూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. అవినీతి కేసులో సుప్రీం కోర్టు జయలలితను దోషిగా ప్రకటించిందని, అసెంబ్లీలో ఆమె చిత్రపటాన్ని తొలగించాలని పిటిషన్ దాఖలు చేసింది. అత్యవసర ప్రాతిపదికగా పరిగణించి ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించాల్సిందిగా డీఎంకే తరపు సీనియర్ న్యాయవాది పి.విల్సన్.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ, జస్టిస్ అబ్దుల్ ఖుద్దోసెలతో కూడిన ధర్మాసనానికి విన్నవించారు. కాగా సీబీఐ జారీ చేసిన లుకౌట్ నోటీసులను సవాల్ చేస్తూ కార్తీ చిదంబరం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు విచారణ చేపడుతున్నామని, కాబట్టి డీఎంకే పిటిషన్‌ను మంగళవారం విచారణకు స్వీకరిస్తామని ధర్మాస నం పేర్కొంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జయలలితను ప్రత్యేక కోర్టు దోషిగా ప్రకటించిందని, తర్వాత హైకోర్టు నిర్దోషిగా ప్రకటించినా, సుప్రీం కోర్టు దోషిగా పేర్కొంటూ తుది తీర్పు వెలువరించిందని పిటిషనర్ పేర్కొన్నారు.

కుడిఎడమల చూసుకోండి

- అవినీతిపై మాట్లాడేముందు ఇది ముఖ్యం
- ప్రధానమంత్రిపై రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు
- మీ చుట్టూ ఎంతో మంది అక్రమార్కులు
- కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి విసుర్లు



రాయచూర్, ఫిబ్రవరి 12: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సోమవారం కూడా ప్రధాని మోదీపై తన విమర్శల పరంపరను కొనసాగించారు. కర్ణాటకలో పార్టీ నిర్వహిస్తున్న 'జనాశీర్వాద యాత్ర'లో భాగంగా మూడోరోజు ఆయన హైదరాబాద్-కర్ణాటక ప్రాంత పరిధిలోని రాయ చూర్‌లో రోడ్ షో నిర్వహించారు. రెండురోజులుగా ప్రధానిపై విమర్శలు సంధించిన నేపథ్యంలో తాజాగా బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కుమారుడిమీద అవినీతి ఆరోపణలపై నోరు విప్పాలని డిమాండ్ చేశారు. అవినీతి గురించి మాట్లాడే సమయంలో ఓసారి 'కుడి-ఎడమల' చూసుకోవాల్సిందిగా ప్రధానికి సలహా ఇచ్చారు. ''అవినీతి నిర్మూలన గురించి ప్రస్తావించే సమయంలో ఒకసారి మీ కుడి భుజంలాంటి అమిత్ షా.. ఆయన పుత్రుడి జయ్‌షా అవినీతిని కూడా గుర్తు తెచ్చుకోండి. కేవలం మూడు నెలల వ్యవధిలో రూ.50 వేల ఆస్తిని అతడు రూ.80 కోట్లు ఎలా చేయగలిగాడంటారు? దేశానికి ఈ సంగతి కూడా చెప్పండి'' అని ప్రధానిని ఎద్దేవా చేశారు. కాగా, 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జయ్‌షా ఆస్తులు అమాంతం పెరిగిపోవడంపై ఒక వార్తాసంస్థ కథనం వెలువరించగా, సదరు కథనంపై ఆయన పరువునష్టం కేసు దాఖలు చేయడం ఈ సందర్భంగా గమనార్హం. ఇక కర్ణాటకలోని బీజేపీ నాయకుల అవినీతి గురించి కూడా ప్రధాని గుర్తుంచుకోవాలని రాహుల్ పేర్కొన్నారు. ''మోదీజీ! మీరు గతాన్ని ప్రస్తావించిన తర్వాత కుడి-ఎడమల ఒకసారి చూసుకోండి. ఒకవైపు అవినీతి ఆరోపణలతో జైలుకెళ్లొచ్చిన యడ్యూరప్ప కనిపిస్తారు. మరోవైపు ఆయనతోపాటు జైలు ఊచలు లెక్కించిన మరో నలుగురు మాజీ మంత్రులు కూడా ఉంటారు. అంతేకాదు... అవినీతి ఆరోపణలతో రాజీనామా చేసిన మరో 11 మంది మీ వెనుకే ఉంటారు'' అని విమర్శలు గుప్పించారు. దేశంలో ఉద్యోగాల సృష్టి హుళక్కేనని, రైతు వెతలు తీర్చే తీరిక ప్రభుత్వానికి లేదని రాహుల్ విమర్శించారు. ''మోదీజీ! ఈ దేశ ప్రజలు, రైతులు మీకు చేతినిండా పని కల్పించారు. యువతరం చైనాతో పోటీ పడతామంటోంది. కానీ, చైనా గంటకు 50వేల ఉద్యోగాలిస్తోంది. భారత్‌లో మాత్రం మోదీ విఫలమయ్యారు'' అని వ్యాఖ్యానించారు.

మిర్చి బజ్జీ బ్రేక్..

రాయచూర్‌లో పర్యటించిన సందర్భంగా రాహుల్‌గాంధీ రోడ్డు పక్కన మిర్చి బజ్జీలు రుచిచూశారు. కలమల గ్రామంలో రోడ్‌షో సందర్భంగా ప్రజలనుద్దేశించి ప్రసంగించిన అనంతరం ముఖ్యమంత్రి సిద్దరామయ్య, లోక్‌సభలో విపక్ష కాంగ్రెస్ నేత మల్లికార్జున్ ఖర్గే, కేంద్ర మాజీమంత్రి వీరప్పమొయిలీ తదితరులతో కలసి అల్పాహారం స్వీకరించారు. ఈ సందర్భంగా బజ్జీల కొట్టు మారమ్మ ఆయనకు ఆప్యాయంగా వేడివేడి మిరపకాయ బజ్జీలతోపాటు తేనీరు అందించింది. అనంతరం ఆమెకు బిల్లు చెల్లించి పర్యటనను కొనసాగించారు.

'సైరా'కు ఇళయరాజా స్వరాలు



చిరంజీవి కథానాయకుడిగా నటిస్తున్న 151వ చిత్రం 'సైరా నరసింహారెడ్డి'. స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా ఈ సినిమాను సురేందర్‌రెడ్డి తెరకెక్కిస్తున్నారు. కొణిదెల ప్రొడక్షన్ కంపెనీ బ్యానర్‌పై రామ్‌చరణ్ నిర్మిస్తున్నారు. చిరు సరసన నయనతార నటిస్తోంది. ఈ చిత్రానికి ఎ.ఆర్.రెహమాన్ సంగీతాన్ని అందిస్తారని గతంలో అధికారికంగా ప్రకటించారు. కొన్ని కారణాల వల్ల రెహమాన్ ఈ సినిమా నుంచి తప్పుకున్నారు. అతని స్థానంలో ఎం.ఎం.కీరవాణి పేరు కూడా వినిపించింది. తాజాగా ఇళయరాజాను చిరంజీవి ఇటీవల కలిసారని తెలుస్తోంది. ఈ చిత్రానికి ఇళయారాజా సంగీతం అందించే అవకాశం ఉన్నట్టు సమాచారం. డిసెంబర్‌లో ఈ సినిమాకి సంబంధించిన షూటింగ్ ప్రారంభమైంది. బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. జగపతిబాబు, సుదీప్, విజయ్ సేతుపతి, బ్రహ్మాజీ తదితరులు ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.



'జువ్వ' ఆడియో విడుదల

రంజిత్, పాలక్ లల్వానీ జంటగా నటించిన చిత్రం 'జువ్వ'. త్రికోటి దర్శకుడు. భరత్ సోమి నిర్మాత. ఎం.ఎం.కీరవాణి సంగీతం అందించిన ఈ సినిమా ఆడియో విడుదలైంది. ఆడియో సీడీలను వి.వి.వినాయక్ విడుదల చేయగా, తొలి సీడీని ఎం.ఎం.కీరవాణి అందుకున్నారు. ఈ సందర్భంగా కీరవాణి మాట్లాడుతూ ''ఓ కమర్షియల్ సినిమాలో ఉండాల్సిన అన్ని ఎలిమెంట్స్ ఈ చిత్రంలో ఉంటాయి. పెళ్లి భోజనంలాంటి సినిమా. రంజిత్ ఫైట్స్, డాన్సులు చక్కగా చేశాడు. ఈ సినిమా సక్సెస్‌తో తను వరుణ్ తేజ్‌లా.. అటు నుండి మెగాస్టార్ చిరంజీవి అంతటి హీరో కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. బొత్స సత్సనారాయణ మాట్లాడుతూ '' సినిమాలో నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణులకు అభినందనలు. సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు. వి.వి.వినాయక్ మాట్లాడుతూ '' నిర్మాత భరత్‌గారు.. తమ్ముడిపై ప్రేమతో చేసిన సినిమా ఇది. కీరవాణిగారు.. నాకు ప్రియమైన స్నేహితులు. ఆయన ఈ సినిమాకు సంగీతం అందించడం విశేషం. ఆయనకు నచ్చితేనే సంగీతం అందిస్తారు. ఆయన మ్యూజిక్ ఇవ్వడం త్రికోటి, రంజిత్‌ల అదృష్టం. సినిమా పెద్ద హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అన్నారు. నిర్మాత భరత్ మాట్లాడుతూ ''ఈ సినిమా ఫిబ్రవరి 23న విడుదలవుతుంది. త్రికోటిగారు చక్కటి క్వాలిటీతో సినిమా చేశారు. సినిమా అవుట్‌పుట్ చాలా బాగా వచ్చింది'' అన్నారు. చిత్ర దర్శకుడు త్రికోటి మాట్లాడుతూ ''దర్శకుడిగా 'జువ్వ' నా రెండో సినిమా. నాకు మంచి హిట్ రావాలని అందరూ బాగా కష్టపడ్డారు. కీరవాణిగారు నాకు దేవుడితో సమానం. ఆయన నా సినిమాలకు సంగీతం చేయాల్సిన పనిలేదు. కానీ ఆయన నన్ను మోసుకొస్తున్నారు. భరత్‌గారు చాలా గ్రేట్. అనుకున్న బడ్జెట్ కంటే ఎక్కువైనా ఖర్చు పెట్టి సినిమా చేశారు. సినిమా చేసిన అందరికీ లైఫ్ వస్తుందని నమ్ముతున్నాం'' అన్నారు. హీరో రంజిత్ మాట్లాడుతూ ''కీరవాణిగారు అద్భుతమైన సంగీతం అందించారు. అలాంటి లెజెండ్రీ మ్యూజిక్ డైరెక్టర్‌తో కలిసి పనిచేయడం చాలా గొప్ప విషయం. ఇక అన్నయ్య భరత్ గురించి ఎంత చెప్పినా తక్కువే. మంచి కథతో చేసిన సినిమా. అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాను'' అన్నారు.


'రంగస్థలం'లో సమంత, రామ్‌చరణ్

దర్శకత్వం చేయడం కష్టమనిపించలేదు
- మంజుల



సందీప్ కిషన్, అమైరా దస్తూర్, త్రిదా చౌదరి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మనసుకు నచ్చింది' మంజుల ఘట్టమనేని దర్శకత్వంలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, ఇందిరా ప్రొడక్షన్స్ బేనర్స్‌పై పి.కిరణ్, సంజయ్ స్వరూప్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఫిబ్రవరి 16న సినిమా విడుదలవుతుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకురాలు మంజుల ఘట్టమనేని పాత్రికేయులతో మాట్లాడుతూ ''నా మనసుకు నచ్చిన కథతో చేసిన సినిమా 'మనసుకు నచ్చింది'. ఏదో ఒక సినిమా చేయాలనే స్టేజ్‌లో నేను లేను. నేను పనిచేయాల్సిన అవసరం కూడా లేదు. కానీ ఈరోజు నేను సినిమా చేస్తున్నానంటే.. నా హృదయంలోని విషయాలను వ్యక్తపరచాలనే ఉద్దేశంతోనే. నా హృదయంలో నుండి వచ్చిన ఆలోచనతో చేసిన సినిమా ఇది. ఏదో కమర్షియల్ సినిమాలు చేయాలనుకుంటే చెసేయవచ్చు. కానీ అలా చేయలేదు. ఈ చిత్రంలో చాలా లేయర్స్ ఉంటాయి. కంప్లీట్ ఫన్ లవ్‌స్టోరీ. కథ వెనుక మరో కథ ఉంటుంది. మన మనసుకు మనం కనెక్ట్ కావడానికి నేను ప్రకృతి (సూర్యోదయం, సూర్యాస్తమయం, గాలి) అనే అంశాన్ని ఈ సినిమాలో ఉపయోగించాను. ఈ సినిమాలో అసలు హీరో ప్రకృతే. ప్రకృతి రూపంలో మహేష్‌బాబు వాయిస్ ఓవర్ ఇచ్చాడు. స్క్రిప్ట్ చేయడానికి ఏడాదిన్నర సమయం పట్టింది. నేను ఇంగ్లీష్‌లో రాసిన దాన్ని సాయిమాధవ్ బుర్రాగారు అందమైన తెలుగులో రాశారు. ఇది నిజ జీవితానికి సంబంధించిన కథ కాదు. ఫిక్షనల్ స్టోరీ. సినిమాలో నేను చూపిన నిత్య క్యారెక్టర్, నా హృదయానికి దగ్గరగా ఉంటుంది. క్యారెక్టర్స్ ప్రవర్తించే కొన్ని లక్షణాలను నాన్న, మహేష్ ఇలా రియల్ లైఫ్ వ్యక్తుల నుండి తీసుకున్నవే కానీ. కథ మాత్రం ఫిక్షనల్. ఇద్దరు మధ్య సాగే ఫన్ లవ్‌స్టోరీ. నేను ఎవరినీ దృష్టిలో పెట్టుకుని కథను రాసుకోలేదు. కథ పూర్తయిన తర్వాతే నటీనటుల ఎవరైతే బావుంటుందని ఆలోచించాం. సందీప్‌ను కలిసిన తర్వాత సూరజ్ క్యారెక్టర్‌కి తను పక్కాగా సరిపోతాడనిపించింది. తన క్యారెక్టర్‌లో చాలా ఎమోషన్స్, డైమన్షన్స్ ఉంటాయి. నటిగా చేసిన నాకు దర్శకత్వం చేయడం కష్టమనిపించలేదు. సినిమా ట్రైలర్ చూసిన నాన్న, మహేష్ అప్రిసియేట్ చేశారు. ఇద్దరూ తొలిరోజు, తొలి ఆటను చూస్తామని చెప్పారు. నేను మహేష్‌కి ఎలాంటి కథ రాయాలి అని ఆలోచించకూడదు. ఎందుకంటే తన యాక్టింగ్ గురించి అందరికీ తెలిసిందే. అయితే తన ఇమేజ్‌కు తగ్గ కథ అయితే తనే పిలిచి సినిమా చేయమంటాడు. పవన్‌కల్యాణ్‌కు సూటయ్యే కథ ఉంది. తను ప్రజా సేవ చేయాలనే తపనతో సినిమాలనుండి రాజకీయాలకు వెళుతున్నాడు. దానికి సంబంధించిన కథ నా దగ్గరుంది'' అన్నారు.

'ఛలో' విజయోత్సవం


నాగశౌర్య, రష్మిక

నాగశౌర్య, రష్మిక మండన్నా జంటగా ఐరా క్రియేషన్స్ పతాకంపై వెంకీ కుడుముల దర్శకత్వంలో శంకర్ ప్రసాద్ ముల్పూరి, ఉషా ముల్పూరి నిర్మించిన చిత్రం 'ఛలో'. ఇటీవల ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదలైంద. ఈ సందర్భంగా వైజాగ్‌లో సక్సెస్‌మీట్‌ని నిర్వహించింది చిత్ర యూనిట్. ఈ సక్సెస్‌మీట్‌కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ''ఈరోజు స్మార్ట్ సిటీగా ఉన్న వైజాగ్‌లో స్మార్ట్ హీరో నాగశౌర్య 'ఛలో' సక్సెస్‌మీట్ జరగడం చాలా మంచి విషయం. శౌర్య 13వ సినిమాకే ఆల్‌రౌండర్‌గా గుర్తింపు తెచ్చుకుంటున్నాడు. నాగశౌర్య భవిష్యత్తులో మంచి మంచి సినిమాలతో ఎంటర్‌టైన్ చేయాలని కోరుకుంటు న్నాను'' అని అన్నారు. దర్శకుడు వెంకీ మాట్లా డుతూ ''మా సినిమాను ఇంత పెద్ద బ్లాక్ బస్టర్ చేసినందుకు చాలా థాంక్స్. నాగశౌర్య నాకు మా అమ్మా నాన్న తర్వాత అంత ఇంపార్టెంట్ పర్సన్. నన్ను నమ్మి సొంత ప్రొడక్షన్ హౌస్ పెట్టి దర్శకుడిని చేశాడు. నా టెక్నికల్ టీం చాలా సపోర్ట్ చేశారు. థాంక్యూ సోమచ్'' అని అన్నారు. రష్మిక మాట్లాడుతూ ''మా టీం నన్ను చాలా సపోర్ట్ చేశారు. కన్నడ అమ్మాయికి తెలుగు నేర్పించారు. థాంక్యూ సోమచ్. సినిమాని ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు'' అన్నారు. నాగశౌర్య మాట్లాడుతూ ''ఛలో సక్సెస్ సెలెబ్రేషన్స్ వైజాగ్‌లో పెట్టడానికి కారణం నా ఫస్ట్ మూవీ ఇక్కడే చేశాను. వెంకీ... కొరటాల శివగారంత పెద్ద డైరెక్టర్ అవుతాడు. త్రివిక్రమ్‌గారికి, చిరంజీవిగారికి చాలా థాంక్స్'' అన్నారు.


కృతి సనన్

జీవితంలో అవి సర్వసాధారణం

మహేశ్ హీరోగా నటించిన '1 నేనొక్కడినే', నాగచైతన్య హీరోగా చేసిన 'దోచెయ్' చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన అందాల భామ కృతి సనన్ ఇటీవల ఓ మీడియా సమావేశంలో కొన్ని జీవిత సత్యాలను వెల్లడించింది. ''జీవితంలో పరాజయాలు చవి చూసినపుడే విజయం విలువ తెలుస్తుంది. పరాజయాలు మనకు ఎన్నో పాఠాలు నేర్పిస్తుంది. విజయాల ద్వారా కూడా మంచి విషయాలు తెలుసుకున్నప్పుడే జీవితం అందంగా మారుతుంది. జీవితంలో ఆటు పోట్లు సహజం. కష్టం వచ్చినపుడు కుంగిపోవడం, సంతోషం కలిగినపుడు పొంగిపోవడం సరికాదు. పరిస్థితుల్ని బట్టి మన జీవితాన్ని మార్చుకోవాలి. జీవితంలో జయాపజయాలు సర్వసాధారణం. అయితే ఈ ప్రయాణంలో మనం కొత్తగా ఏం నేర్చుకున్నామనేది ముఖ్యం. మన చుట్టూ ఉన్నవాళ్ళు కొన్ని విషయాల్లో మనల్ని నిరుత్సాహపరచడానికి సిద్ధంగా ఉంటారు. అలాంటి వారి గురించి, వారు చెప్పే మాటల గురించి అస్సలు పట్టించుకోకూడదు. మనం చేసే పనిని ఎంత ఇష్టంగా చేస్తున్నాం, ఎంత ప్రేమగా చేస్తున్నామనేదే ముఖ్యం. నా విషయానికి వస్తే మంచి జాబ్ ఆఫర్స్ వదులుకొని ఇండస్ట్రీలోకి వచ్చాను. మొదట్లో మోడలింగ్, టీవీ కమర్షియల్స్ చేశాను. ఆ తర్వాత నాపై నమ్మకంతో యాక్టింగ్ వైపు అడుగులు వేశా. కష్టపడ్డాను. ఇప్పుడు హీరోయిన్‌గా నటిస్తున్నాను'' అన్నారు. ప్రస్తుతం రోహిత్ జుగరాజ్ దర్శకత్వంలో దిల్జీత్ హీరోగా రూపొందుతున్న 'అర్జున్ పాటియాలా' సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు.

నిఖిల్‌తో మేఘా ఆకాశ్!



కన్నడలో సూపర్‌హిట్ అయిన 'కిరిక్ పార్టీ' చిత్రానికి రీమేక్‌గా రూపొందుతున్న 'కిరాక్ పార్టీ'లో నిఖిల్ హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధమైంది. ఫిబ్రవరిలోనే ఈ సినిమా విడుదలవ్వాల్సి ఉండగా పోస్ట్ ప్రొడక్షన్ పనుల జాప్యం వల్ల వాయిదా పడింది. త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది చిత్ర యూనిట్. ఇదిలా ఉంటే నిఖిల్ మరో రీమేక్‌కి రెడీ అయిపోయారు. తమిళ్‌లో సూపర్‌హిట్ అయిన 'కనిథన్' చిత్రం రీమేక్‌లో నిఖిల్ నటించనున్నారు. త్వరలోనే ఈ చిత్రం షూటింగ్ ప్రారంభం కానుంది. 'కనిథన్'లో హీరోయిన్‌గా నటించిన కేథరిన్ త్రెసా తెలుగులోనూ నటిస్తుందని ఆమధ్య వార్తలు వచ్చాయి. అయితే అది నిజం కాదని, తను తెలుగు రీమేక్‌లో నటించడం లేదని స్పష్టం చేసింది. ఆ అవకాశాన్ని మేఘా ఆకాశ్ అందిపుచ్చుకుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ చిత్రాన్ని ఠాగూర్ మధు నిర్మిస్తారని తెలుస్తోంది.

సత్యగ్యాంగ్ టీజర్ విడుదల


అక్షిత, సాత్విక్ ఈశ్వర్

సమాజంలో అనాథలనేవారు లేకుండా చేయాలనే సందేశానికి వినోదాన్ని జోడించి రూపొందిన చిత్రం 'సత్య గ్యాంగ్'. ఈ చిత్రం టీజర్ ను అనాథ బాలల సమక్షంలో వారే అతిథులుగా విడుదల చేశారు. అంతేకాదు, వారికి 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు చిత్ర నిర్మాత మహేష్ ఖన్నా. సిద్ధయోగి క్రియేషన్స్ పతాకంపై మహేష్ ఖన్నా నిర్మిస్తున్న చిత్రమిది. ప్రభాస్ దర్శకుడు. ఈ చిత్రం టీజర్‌ని హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత మహేష్ ఖన్నా, దర్శకుడు ప్రభాస్, హీరో సాత్విక్ ఈశ్వర్, హీరోయిన్ అక్షిత, నియాష్, హర్షిత, ఛాయాగ్రాహకులు అడుసుమిల్లి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. మహేష్ ఖన్నా మాట్లాడుతూ.. 'సమాజంలో అనాథలనేవారు ఉండకూడదనే సందేశానికి వినోదాన్ని మేళవించి తీస్తున్న చిత్రమిది. త్వరలోనే ఆడియో లాంచ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం దర్శకుడిగా పరిచయమవుతున్న ప్రభాస్ ప్రతి ఫ్రేమ్ అందంగా తీర్చి దిద్దారు'' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ ''దర్శకుడిగా నాకు జన్మనిచ్చిన వ్యక్తి మహేష్ ఖన్నాగారు. ఛాయాగ్రహణం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ' అన్నారు. 'సత్య గ్యాంగ్' వంటి మెసేజ్ ఓరియంటెడ్ ఎంటర్‌టైనర్ ద్వారా పరిచయం అవ్వబోతుండడం అదృష్టంగా భావిస్తున్నామని సాత్విక్ ఈశ్వర్, ప్రత్యూష్, అక్షిత అన్నారు.



ఫిదా కానున్న నాని?

వరుస విజయాలను సాధిస్తున్న యువ కథానాయకుడు నాని. ప్రస్తుతం నాని కథానాయకుడిగా 'కృష్ణార్జున యుద్ధం' సినిమా చేస్తున్నారు. దీని తర్వాత నాగార్జునతో కలిసి ఓ మల్టీస్టారర్ చేయబోతున్న సంగతి తెలిసిందే. ఈ రెండు సినిమాల తర్వాత శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నాని సినిమా చేయబోతున్నారని ఇండస్ట్రీ వర్గాల సమాచారం. రీసెంట్‌గా శేఖర్ కమ్ముల నానికి లైన్ వినిపించారట. నాని కూడా ఈ సినిమా చేయడానికి తన సుముఖతను వ్యక్తం చేశారని.. అయితే ప్రస్తుతం ఉన్న కమిట్‌మెంట్స్ పూర్తయిన తర్వాతే శేఖర్‌కమ్ముల సినిమా చేసే అవకాశాలున్నాయి. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. ప్రస్తుతం నాని నిర్మాతగా తన వాల్ పోస్టర్స్ సినిమాపై నిర్మించిన 'అ!' సినిమాను ఫిబ్రవరి 16న ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

గజవాహనంపై గరళకంఠుడు

- శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- భారీ సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు
- నేడు స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం

శ్రీశైలం, ఫిబ్రవరి 12 (మనం న్యూస్): శ్రీశైలం మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లు గజవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకరణ మంటపంలో ఆలయ అర్చక, వేద పండితులు ఆగమ శాస్త్రానుసారంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ, అలంకరణ పూజలను నిర్వహించారు. అనంతరం గజవాహనంపై ఉన్న స్వామి అమ్మవార్లను గ్రామోత్సవానికి తోడ్కొని వచ్చారు. గ్రామోత్సవంలో దేవస్థానం వారు ఏర్పాటు చేసిన కళారూపాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యుత్ దీపకాంతులు, కళాకారుల విన్యాసాల నడుమ స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. పుష్కరిణి వద్ద, శివదీక్షా శిబిరాల వద్ద నృత్య ప్రదర్శనలు, గాత్ర కచేరీలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చెక్క భజనలు, డోలు విన్యాసాలు, గొరవాయ నృత్యాలు, డప్పు వాయి ద్యాలు, పగటి వేషాలు భక్తులను అలరించాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని అధిక సంఖ్యలో భక్తులు శ్రీశైలం చేరుకుంటున్నారు. సోమవారం సాయంత్రం నుంచే భక్తుల తాకిడి పెరిగింది. పవిత్ర పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. సుమారు 80 వేలకు పైగా భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారని అంచనా. కాగా, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను శ్రీశైలం పీఠాధిపతి శ్రీచెన్న సిద్ధరామ శివాచార్య మహాస్వామి దర్శించుకున్నారు.

శ్రీశైలంలో నేటి కార్యక్రమాలు

శ్రీశైలం మహాక్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని స్వామి అమ్మవార్లను అర్చక వేదపండితులు, ప్రత్యేక పూజలను ఆగమశాస్త్రానుసారంగా నిర్వహిస్తారు. మంగళవారం సాయంత్రం ఉత్సవాలలో భాగంగా 5 గంటల నుంచి ప్రభోత్సవం నిర్వహిస్తారు. నందివాహనసేవపై స్వామి అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నంది వాహన సేవ ఆలయంలోనే నిర్వహిస్తారు. అనంతరం స్వామివారి లింగోద్భవకాల ఏకదశ మహారుద్రాభిషేకం నిర్వహిస్తారు. ఏకకాలంలో 11 మంది అర్చక వేద పండితులు నమక, చమకాలు పలుకుతూ శివనామస్మరణతో పాగాలంకరణ చేస్తారు. సాంప్రదాయం ప్రకారం స్వామివారి గర్భాలయంపై గల నవ నందులకు పాగ అలంకరించిన అనంతరం స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చక, వేద పండితులు నిర్వహిస్తారు. 41 రోజుల నుంచి నియమనిష్టలతో శివదీక్షను స్వీకరించిన శివస్వాములు పాగ అలంకరణ అనంతరం దీక్ష విరమణ చేపడతారు.





మనదీ స్వాతంత్ర్య పోరాటమే

- కేంద్రానికి మనం సహకరించాం
- మనకు కేంద్రం చేయూత ఇవ్వాలి
- పోరాడిన ఎంపీలకు అభినందనలు
- ప్రతిపక్షం ఫిర్యాదులు శోచనీయం
- కేంద్రమంత్రి మాట్లాడితే కూడా తప్పా
- ఉపాధి హామీ పథకంపైనా ఫిర్యాదులే
- ఇది వారి అరాచకాలకు పరాకాష్ట
- అధికారులతో టెలికాన్ఫరెన్సులో సీఎం

అమరావతి, ఫిబ్రవరి 12 (మనం ప్రతినిధి): స్వాతంత్ర్యం కోసం పోరాడటం గత చరిత్ర అయితే, రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడటం నేటి చరిత్ర అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సోమవారం తన నివాసం నుంచి నీరు-ప్రగతి, వ్యవసాయం పురోగతిపై అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడున్నరేళ్లుగా కేంద్రానికి అన్ని విధాలుగా సహకరించామని... జీఎస్టీ, పెద్ద నోట్ల రద్దు తదితర అంశాల్లో అండగా నిలిచామని అన్నారు. విభజన వల్ల తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం మరింత సహకారం అందించాల్సి ఉందన్నారు. పొరుగు రాష్ట్రాలతో సమానస్థాయి వచ్చే దాకా కేంద్రం చేయూత ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడుతున్న ఎంపీలందరికీ అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో అధికార యంత్రాంగం కూడా పనిచేయాలని పిలుపునిచ్చారు. మూడున్నరేళ్లుగా ప్రభుత్వ యంత్రాంగం తోడ్పాటు వల్లే అన్ని సమస్యలు అధిగమించగలిగామని, దీనిని ఇకపై మరింత బాధ్యతాయుతంగా, పారదర్శకంగా కొనసాగించాలని కోరారు.

ప్రతిపక్షం ఫిర్యాదులు శోచనీయం

ప్రతిపక్షం లేఖల ద్వారా అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తోందని, రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంటులో పట్టుబట్టిన కేంద్రమంత్రి మీద ప్రతిపక్షం ఫిర్యాదులు చేయడం శోచనీయమని అన్నారు. తెలిసి చేసినా తెలియక చేసినా ఇది రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధమని, ప్రతిపక్ష పోకడలు ప్రజాప్రయోజనాలను కాలరాసేలా ఉన్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడమంటే రాష్ట్ర ప్రజలను ఇబ్బంది పెట్టడమేనని అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం డిమాండ్ ఆధారిత కార్యక్రమమని.. అలాంటిదానిపై కూడా ఫిర్యాదులు పంపడం ప్రతిపక్షం అరాచకాలకు పరాకాష్ట అని ముఖ్యమంత్రి దుయ్యబట్టారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి రూపాయినీ ప్రజోపయోగం చేశామని తెలిపారు. ఈ పథకం నిధులు రాష్ట్రానికి వచ్చేందుకు దోహదపడిన యంత్రాంగాన్ని అభినందించారు. రబీ వ్యవసాయ పనులు పూర్తి కావచ్చాయని, రాబోయే రెండు నెలలు ఉపాధి హామీ పనులు ముమ్మరం చేయాలని సూచించారు. మరో కోటి 80 లక్షల మాండేట్‌కు అవకాశం ఉందని, పనిదినాల లక్ష్యం చేరుకోవాలని తెలిపారు.



రైళ్లలో శుభ్రతకు పాటుపడుదాం

- భద్రతకు కృషి చేద్దాం.. ఆలస్యాన్ని నివారిద్దాం
- దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్ కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (మనం న్యూస్): భద్రత విషయంలో రాజీకి అవకాశం లేని విధంగా చర్యలు తీసుకోవాలని, రైళ్ల ఆలస్యానికి కారణమయ్యే వ్యవస్థాగత వైఫల్యాల తగ్గుదల కోసం అందరూ కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ తెలిపారు. భద్రత, సమయపాలన, ఎగుమతుల మెరుగుదల విషయాలపై సికింద్రాబాద్ రైల్ నిలయంలో సోమవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెల్డింగ్ వైఫల్యాలు, రైలు పట్టాలు తప్పడం, లెవెల్ క్రాసింగ్‌ల వద్ద సంభవించే ప్రమాదాలపై అధికారులు అన్ని కోణాల్లో స్వయంగా పర్యవేక్షించాలని ఆయన సూచించారు. డివిజనల్ రైల్వే మేనేజర్లు క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి ట్రాకులను పటిష్టపరిచే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాపలా లేని లెవల్ క్రాసింగుల తొలగింపు పనుల్ని సమీక్షించి తత్సంబంధిత పనులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి త్వరితగిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణికుల కోసం ఎఫ్ఓబీలు, ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫామ్‌ల ఎత్తు పెంచడం తదితర విషయాలపై దృష్టిసారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రైళ్లలో శుభ్రత ఉండేలా, స్వచ్ఛమైన వాతావరణం కొనసాగాలే చూడాలని, బయో టాయిలెట్ల మెరుగుదలకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. రైల్వే విభాగంలో అంకిత భావాన్ని, జాగరూకతను ప్రదర్శించి అనేక అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడంలో అత్యంత ప్రతిభ కనబర్చిన రైల్వే ఉద్యోగులకు 'మ్యాన్ ఆఫ్ ది మంత్' అవార్డులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



11 మంది సీఎంలపై క్రిమినల్ కేసులు

- 'ఏడీఆర్', 'న్యూ' సంస్థల సంయుక్త నివేదిక
- జాబితాలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు
- ఆస్తిపరుల్లో బాబు.. 'పేద'ల్లో మాణిక్ టాప్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 12: దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల 31 మంది ముఖ్యమంత్రులలో 11 మంది (35శాతం)పై క్రిమినల్ కేసులున్నాయి. ఇది ఏ రాజకీయ నాయకుడో చేసిన ఆరోపణ కాదు... నామినేషన్ల దాఖలు సందర్భంగా అభ్యర్థులు దాఖలు చేసే ఎన్నికల ప్రమాణ పత్రాలలో స్వయంగా వారే పేర్కొన్న వాస్తవం. ఈ విషయాన్ని ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (ఏడీఆర్), జాతీయ ఎన్నికల పరిశీలన సంస్థ (ఎన్ఈడబ్ల్యూ)ల సంయుక్త నివేదిక వెల్లడించింది. ఈ జాబితాలో... తెలుగు రాష్ట్రాల సీఎంలు ఎన్.చంద్రబాబు నాయుడు (ఆంధ్రప్రదేశ్), కె.చంద్రశేఖరరావు (తెలంగాణ)సహా నితీశ్‌కుమార్ (బిహార్), దేవేంద్ర ఫడ్నవీస్ (మహారాష్ట్ర), అరవింద్ కేజ్రీవాల్ (ఢిల్లీ), రఘువర్‌దాస్ (ఝార్ఖండ్), యోగి ఆదిత్యనాథ్ (ఉత్తరప్రదేశ్), పినరాయి విజయన్ (కేరళ), కెప్టెన్ అమరీందర్ సింగ్ (పంజాబ్), మెహబూబా ముఫ్తీ (జమ్ముకశ్మీర్), వి.నారాయణ స్వామి (పుదుచ్చేరి) ఉన్నారు. వీరందరిలోనూ మొత్తం 22 కేసులతో దేవేంద్ర ఫడ్నవీస్ అగ్రస్థానంలో ఉండగా ఇందులో మూడు కేసులు తీవ్రమైనవని నివేదిక పేర్కొంది. ఇక పినరాయి విజయన్ 11, కేజ్రీవాల్ 10 కేసులతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అయితే, తీవ్రమైన కేసుల జాబితాలో కేజ్రీవాల్ (4) ప్రథమ స్థానంలో ఉండగా- చంద్రబాబు, మెహబూబా, నారాయణస్వామిలపై తీవ్ర కేసులేవీ లేకపోవడం విశేషం.

సంపదలో ఏపీ సీఎందే అగ్రస్థానం

ముఖ్యమంత్రులందరిలో వ్యక్తిగత సంపద రీత్యా చంద్రబాబు నాయుడు (ఏపీ) రూ.177 కోట్ల ప్రకటిత ఆస్తులతో ప్రథమ స్థానం అలంకరించారు. ఇక పెమా ఖండూ (అరుణాచల్ ప్రదేశ్) రూ.129 కోట్లు, కెప్టెన్ అమరీందర్ సింగ్ (పంజాబ్) రూ.48 కోట్ల ఆస్తులతో ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఇక అత్యంత స్వల్ప ఆస్తులున్నవారిలో మాణిక్ సర్కార్ (త్రిపుర) రూ.26 లక్షలతో అగ్రస్థానంలో ఉండగా మమతా బెనర్జీ (పశ్చిమబెంగాల్) రూ.30 లక్షలు, మెహబూబా (కశ్మీర్) రూ.50 లక్షలతో రెండు, మూడు స్థానాల్లో ఉన్నారు.

పార్టీలకు అతీతంగా పనిచేస్తాం

- జేఎఫ్‌సీ ఏర్పాటుపై నేతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (మనం ప్రతినిధి): విభజన సమయంలో కేంద్రం ఇచ్చిన హామీల సాధనే లక్ష్యంగా, పార్టీలకు అతీతంగా పోరాడుతామని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ అన్నారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలు కాపాడటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ చొరవతో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ఆయనను కలిశారు. సోమవారం జరిగిన ఈ భేటీలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కూడా పాల్గొన్నారు. విభజన హామీలు, నిధుల విడుదలపై లెక్కలు తేల్చేందుకు జేఎఫ్‌సీ ఏర్పాటుపై వారు చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. మనం కోరేది ప్రజలకు పనికివచ్చే రీతిలో అమలు కావాలని జేపీ పేర్కొన్నారు. దేశంలో, రాష్ట్రాల్లో తాత్కాలికమైన ఆర్భాటాలు, ప్రకటనలు, హడావిడిపై శ్రద్ధ ఎక్కువ ఉందని, వచ్చే ఫలితంపై మాత్రం లేదని విమర్శించారు. మనం చేసే పనివల్ల ప్రజలు ఏ మేరకు ఫలితం వస్తుంది.. యువతి ఉపాధి కోసం ఏ మేరకు అవకాశాలు పెరుగుతాయి.. రాష్ట్రాల అభివృద్ధి కోసం ఏ మేరకు నిధులు అందుతాయన్నదానిపై హడావుడి లేకుండా ఆలోచిస్తామని జేపీ వ్యాఖ్యానించారు. ఇప్పటికే నాలుగేళ్లు ఆలస్యం అయ్యిందని, చిక్కుముడులు ఎక్కువయ్యాయని అన్నారు. తమకు చిత్తశుద్ధి తప్ప, బలం లేదని జేపీ పేర్కొన్నారు.

హస్తినలో ధర్నా

- ముహూర్తం.. మార్చి 5
- ప్రతిపక్ష నేత జగన్ వెల్లడి
- ప్రత్యేకహోదాయే డిమాండు
- నెల్లూరు భేటీలో పార్టీ నిర్ణయం

నెల్లూరు/అమరావతి, ఫిబ్రవరి 12(మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద మార్చి 5వ తేదీన భారీ ధర్నా నిర్వహించాలని వైఎస్ఆర్‌సీపీ అధినేత, ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్ణయించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు పునఃప్రారంభం అవుతున్న సందర్భంగా అదే రోజు దేశ రాజధాని వేదికగా ధర్నా చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా నెల్లూరు జిల్లాలో పాదయాత్ర చేస్తున్న జగన్.. అక్కడే ముఖ్యనాయకులతో సోమవారం సుదీర్ఘంగా రెండు గంటల పాటు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పలు అంశాలపై ముమ్మరంగా చర్చలు జరిగాయి. చర్చల అనంతరం నిర్ణయాలను పార్టీ సీనియర్ నాయకుడు భూమన కరుణాకరరెడ్డి వెల్లడించారు. ఢిల్లీలో నిర్వహించే ధర్నాలో పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నేతలు పాల్గొంటారన్నారు. మార్చి ఒకటో తేదీన ముందుగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అలాగే మూడో తేదీన పార్టీ ముఖ్య నాయకులంతా పాదయాత్రలో పాల్గొంటారన్నారు. అనంతరం అదే రోజు వైఎస్ జగన్ జెండా ఊపి నాయకుల ఢిల్లీ యాత్రను ప్రారంభి స్తారన్నారు. భవిష్యత్తు కార్యాచరణ గురించి కూడా సమావేశంలో చర్చించామన్నారు. ప్రత్యేక హోదా మన హక్కు.. ప్యాకేజి మాకొద్దు అనేదే పార్టీ నినాదమని ఆయన చెప్పారు. ప్రత్యేక హోదా అనేది ఏపీకి సంజీవని లంటిదని, కానీ హోదాతో సమాన ప్యాకేజి అంటూ ఇన్నాళ్లూ చంద్రబాబు కల్లబొల్లి కబుర్లు చెప్పారని భూమన ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదాకు చంద్రబాబు సర్కారు సమాధి కట్టిందని ఆయన మండిపడ్డారు. ప్రజ ల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందుకు సాగుతామని, అవసరమైతే రాజీనామాలు చేయడానికి కూడా తమ పార్టీ ఎంపీలు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. కాగా ఈ సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ ఎంపీలు, ప్రాంతీయ సమన్వయకర్తలు, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

రాజీనామాలపై చర్చ

సమావేశంలో ప్రధానంగా ఎంపీల రాజీనామాలపై ముమ్మరంగా చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రత్యేకహోదా కోసం సభలో గట్టిగా పట్టుబట్టి.. అవసరమైతే వెంటనే రాజీనామాలు చేయాలని కొంతమంది నాయకులు ప్రతిపాదించారు. అయితే, రాజీనామాలు చేయడం వల్ల తక్షణ ప్రయోజనం ఏమీ ఉండబోదని.. పైగా దానివల్ల సభలో మాట్లాడే అవకాశం లేకుండా పోతుందని జగన్ సూచించినట్లు సమాచారం. పార్లమెంటు సమావేశాలు మళ్లీ ప్రారంభం అయ్యేలోగా ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని రాష్ట్రంలో రాజకీయ పార్టీలు గట్టిగా డిమాండు చేస్తున్న సంగతి తెలిసిందే. తెలుగుదేశం పార్టీ కూడా ఎంపీల రాజీనామా దిశగా ఆలోచిస్తున్న నేపథ్యంలో, వాళ్ల కంటే ముందుగానే రాజీనామాలు చేస్తే ప్రజల్లో సానుభూతి వస్తుందని ఉత్త రాంధ్ర ప్రాంతానికి చెందిన ఒక కీలక నేత ప్రస్తావించ గా.. దాన్ని జగన్ సున్నితం గా తిరస్కరించినట్లు తెలిసిం ది. ఎప్పుడన్న విషయా న్ని పక్కన పెడితే, రాజీనా మా లు మాత్రం చేయాల్సిం దేనని అందరూ ఏకగ్రీవంగా అభిప్రాయపడినట్లు సమాచారం.





అదే వ్యూహం

- వాళ్లు అక్కడ చేసిందే మనం ఇక్కడ చేద్దాం
- అసెంబ్లీలో టీడీపీకి చుక్కలు చూపాలి
- పూర్తిస్థాయి ప్రతిపక్ష పాత్ర పోషించాలి
- అసెంబ్లీ సమావేశాల్లో కమలం వ్యూహం
- విష్ణుకుమార్ రాజు.. వీర్రాజుల నేతృత్వం

విశాఖపట్నం, ఫిబ్రవరి 12 (మనం న్యూస్‌బ్యూరో): పార్లమెంటులో తెలుగుదేశం పార్టీ ఏం చేసిందో... అదే పని రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ చేయనుంది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో ఆకస్మికంగా వ్యూహం మార్చి ప్రత్యేక హోదా, ప్యాకేజీల నినాదంతో కేంద్రంలో అధికారపక్షమైన బీజేపీని... మిత్రపక్షమైన తెలుగుదేశం పార్టీ ఇబ్బందులకు గురిచేసిన సంగతి తెలిసిందే. దాంతో మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ కూడా ఇక్కడ రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీని అదే తరహాలో ఇరకాటంలో పెట్టేందుకు సిద్ధమైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. పార్లమెంటులో టీడీపీ నినాదం ప్రత్యేక హోదా, ప్యాకేజీ అయితే, ఇక్కడ బీజేపీ నినాదం కేంద్ర నిధుల దుర్వినియోగం, అవినీతి, అక్రమాలు. రాష్ట్రంలో జరిగిన అవినీతి వ్యవహారాలపై ఇంతకాలం మిత్రపక్షంగా మౌనం దాల్చిన బీజేపీ.. ఇక పూర్తిస్థాయిలో ప్రతిపక్షపాత్ర పోషించాలని నిర్ణయించుకుంది. ఇటు శాసనసభ, అటు శాసనమండలిలలో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయడం ద్వారా దెబ్బకు దెబ్బ తీయాలని ఆ పార్టీ నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. బీజేపీకి అసెంబ్లీలో నలుగురు, శాసనమండలిలో ఇద్దరు సభ్యులున్నారు. అసెంబ్లీలో బీజేఎల్పీ నేత పెన్మత్స విష్ణుకుమార్ రాజు నేతృత్వంలో, శాసనమండలిలో ఫైర్‌బ్రాండ్ నాయకుడు సోము వీర్రాజు నేతృత్వంలో అవినీతి, అక్రమాల ఆధారంగా ప్రభుత్వాన్ని నిలదీసేందుకు రంగం సిద్ధమైంది. అన్ని అంశాలలో తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా వ్యవహరించే రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్‌ను పెద్దగా పరిగణనలోకి తీసుకోకుండా తన పని తాను చేసుకోపోవాలనే అభిప్రాయానికి బీజేపీ నాయకులు వచ్చినట్లు తెలిసింది.

అవినీతి, అక్రమాలే అస్త్రాలు

పోలవరం మినహా ఇతర సాగునీటి ప్రాజెక్టుల విషయంలో జరిగిన అక్రమాలు, పంచాయతీరాజ్, గృహనిర్మాణం, ఆర్అండ్‌బీ, మైనింగ్, రెవెన్యూ, మున్సిపల్ శాఖలలో జరిగిన అక్రమాలపై బీజేపీ దృష్టి పెట్టనుంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి చెందిన హంద్రీ - నీవా సుజల స్రవంతి, గాలేరు - నగరి ప్రాజెక్టుల అంచనాలను రెట్టింపు చేసి వందల కోట్లను దోచుకొన్నారని, పనులు ఏ మాత్రం ముందుకు సాగడం లేదని బీజేపీ నేతలు అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ఇతర ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురౌతున్న తీరును కూడా ప్రస్తావించాలని నిర్ణయించారు.

కేంద్రం నుంచి వచ్చిందెంత.. ఖర్చు ఎంత?

గ్రామీణ రహదారులు, బహిరంగ మల. మూత్ర వసర్జన నిర్మూలన, స్వచ్ఛభారత్, పంచాయతీరాజ్ , గృహ నిర్మాణం, బీమా తదితర పథకాలకు కేంద్రం నుంచి ఈ నాలుగు సంవత్సరాల్లో వచ్చిన నిధులెన్ని, అందులో వినియోగమెంత అనే అంశాన్ని అసెంబ్లీ సాక్షిగా నిలదీయడానికి బీజేపీ సిద్ధమవుతోంది. ఈ వివరాలను ప్రభుత్వంతోనే చెప్పించి వాస్తవాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలనేది పార్టీ వ్యూహం. కేంద్రం మంజూరు చేసిన నిధులు, పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ పరంగా జరిగిన లోపాలను అసెంబ్లీ వేదికగా ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని ఆ పార్టీ నేతలు యోచిస్తున్నారు. వివిధ ప్రాజెక్టులకు డీపీఆర్‌లు సమర్పించకపోవడం, యుటిలిటీ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వంటివి రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి జరిగిన లోపాలైనందున.. వాటిని ఎత్తిచూపాలన్న కోణంలో రాష్ట్ర బీజేపీ ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇందుకోసం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఇప్పటినుంచే సన్నద్ధం చేసే పనిని పార్టీ ప్రారంభించింది. సోమవారం విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ నేతలు కేంద్రం నుంచి వచ్చిన నిధులపై బహిరంగ చర్చకు సిద్ధమంటూ రాష్ట్ర ప్రభుత్వానికి మరోమారు సవాల్ విసిరారు. ముష్టి, భిక్ష వంటి పదాలు వాడటం మంచిది కాదని హెచ్చరించారు.



భారీ మూల్యం తప్పదు

- పాక్‌కు రక్షణ మంత్రి నిర్మల హెచ్చరిక
- 'సుంజువా'పై మీడియా భేటీలో నిప్పులు
- దాడిలో జైషే ముష్కర సంస్థ ప్రమేయం
- నిఘా సంస్థలవద్ద పూర్తి ఆధారాలున్నాయ్
- ఎన్ని సాక్ష్యాలిచ్చినా స్పందించని దాయాది




జమ్ము, ఫిబ్రవరి 12: జమ్ముకశ్మీర్‌లో దుస్సాహసానికి పాకిస్థాన్ భారీ మూల్యం చెల్లించక తప్పదని భారత రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ హెచ్చరించారు. సుంజువాలో ఉగ్ర వాదుల ఏరివేత సోమవారం ఉదయం 10:30 గంటలకు ముగిసినప్పటికీ ప్రక్షాళన కార్యక లాపాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె జమ్ములో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాక్‌పై నిప్పులు చెరిగారు. ఒక పౌరుడుసహా ఆరుగురి ప్రాణాలను ఉగ్రవాదులు బలిగొన్నారని ఈ సందర్భంగా ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ముగ్గురు ముష్కరులను మట్టు బెట్టడంలో సైనికులు అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించారని కొనియాడారు. అయితే, ఈ పోరులో ఐదుగురు జవాన్లు అమరులయ్యారని విచారం వ్యక్తం చేశారు. సైనిక క్వార్టర్లలో చొరబడిన ఉగ్రవాదులు జైషే-మొహమ్మద్ సభ్యులేనని, పాకిస్థాన్ అండతో ఆ ముష్కర సంస్థ అధిపతి అజహర్ మసూద్ దీనికి సూత్రధారిగా వ్యవహరించాడని స్పష్టం చేశారు. నలుగురు ఉగ్రవాదులు చొరబడినట్లు తొలుత వార్తలు వచ్చినా- నాలుగో వ్యక్తి వారికి మార్గం చూపినవాడై ఉంటాడని, అతడు సైనిక శిబిరంలో ప్రవేశించి ఉండకపోవచ్చునని పేర్కొన్నారు.

పాక్‌కు సాక్ష్యాధారాలు అందజేస్తాం

ప్రస్తుత ఉగ్రదాడులపైనా సేకరించిన వివ రాలను క్రోడీకరిస్తున్నామని, వాటిని కచ్చితంగా పాక్‌కు అందజేస్తామని నిర్మల ప్రకటించారు. కానీ, ఇలాంటి సాక్షా ్యలెన్నిటినో అందించినా దాయాది దేశం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ''పాక్‌కు సాక్ష్యాధారాలు ఇవ్వడం నిరంతరంగా సాగుతున్న ప్రక్రియ. ఈ ముష్కర దాడులకు వారే బాధ్యులన్నది తేటతెల్లం చేసే నూటికి నూరుపాళ్ల వాస్తవాలను పదేపదే రుజువు చేసుకోవాల్సి రావడం దారుణం. పాకిస్థాన్ తన దుస్సాహసానికి భారీ మూల్యం చెల్లించక తప్పదు'' అని స్పష్టం చేశారు. ఉగ్రవాదులను సరిహద్దుల ఆవలి సూత్రధారులు నియంత్రిస్తున్నారని నిఘావర్గాలవద్ద కచ్చితమైన సమా చారం ఉన్నట్లు తెలిపారు. ఈ ఆధారాలను జాతీ య దర్యాప్తు సంస్థ క్రోడీక రిస్తున్నదని చెప్పారు. మరోవైపు ఉగ్ర పడగను పీర్‌పంజాల పర్వత శ్రేణులవైపునా పాకిస్థాన్ విస్తరి స్తున్నదని, చొరబాట్లకు వీలుగా కవ్వింపు కాల్పులకు పాల్పడుతున్నదని పేర్కొన్నారు.




సెన్సెక్స్ ఫిబ్రవరి 2018 12



పెరిగినవి	%	తగ్గినవి	%
టాటా స్టీల్	4.22	ఎస్‌బిఐ	-2.67
బి.హెచ్.ఇ.ఎల్	3.17	ఇన్ఫోసిస్	-0.72
యస్ బ్యాంకు	2.89	ఐ.టి.సి	-0.53
ఇండస్‌ఇండ్	2.12	ఎం అండ్ ఎం	-0.43
హీరో మోటో	1.94	ఐసీఐసీఐ బ్యాంకు	-0.23

నిఫ్టీ ఫిబ్రవరి 2018 12



పెరిగినవి	%	తగ్గినవి	%
టాటా స్టీల్	4.06	హెచ్‌సిఎల్ టెక్	-2.58
యస్ బ్యాంకు	3.03	ఎస్‌బిఐ	-2.58
అరబిందో	3.02	బి.పి.సి.ఎల్	-1.65
పవర్ గ్రిడ్	2.74	హెచ్.పి.సి.ఎల్	-1.07
యు.పి.ఎల్	2.56	భారతీ ఇన్‌ఫ్రా	-0.95

టాప్ గైనర్స్ 12 ఫిబ్రవరి

34,300.47

బి.ఎస్.ఇ సెన్సెక్స్

పాయింట్లు	294.71	%
712.50	టాటా స్టీల్	4.22%
334.95	యస్ బ్యాంకు	2.89%
198.05	పవర్ గ్రిడ్	2.51%
1686.45	ఇండస్‌ఇండ్	2.12%
3615.00	హీరో మోటో	1.94%
914.70	రిలయన్స్	1.87%
1805.40	హెచ్‌డీఎఫ్‌సీ	1.82%
9106.10	మారుతి సుజుకి	1.78%
190.85	ఓఎన్‌జీసీ	1.65%
1351.05	లార్సెన్	1.63%

బులియన్| గత 7 రోజులు



రూపాయి వర్సెస్ డాలర్



కొనసాగిన కొనుగోళ్లు

పుంజుకున్న సెన్సెక్స్, నిఫ్టీలు



ముంబయి: దేశీయ ఈక్విటీలు కడపటి పది సెషన్లలో రెండవసారి లబ్ధి పొంది, రెండు వారాల క్షీణతల నుంచి సోమవారం కాస్త కోలుకున్నాయి. ప్రపంచ మార్కెట్ల సానుకూల సంకేతాల మధ్య మదుపరులు ఇటీవల బాగా దెబ్బతిన్న లాభసాటి షేర్ల కొనుగోలుకు దిగడంతో బొంబాయి స్టాక్ ఎక్ఛ్సేంజ్ (బి.ఎస్.ఇ) సెన్సెక్స్ దాదాపు 295 పాయింట్లు, నేషనల్ స్టాక్ ఎక్ఛ్సేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి నిఫ్టీ 85 పాయింట్లు లాభపడ్డాయి. దానికి తోడు కంపెనీలు ప్రకటిస్తున్న ఆదాయాలు పటిష్టంగా ఉన్నాయి. రిటైల్ ద్రవ్యోల్బణం కొద్దిగానన్నా తగ్గుతుందనే అంచనాలు సెంటిమెంట్ పునరుద్ధరణకు తోడ్పడ్డాయి. ఇటీవల బాగా దెబ్బతిన్న విద్యుత్, స్థిరాస్తులు, యంత్రాలు, యంత్ర పరికరాలు, బ్యాంకింగ్ రంగ షేర్లను మదుపరులు భారీగా కొనుగోలు చేశారు. దేశీయ మ్యూచువల్ ఫండ్ల నిర్వాహకులు, రిటైల్ మదుపరులు ఇద్దరూ కొనుగోళ్లు కొనసాగించారు. టాటా స్టీల్ ఈ ఆర్థిక సంవత్సర మూడవ త్రైమాసికానికి 5 రెట్లు ఎక్కువగా నికర లాభాన్ని ప్రకటించడంతో, ఆ కంపెనీ షేర్ ధర బి.ఎస్.ఇలో 4.22 శాతం పెరిగింది. ఇటీవల బాగా అమ్మకాలను చవిచూసిన ఆరోగ్య రక్షణ రంగ షేర్లు సోమవారం కొనుగోళ్లను చూశాయి. ఈ క్యూ3కి సంబంధించి భారీ నష్టాన్ని నమోదు చేసిన స్టేట్ బ్యాంక్ ఇండియా షేర్ ధర మాత్రం బాగా పతనమైంది.

నేడు సెలవు

మహా శివరాత్రి సందర్భంగా స్టాక్ మార్కెట్లు 2018 ఫిబ్రవరి 13 మంగళవారంనాడు మూసి ఉంటాయి.

తెప్పరిల్లిన ప్రపంచ మార్కెట్లు

శుక్రవారంనాడు వాల్‌స్ట్రీట్ చక్కని పరిస్థితి కనబరచింది. ఆసియాలోని ఇతర మార్కెట్లు, ఐరోపా మార్కెట్లు కూడా దృఢపడుతున్న ధోరణి కనిపించింది. అవి దేశీయ మార్కెట్లలో మదుపరుల ఉత్సాహాన్ని పెంపొందించాయి. షాంఘై కాంపొజిట్ 0.78 శాతం, సింగపూర్ 0.28 శాతం, మలేషియా 0.57 శాతం లాభపడ్డాయి. ట్రేడింగ్ ప్రారంభంలో యూరోపియన్ మార్కెట్లు పెరుగుతున్న స్థితిలో ఉన్నాయి.

పెరిగిన చమురు ధరలు

అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు వరుసగా ఆరవ రోజు శుక్రవారంనాడు తగ్గినవి మళ్ళీ పెరగడం ప్రారంభించాయి. డాలరుతో రూపాయి మారకం విలువ కూడా



కోలుకుంటున్న బాటలో ఉన్నట్లుగా కనిపించింది. ఇవి కూడా సెంటిమెంట్లను పునరుద్ధరించాయి.

దేశీయ కొనుగోళ్లు

తాత్కాలిక డాటా ప్రకారం, దేశీయ మదుపు సంస్థలు శుక్రవారం నికరంగా రూ. 588.42 కోట్ల విలువైన షేర్లు కొనుగోలు చేయగా, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు నికరంగా రూ. 1,351.70 కోట్ల విలువ చేసే షేర్లను అమ్మేశారు.

లాభపడ్డ సూచీలు

సెన్సెక్స్ సోమవారం ఒక దశలో 34,351.34 పాయింట్ల గరిష్ఠ స్థితిని చూసి తర్వాత 34,115.12 పాయింట్లకు తగ్గింది. మళ్ళీ కొద్దిగా పెరిగి మొత్తానికి సోమవారంనాడు 34,300.47 పాయింట్ల వద్ద ముగిసింది. అది శుక్రవారం (ఒక నెల కనిష్ఠ స్థాయి) 34,005.76 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ సోమవారం 10,555.50 పాయింట్ల గరిష్ఠ స్థితిని చూసి, 10,539.75 పాయింట్ల వద్ద ముగిసింది.

ద్రవ్యోల్బణంలో స్వల్ప క్షీణత



న్యూఢిల్లీ: కూరగాయలు, పండ్లు, ఇంధన కంపొనెంట్ల ధరలు సడలడం వల్ల జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.07 శాతానికి తగ్గింది. వినియోగదార్ల ధరల సూచి (సి.పి.ఐ) ఆధారంగా దీన్ని లెక్కగడతారు. ద్రవ్యోల్బణం 2017 డిసెంబరులో అప్పటికి 17 నెలల్లో ఎన్నడూ లేనంత గరిష్ఠంగా 5.21 శాతంగా ఉంది. దాన్నుంచి జనవరిలో అది స్వల్పంగా 5.07 శాతానికి తగ్గింది. గత ఏడాది జనవరిలో ద్రవ్యోల్బణం 3.17 శాతంగా మాత్రమే ఉంది. ఆహార పదార్థాల ధరల పెరుగుదల రేటు డిసెంబరులో ఉన్న 4.96 శాతం నుంచి జనవరిలో 4.7 శాతానికి తగ్గిందని కేంద్ర గణాంకాల కార్యాలయం (సి.ఎస్.ఓ) విడుదల చేసిన డాటా వెల్లడించింది. కూరగాయల ద్రవ్యోల్బణం డిసెంబరులో 29.13 శాతంగా ఉన్నది జనవరిలో స్వల్పంగా తగ్గి 26.97 శాతంగా ఉంది. పండ్ల ధరలు కూడా జనవరిలో స్వల్పంగా 6.24 శాతం పెరిగాయి. అవి డిసెంబరులో 6.63 శాతంగా నమోదయ్యాయి. ఇంధనం, లైట్ల విభాగంలో ద్రవ్యోల్బణం డిసెంబరులో 7.90 శాతంగా ఉన్నది గత నెలలో 7.73 శాతానికి స్వల్పంగా తగ్గింది. ఎన్.ఎస్.ఎస్.ఓకు చెందిన క్షేత్రస్థాయి కార్యకలాపాల విభాగం ఎంపిక చేసిన పట్టణాలు, తపాలా శాఖ ఎంపిక చేసిన గ్రామాల నుంచి ధరల డాటా సేకరించారు.

నష్టాల్లో బి.ఓ.ఐ

ముంబయి: బ్యాంక్ ఆఫ్ ఇండియా (బి.ఓ.ఐ) ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ. 2,341.23 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. రూ. 14,057 కోట్ల మేరకు ఉన్న మొండి బాకీల సంగతిని అది ఇప్పటివరకు వెల్లడించకపోవడంతోపాటు, ట్రెజరీ నష్టాలు కూడా దానికి కారణంగా భావిస్తున్నారు. బి.ఓ.ఐ గత ఆర్థిక సంవత్సరం క్యూ 3లో రూ. 102 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. బ్యాంకు 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ. 14,057 కోట్ల మేరకు ఉన్న స్థూల నిరర్థక ఆస్తులు, రూ. 9,707 కోట్ల మేరకు ఉన్న నికర నిరర్థక ఆస్తుల సంగతిని వెల్లడించలేదని ఆర్బీఐ కనుగొంది. ఎస్బీఐ కూడా ఇలాగే రూ. 23,330 కోట్ల మేరకు ఉన్న మొండి బాకీల సంగతిని వెల్లడించకుండా దాచి పెట్టింది. ఫలితంగా బ్యాంకు ఈ ఆర్థిక సంవత్సర క్యూ 3లో రూ. 1887 కోట్ల నికర నష్టాన్ని నమోదు చేసింది. బి.ఓ.ఐ స్థూల రుణాలు రూ. 3,87,028 కోట్ల నుంచి రూ. 3,79,538 కోట్లకు తగ్గాయి. ప్రభుత్వం నుంచి బీఓఐ రూ. 9,232 కోట్ల మూలధనం పొందుతోంది.


వినియోగదార్లపై లేదు కలత...

కాసులపైనే మనసంతా



న్యూఢిల్లీ: కేంద్రం పెట్రోలు, డీజిలుపై లెవీల ద్వారా 2014-15 నుంచి 2018-19 మధ్య కాలంలో రూ. 10 లక్షల కోట్లకు పైగా గడించనున్నట్లు అంచనా. ఎక్సైజ్ సుంకాలలో పెంపుదలతో కూడా కలుపుకుని పెట్రోలియం ఉత్పత్తుల నుంచి కేంద్ర స్థూల రెవిన్యూ వసూళ్ళు 2014-15లో ఉన్న రూ. 1.05 లక్షల కోట్ల నుంచి ఈ ఐదేళ్ళలో స్థిరంగా పెరుగుతూ వచ్చాయని, అవి వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 2.57 లక్షల కోట్ల మేరకు ఉండగలవని అధికారిక డాటా వెల్లడిస్తోంది. దీనికి ముందు, 2013-14లో, పెట్రోలియం, ఆయిల్, లూబ్రికెంట్ల (పి.ఓ.ఎల్) నుంచి స్థూల రెవిన్యూ వసూళ్ళు రూ. 88,600 కోట్ల మేరకు ఉన్నాయి. పి.ఓ.ఎల్ ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకం నుంచి రెవిన్యూ నిధులకు గణనీయమైన వనరుగా ఉందని, ద్రవ్య లోటును అదుపులో ఉంచడానికి సహాయపడడమేకాక, ఉత్పాదక వ్యయాన్ని పెంచడానికి కూడా తోడ్పడుతూ వచ్చిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ అధికారులు సమయం వచ్చినప్పుడల్లా చెబుతూ వస్తున్నారు. ''ఇంధనంపై సుంకాలు కేంద్రానికి, రాష్ట్రాలకు రెండింటికీ కూడా రెవిన్యూకి పెద్ద వనరుగా ఉంటూ, వ్యయాలకు నిధులు సమకూర్చేందుకు సహాయపడుతున్నాయి'' అని ఒక అధికారి చెప్పారు. పెట్రోలు, డీజిలుపై రాష్ట్రాలు కూడా వాల్యూ యాడెడ్ ట్యాక్స్‌ను విధిస్తున్న సంగతిని ఆయన గుర్తు చేశారు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఇటీవలి బడ్జెట్‌లో, లీటరు పెట్రోలుపై 8 రూపాయల చొప్పున రోడ్డు, మౌలిక వసతుల సెస్సు విధించారు. అది రూ. 1,13,000 కోట్ల మేరకు రాబడి తెచ్చిపెట్టగలదని అంచనా. దీనికి ప్రతిగా, ఆయన లీటరు పెట్రోలుపై అదనపు ఎక్సైజ్ సుంకంగా ఉన్న 6 రూపాయలను ఉపసంహరించుకున్నారు. ప్రాథమిక ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు 2 రూపాయల చొప్పున తగ్గించుకున్నారు.

అయితే, ఇలా రేట్లను మార్చి సెస్సు విధించడం వల్ల రిటైల్ వినియోగదార్లకు ధరల్లో కనిపించగల ప్రభావం ఏమీ ఉండదని ఆర్థిక శాఖ కార్యదర్శి హస్‌ముఖ్ అధియా అన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తక్కువగా ఉండడాన్ని ఆసరా చేసుకుని, 2014 నవంబరు నుంచి ఆర్థిక మంత్రిత్వ శాఖ వరుసగా అనేక విడతల్లో ఇంధనంపై ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. అన్ బ్రాండెడ్ పెట్రోలుపై కేంద్ర ఎక్సైజ్ సుంకం 2014 నవంబరులో లీటరుకు రూ. 9.20గా ఉన్నది, 2017 జూలైలో అత్యధికంగా రూ. 21.48కి చేరుకుని, ప్రస్తుతం లీటరుకు రూ. 19.48గా ఉంది. అదే మాదిరిగా, అన్‌బ్రాండెడ్ డీజిలుపై కేంద్ర ఎక్సైజ్ సుంకం (2014 నవంబరు) లీటరుకు రూ. 3.46గా ఉన్నది, ప్రస్తుతం లీటరుకు రూ. 15.33కు చేరుకుంది. ఇటీవలి నెలల్లో, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతూండడంతో, ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించుకుని, రిటైల్ ధరలు తగ్గేట్లు చూడవలసిందిగా కేంద్రంపై ఒత్తిడి పెరుగుతోంది. దానికి తగ్గట్లుగానే, ఆర్థిక మంత్రిత్వ శాఖ 2017 అక్టోబరు 4న లీటరుకు ఉన్న సుంకాల్లో రూ. 2 తగ్గించింది. ఆర్థిక సంవత్సరం మిగిలిన భాగంలో దానివల్ల రాబడిలో రూ. 13,000 కోట్ల మేల లోటు ఏర్పడగలదని అంచనా వేశారు.



''వినియోగదారులకు మరింత ఊరట కలిగించేందుకు పెట్రోలు, డీజిలుపై విధించిన 'వ్యాట్'ను తగ్గించుకోవలసిందిగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అభ్యర్థించింది. పెట్రోలు, డీజిలుపై 'వ్యాట్'ను నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం తగ్గించుకున్నాయి'' అని ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా ఇటీవల లోక్ సభకు తెలిపారు. కానీ, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు మరింత పెరిగినా, ప్రభుత్వం ఎక్సైజ్ సుంక రేట్లను తగ్గించే నిర్ణయం ఏదీ తీసుకోలేదు.

కల్లోలపరుస్తున్న ఫెడ్ విధానాలు



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా స్టాక్ మార్కెట్లు కడచిన వారంలో తీవ్ర ఉత్థాన పతనాలకు లోనయ్యాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్.పి.ఐ)లు నికరంగా 938 మిలియన్ డాలర్ల విలువైన ఇండియన్ ఈక్విటీని విక్రయించారు. ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధానాన్ని కట్టుదిట్టం చేసే (రుణాలను తగ్గించి, వడ్డీ రేట్లు పెంచడం) చర్యలకు దిగడంతో భారతదేశానికి వచ్చే విదేశీ ఫండ్ల నిధులు వచ్చే రెండు మూడేళ్ళలో తగ్గే అవకాశం ఉంది. దాదాపు సున్నా వడ్డీ రేట్లకే అమెరికాలో వ్యవస్థలోకి అపరిమితంగా నగదును ప్రవహింపజేయడం, డాలర్లలో ఇచ్చే రుణాలు ఇబ్బడిముబ్బడిగా పెంచేయడంతో ఆ నిధులు భారతదేశంతో సహా ప్రవర్ధమాన మార్కెట్లలోకి ప్రవహించా యి. ప్రవర్ధమాన మార్కెట్ ఆర్థిక వ్యవస్థలలోకి 2010 నుంచి సుమారు 260 బిలియన్ డాలర్ల పోర్ట్‌ఫోలియో నిధులు ప్రవహించాయని, ఫెడరల్ రిజర్వ్ అనుసరించిన సంప్రదాయ విరుద్ధ విధానాలే దానికి కారణమని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐ.ఎం.ఎఫ్)కు చెందిన ప్రపంచ ఆర్థిక సిర్థత్వ నివేదిక వెల్లడించింది. ద్రవ్య విధానాన్ని సాధారణ స్థితికి తెచ్చే దిశగా ఫెడ్ అడుగులు వేస్తూండడంతో, ప్రవర్ధమాన ఆర్థిక వ్యవస్థలలోకి వచ్చే పోర్ట్‌ఫోలియో నిధులు ఏడాదికి సుమారు 35 బిలియన్ డాలర్ల మేరకు తగ్గిపోవచ్చని ఐ.ఎం.ఎఫ్ అంచనా వేసింది.

పటిష్టమైన సంబంధం

ఫెడ్ ద్రవ్య విధానాన్ని సడలింపజేయడానికి ఇండియాలోకి నిధులు ప్రవహించడానికి మధ్య పటిష్టమైన సంబంధం ఉన్నట్లు కనిపిస్తోంది. అమెరికా ఆర్థిక వ్యవస్థలోకి ద్రవ్యతను చొప్పించడానికి ఫెడ్ 2009 నుంచి ఆస్తులు కొనుగోలు చేస్తూ వస్తోంది. దీనితో ఫెడ్ లాభాలు 2007 ఆగస్టులో ఉన్న 865 బిలియన్ డాలర్ల నుంచి 2014 అంతానికి 4.5 ట్రిలియన్ డాలర్లకు తగ్గింది. వడ్డీ రేటును అది 2006 జూన్‌లో ఉన్న 5.25 శాతం నుంచి 2008 డిసెంబరుకు 0.25 శాతానికి తగ్గించివేసింది. తక్కువ వడ్డీ రేట్లకు లభిస్తున్న రుణాలు తీసుకుని చాలా మంది ప్రపంచ వ్యాప్తంగా వివిధ ఆస్తుల తరగతులలో ఇన్వెస్ట్ చేశారు. అందులో కొంత నగదు ఇండియాకు కూడా వచ్చింది. భారతీయ ఈక్విటీ మార్కెట్‌లోకి విదేశీ పోర్ట్‌ఫోలియో నిధులు 2009-2014 మధ్య కాలంలో రికార్డు స్థాయిలో అత్యధికంగా ప్రవహించాయి. ఆ కాలంలో సగటున ఏడాదికి 15 బిలియన్ డాలర్లు వచ్చిపడ్డాయి. అలాగే, 2010లో, 2012లో, 2013 సంవత్సరాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లలోకి 20 బిలియన్ డాలర్లకు పైగా వచ్చి పడ్డాయి. ఫెడ్ 2015లో ఆస్తుల్ని కొనడం ఆపేసి, 2015 డిసెంబర్ నుంచి వడ్డీ రేట్లను పెంచడం ప్రారంభించింది. భారతదేశంలోకి వార్షిక ఎఫ్.పి.ఐ ప్రవాహాలు కూడా 2015 నుంచి తగ్గిపోతూ వచ్చాయి. భారతీయ స్టాక్ మార్కెట్లు ఓ మోస్తరుగా బలమైన పనితీరునే కనబరచినప్పటికీ, 2016లో, 2017లో సగటున 5 బిలియన్ డాలర్లు మాత్రమే వచ్చాయి.

అమెరికా నుంచి ఎఫ్.పి.ఐలు

ఫెడ్ విధానాలతో ఇటువంటి పటిష్టమైన సంబంధం ఏర్పడడానికి బహుశా భారతీయ స్టాక్ మార్కెట్లు అమెరికా నుంచే ఎక్కువ పరిమాణంలో నిధులను అందుకుంటూండడం కారణం కావచ్చు. భారతీయ సెక్యూరిటీలు, ఎక్ఛ్సేంజ్ బోర్డు (సెబి) ప్రకారం, అమెరికాకు చెందిన ఎఫ్.పి.ఐలు 2017 డిసెంబర్ అంతానికి రూ. 9,82,055 కోట్ల విలువైన షేర్లు కలిగి ఉన్నారు. భారతీయ ఈక్విటీలోని మొత్తం ఎఫ్.పి.ఐ హోల్డింగ్‌లో అది 35 శాతం వాటా కింద లెక్కకు వస్తుంది. భారతదేశంలోని మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో అమెరికాకు చెందిన ఎఫ్.పి.ఐల వాటా శాతం ప్రకారం చూస్తే 6.66గా ఉంటుంది. ఫెడ్ 2017 అక్టోబరు నుంచి ద్రవ్య విధానాన్ని కట్టుదిట్టం చేసే దిశగా కదులుతూండడంతో, విదేశీ నిధుల ప్రవాహాలపై ప్రభావం పడింది. ఫెడ్ భవిష్యత్తులో వడ్డీ రేట్లను ఇంకా పెంచవచ్చనే ఊహాగానాలు ఇంకా ఎక్కువ ఆందోళన కలిగిస్తున్నాయి. అమెరికాలో వడ్డీ రేటును 2015 డిసెంబరు నుంచి 2017 మధ్య కాలంలో ఐదుసార్లు పెంచారు. వడ్డీ రేట్లు 1.25 నుంచి 1.5 శాతం స్థాయిలో ఉన్నాయి. అవి 2018 అంతానికి 2.1 శాతానికి, 2019 అంతానికి 2.9 శాతానికి పెరగగలవని అంచనా.

జోరుగా ఫ్లాట్ల విక్రయం

న్యూఢిల్లీ: గుర్గాంవ్‌లోని ట్రంప్ టవర్స్ ప్రాజెక్టులో రూ. 500 కోట్ల విలువైన ఆస్తులు గత నెల రోజుల్లో విక్రయించగలిగినట్లు ఎం3ఎం ఇండియా సోమవారం వెల్లడించింది. ఈ ప్రాజెక్టులో 250 యూనిట్లను విక్రయించడం ద్వారా రూ. 2,500 కోట్ల రాబడి చూడాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. అంతర్జాతీయ స్థాయి రియల్టీ బ్రాండ్ 'ట్రంప్ టవర్స్' ఎం3ఎం ఇండియా, త్రిబికా డెవలపర్స్ ద్వారా ఉత్తర భారతదేశంలోకి అడుగు పెట్టింది. ''ఈ ప్రాజెక్టును 2018 జనవరి మధ్యలో ప్రకటించాం. తక్కువ కాలంలోనే రూ. 500 కోట్ల వి లువైన ఫ్లాట్ల బుకింగులు సంపాదించగలిగాం. రోజుకు రెండు నివాసాల చొప్పున అమ్మగలుగుతున్నాం. ఒక్కో నివాసం సగటు ధర రూ. 7.5 కోట్లుగా ఉంటుంది'' అని ఎం3ఎం తెలిపింది.

కింగ్‌ఫిషర్ క్లైములు చెల్లించాల్సిందే

విజయ్ మాల్యాకు ప్రతికూలంగా లండన్‌లో వెలువడిన మరో తీర్పు



లండన్/సింగపూర్: ప్రస్తుతం మూతపడిన స్థితిలో ఉన్న కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించి ఆ సంస్థ అధినేత విజయ్ మాల్యా మరో న్యాయ పోరాటంలోను ఓటమిని చవిచూశారు. సింగపూర్‌కు చెందిన బి.ఓ.సి ఏవియేషన్‌కు సుమారు 9 కోట్ల అమెరికన్ డాలర్లను క్లైములుగా చెల్లించవలసి ఉంటుందని బ్రిటన్ హైకోర్టు ఆదేశించింది. ఇది 2014లో విమానాలను లీజుకు ఇవ్వడానికి సంబంధించి కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌తో ముడిపడిన కేసు. మద్యం వ్యాపారి 62 ఏళ్ళ విజయ్ మాల్యా ఇప్పటికే అనేక కోర్టు కేసులతో సతమతమవుతున్నారు. భారతీయ బ్యాంకులకు ఆయన రూ. 9,000 కోట్ల మేరకు రుణ బకాయిలను ఎగవేసిన ఆరోపణను ఎదుర్కొంటున్నారు. దానికి సంబంధించి తదుపరి విచారణకు ఆయనను అప్పగించాలని బ్రిటన్‌ను భారతదేశం కోరుతోంది. విమానాల లీజు కేసు మార్చి 16న లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ మేజిస్ట్రేట్ కోర్టుకు తిరిగి వచ్చింది. ''క్లైమ్‌ను విజయవంతంగా సమర్థించుకునే నిజమైన అవకాశం ప్రతివాదులకు లేదు'' అని లండన్‌లో బిజినెస్ అండ్ ప్రాపర్టీ కోర్ట్స్ ఆఫ్ ద హైకోర్ట్‌కు చెందిన జస్టిస్ పికెన్ ఫిబ్రవరి 5న ఇచ్చిన తీర్పులో పేర్కొన్నారు. సింగపూర్‌లోని బి.ఓ.సి ఏవియేషన్, బి.ఓ.సి ఏవియేషన్ (ఐర్లాండ్) లిమిటెడ్ వేసిన దావాలో గింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ లిమిటెడ్, యునైటెడ్ బ్రూవరీస్ (హోల్డింగ్స్) లిమిటెడ్‌లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. ''తీర్పు మాకు సంతోషాన్ని ఇచ్చింది. ఈ దశలో ఇంతకుమించి వ్యాఖ్యానించదలచుకోలేదు'' అని సింగపూర్‌లోని బి.ఓ.సి ఏవియేషన్ అధికార ప్రతినిధి ఒకరు చెప్పారు. ఈ లీగల్ క్లైమ్ విమానాలను లీజుకిచ్చే కంపెనీ బి.ఓ.సి ఏవియేషన్‌కు కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కి మధ్య నాలుగు విమానాల లీజు అగ్రిమెంటుకు సంబంధించినది. మూడు విమానాల అప్పగింత పూర్తయింది. లీజు ఒప్పందం కింద చెల్లించవలసి ఉన్న మొత్తాలను తొక్కిపెట్టినందుకుగాను నాల్గవ విమానాన్ని అప్పగించలేదని చెబుతున్నారు. ఇటువంటి వ్యవహారాలలో అయితే సాధారణంగా సెక్యూరిటీ డిపాజిట్ సమస్య పరిష్కారానికి సహాయపడుతుంది. కానీ, ఈ కేసులో అది కూడా తగినంత లేదని, ''ఒప్పందం ప్రకారం'' కింగ్‌ఫిషర్ చెల్లించవలసి ఉన్న మొత్తానికి సరిపోయేంతగా అది లేదని బి.ఓ.సి ఏవియేషన్ పేర్కొంది. దాని పర్యవసానంగానే అది లండన్ హైకోర్టును ఆశ్రయించింది. బి.ఓ.సికి చెల్లించవలసి ఉన్న బకాయిని వడ్డీతో సహా, కోర్టు ఖర్చులను కలిపి చెల్లించాలని జస్టిస్ పికెన్ తీర్పునిచ్చారు. అవన్నీ కలసి దాదాపు 9 కోట్ల అమెరికన్ డాలర్ల మేరకు ఉండవచ్చని భావిస్తున్నారు. ''ఈ కేసులో రెండవ ప్రతివాది (యునైటెడ్ బ్రూవరీస్) మొదటి ప్రతివాది (కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్)తో కలసి సంయుక్తంగాను, విడిగాను కక్షిదారు (బి.ఓ.సి ఏవియేషన్)కు బకాయి మొత్తంలో సగం చెల్లించడంలో బాధ్యత వహించవలసిందే'' అని కోర్టు ఆదేశించింది. ఈ అంశంపై కింగ్‌ఫిషర్ ఇంకా స్పందించలేదు.

అప్పగింత కేసు

మాల్యాను అప్పగించాలని ఇండియా పెట్టిన కేసులో తుది వాద ప్రతివాదనలలో ఒకటి మార్చి 16న సాగవలసి ఉంది. దానిపై ఛీఫ్ మేజిస్ట్రేట్ ఎమా అర్బత్‌నాట్ వచ్చే మే నెలలో తీర్పు వెలువరించవచ్చని భావిస్తున్నారు. మాల్యా అప్పగింత కేసులో కడపటి వాదనలు జనవరిలో సాగాయి. మాల్యా 6,50,000 పౌండ్ల బెయిల్ బాండ్ గడువును వచ్చే ఏప్రిల్ 2 వరకు పొడిగించారు. స్కాట్లండ్ యార్డ్ జారీ చేసిన వారంట్‌తో మాల్యాను గత ఏడాది ఏప్రిల్‌లో అరెస్టు చేశారు. అప్పగింత కేసుపై విచారణ గత ఏడాది డిసెంబరు 4న మొదలైంది. అప్పటి నుంచి ఆయన దాని వాద ప్రతివాదనలకు హాజరవుతూ వస్తున్నారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ భారదేశంలో బ్యాంకులకు దాదాపు రూ. 9,000 కోట్ల మేరకు రుణం ఎగవేసిందని అంచనా. ఆయనను భారతదేశానికి బలవంతంగా తిప్పి పంపవచ్చా అనే అంశంపై వాదనలు సాగుతున్నాయి.

తాము సమర్పించిన ఆధారాలు ఆ వ్యాపారవేత్తకు ''నిజాయతీ లేదు'' అని ధ్రువీకరిస్తున్నాయని, ఆయన అక్రమ ప్రాతినిధ్యాల ద్వారా రుణాలు పొందారని, వాటిని తిరిగి చెల్లించే ఉద్దేశం ఆయనకు లేదని అప్పగింత కేసులో భారత ప్రభుత్వం తరపున వాదిస్తున్న క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీస్ పేర్కొంది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ తీసుకున్న అప్పును చెల్లించలేకపోవడం వ్యాపార వైఫల్య ఫలితమేనని మాల్యా తరపున వాదిస్తున్న న్యాయవాదుల బృందం చెబుతోంది. అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభ విస్త ృత కోణం నుంచి దాన్ని చూడాలని, దాని యజమానికి ''మోసపూరిత'' ఉద్దేశాలు లేవని అది అంటోంది.

ప్రపంచ వ్యాప్తంగా మాల్యాకున్న 1.5 బిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను స్తంభింపజేసిన ఉత్తర్వుపై మరో కేసు కూడా నడుస్తోంది. 13 భారతీయ బ్యాంకులు సమర్పించిన డాక్యుమెంట్లపై రెండు రోజుల వాదనలు వచ్చే ఏప్రిల్ 11న ప్రారంభం కానున్నాయి.

మనం
www.manamnews.com
మందిరం
మంగళవారం, 13 ఫిబ్రవరి 2018



సా జిహ్వా యా శివం స్తౌతి తన్మనో ధ్యాయతీశ్వరం
తౌ కర్ణౌ త త్కథాలోకౌ తౌ హస్తౌ తస్య పూజకౌ
తే నేత్రే పశ్యతః పూజాం తచ్ఛిరః ప్రణతే శివే
తౌ పాదౌ యౌ శివక్షేత్రం భక్త్యా పర్యటత స్సదా

– బ్రహ్మోత్తర ఖండం

శివుని స్తోత్రం చేసేదే నాలుక. శివధ్యానం చేసేదే మనస్సు. శివకథా శ్రవణం చేయడం ఉత్సాహపడేవే చెవులు. ఆతని పూజకోసమే చేతులు. ఈశ్వర పూజను చూసేవే నేత్రాలు. అతనికి నమస్కరించేదే శిరస్సు. శివక్షేత్రాలకు భక్తితో వెళ్లేవి మాత్రమే పాదాలు.

శివపూజ చేయడమే చేతులకు అసలైన పని. అప్పుడుమాత్రమే అవి పవిత్రతను సంతరించుకుంటాయి. వేదాలుకూడా శివుణ్ణిఅభిషేకించే చేతులే గొప్పవని...శివుణ్ణి అభిషేకించే చేయి సాక్షాత్తూ భగవంతుని స్వరూపమని అయంమే హస్తో భగవానయంమే భగవత్తంఅంటూ స్పష్టం చేస్తున్నాయి. మానవుడై పుట్టిహరహర శంభో శంకరాఅంటూ శివుడిమీద చెంబుడునీళ్ళు పోయనివారి జన్మ వృథా! వివిధరకాల ద్రవ్యాలతో అభిషేకం చేయడంద్వారా పరమేశ్వరుని అనుగ్రహాన్ని సులువుగా పొందవచ్చు.

సాటి లేని పూజ

పుష్పాభిషేకం

ప్రకృతి రూపుదిద్దుకొన్నది పరమశివుని వల్లనే. అలాంటి ప్రకృతినుండి ఉద్భవించినవే పూలు. ప్రకృతిస్వరూపమైన పరమేశ్వరా! నీద్రవ్యాన్నే నీకు అర్పిస్తున్నాను. అంటూ పుష్పాలను సమర్పించడం ద్వారా ఇంద్రియ నిగ్రహం లభిస్తుంది. శివారాధనకు శ్రేష్ఠమైన పూలలో గన్నేరు, జిల్లేడు, మందారం, అవిశ, ఉమ్మెత్త, తుమ్మి, తెల్లకలువ, నల్లకలువ మొదలైనవి ప్రముఖమైనవని శివతత్త్వసార సంగ్రహంపేర్కొంది.

పార్ధివలింగం

కృతయుగంలో రత్నలింగం, త్రేతాయుగంలో బంగారు లింగం, ద్వాపరంలో రసలింగం, కలియుగంలో పార్ధివ లింగం (మట్టిలింగం) అభిషేకించాలి. పార్ధివలింగం అఖండంగా ఉండాలి. రెండుభాగాలుగా చేయకూడదు. మంత్రాలన్నింటిలో ఓంకారం ఎంత శ్రేష్ఠమో లింగాలలో పార్ధివ లింగం అంత గొప్పదనీ, సర్వదా అదే పూజనీయ మైనదని చెబుతారు



విజ్ఞులు. పార్ధివ లింగారాధన పుణ్యం, ఆయువు, ఐశ్వర్యం, తుష్టి, పుష్టి ఇస్తుంది. శివ సాయుజ్యం ప్రసాదిస్తుంది. శివరాత్రి నాడు ఒక పార్ధివ లింగాన్ని తయారుచేసుకుని పూజిస్తే పాపాలు హరిస్తాయి. రెండులింగాలను అర్చిస్తే కార్యసిద్ధి కలుగుతుంది. మూడు లింగాలను అర్చిస్తే కోరికలన్నీ తీరతాయని లింగపురాణంలో ఉంది. లక్షలింగార్చన చేసే భక్తుడు సాటిలేని సంపద పొందుతాడు. యశోవంతుడవుతాడు. లింగ, కుల, వర్గ వివక్ష లేకుండా సర్వులూ లింగార్చనకు అర్హులే.

అభిషేకమే యోగం

కుండలినీ శక్తి మూలాధారం నుండి అన్ని చక్రాలను స్ప ృశిస్తూ స్వాధిష్ఠానంలో ఉన్న అగ్నిని సహస్రారానికి వేధిస్తుంది. అప్పుడు కుండలినిలోనికి అమృతధార ప్రవహిస్తుంది.



శరీరంలోని72వేల నాడులకు తృప్తి కలుగుతుంది. అలాంటి అమృతవర్షంతో శరీరాన్ని తడుపుకోవడమే అభిషేకం అని యోగశాస్త్రం చెబుతోంది.భక్తితో శివార్పణంఅంటూ సమర్పించే కొంచెం ద్రవ్యమైనాఅది మేరుపర్వతమంత ఫలాన్నిస్తుంది. గంధం, భస్మం, రుద్రాక్ష, బియ్యం, పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కర, కొబ్బరినీరు ఇలా అభిషేకద్రవ్యాలు ఎన్నోరకాలు.

శ్రీగంధార్చన

సువాసన కలిగిన చక్కని శ్రీగంధపునీటితో ఈశ్వరుణ్ణి అభిషేకిస్తే పుత్రప్రాప్తి కలుగుతుంది. సహస్రార కమలంలో చిత్కళ ఉన్నది. దాన్ని కాంతి చైతన్యరూపంలో శరీరమంతా వ్యాపించి ఉన్నదని తెలుసుకుని నేను సర్వదా పవిత్రుడనని భావించడమే గంధాభిషేకంలోని అంతరార్థం. ఎనిమిది రకాలైన గంధాలను కలిపి అష్టగంధమని అంటారు. వట్టివేళ్లు, కుంకుమపువ్వు, జటామాంసీ, గంధపుపొడి, తక్కోలాలు, అగరుచెక్క, పచ్చకర్పూరం, భూరసపుగడ్డ. ఈ ఎనిమిదింటిని కలిపి అటువంటి అష్టగంధంతో అభిషేకాన్ని చేసినవారికి అష్టైశ్వర్యాలులభిస్తాయి.అభిషేకానికి వాడవలసిన ద్రవ్యాలగురించి రుద్రకామ్యార్చనావిధి అనే గ్రంథం చక్కగా వివరించింది.

ఏకబిల్వం శివార్పణం

బిల్వనిలయాఅని లక్ష్మీదేవిని కీర్తిస్తారు. అంటే మారేడువృక్షంలో శ్రీలక్ష్మీదేవి కొలువుంటుందని భావం. శివారాధనలో తప్పనిసరిగా వినియోగించ వలసిన వస్తువేదైనా ఉన్నదంటే అది మారేడు దళమే..! శివునికి అత్యంత ప్రియమైన మారేడు దళాలను అభిషేకంలో వినియోగిస్తే ధనలాభం కలుగుతుంది.

తెల్లని అక్షింతలు

శివుడు శుద్ధమైన స్పటికంలా నిర్మలంగా ఉంటాడు. స్వచ్ఛమైనవాడు. అటువంటి స్వచ్ఛతకు నిదర్శనం తెలుపు. అందుకే తెలుపంటే ఆయనకిష్టం. ''స్వచ్ఛమైన మనస్సుతో నేను సమర్పించే ఈ అక్షతాభిషేకాన్ని స్వీకరించవయా'' అన్న భావన ముక్తిని కలిగిస్తుంది. అందుకే తెల్ల అక్షతలను శివాభిషేకంలో వినియోగిస్తారు.

భస్మాభిషేకం



పాపరాశులను భస్మంచేసేవాడు శివుడు. ఆయన భస్మభూషితుడు. అంటే అన్నిసమయాలోనూ భస్మాన్ని ధరించి ఉంటాడు. అటువంటి సదాశివుణ్ణి భస్మంతో అభిషేకించడమంటే భూమండలం మీదున్న వివిధరకాలైన పూలతో, పత్రాలతో ఈశ్వరార్చన చేస్తే ఎంతపుణ్యమో అంతకు కోటిరెట్లు ఫలితాన్ని సంపాదించడమే!

కాస్త చలికాచుకో స్వామీ!

ఒక భక్తుడు తన మనోవేదనను శివుడితో ఇలా విన్నవించుకుంటున్నాడు. ''శంకరా! నీకు అభిషేకమంటే ఇష్టమని ఎప్పుడూ అభిషేకపాత్రతో నీళ్లధారగా పోస్తుంటారు. శీతాకాలం ఉదయం వేళలో చలి మరీ ఎక్కువగా ఉంటుంది. పైగా చల్లగాఉండే మంచిగంధం పూస్తారు. చేతులకేమో చల్లని పాము. నీ సిగలో చంద్రుడు, గంగాదేవి. వీరిద్దరితో ఇంకాచలి. ఎక్కడో ఉన్న హిమాలయాల పేరువింటేనే చలికివణుకు పుడుతుంది. అటువంటి హిమవంతుని కుమార్తె పార్వతి నీపక్కన. పైగా....ఆమె దయార్ద్ర హృదయ. ఆ తల్లి హృదయం ఎల్లప్పుడూ దయారసంతో తడిసి ఉంటుంది.ఓ శివా! ఎలా భరిస్తున్నావయ్యా! ఈ చల్లదనాలన్నింటినీ. నా వద్దకు రావయ్యా! ఆ చల్లదనాలన్నీ పోగొట్టే వేడి నాహృదయంలో ఉంది. కామం, క్రోధం మొదలైనవాటితో అది ఎప్పుడూ వేడెక్కి ఉంటుంది. అటువంటి నాహృదయంలో నీవు నివాసముండి నా హృదయాన్ని చల్లబరచు. నువ్వు కాస్త చలికాగు'' అంటాడు. భగవంతుడిపై ప్రేమ, పరమాత్మను హృదయంలో నిలుపుకునే భావన కలగడమే అదృష్టం.

రుద్రాక్షాభిషేకం

రుద్రుడి అక్షమునుండి అంటే కన్నునుండి ఉద్భవించినవే ఈరుద్రాక్షలు. అటువంటి రుద్రాక్షలతో రుద్రమంత్రాన్ని చెబుతూ రుద్రుణ్ణి ఎవరు అభిషేకిస్తారో వారికి పునర్జన్మ ఉండదు.

పంచామృతాభిషేకం

యోగజాగమంఅనేగ్రంథంలో పంచామృతాభిషేక ఫలితాన్ని గురించి వివరించారు. శుద్ధమైన జలాభిషేకం చేస్తే పదిఅపరాధాలు తొలగిపోతాయి. పాలతో శివుణ్ణి అభిషేకిస్తేవందదోషాలు, పెరుగుతో వెయ్యి దోషాలు తొలుగుతాయని ఆ గ్రంథాలుతెలుపుతోంది. ఉత్తమమైన శివాభిషేక ద్రవ్యాలుగా ఆ గ్రంథం పేర్కొన్నవాటిలో ఆరోహణ క్రమంలో నెయ్యి,తేనె,పంచదార, చెరుకు రసం,మామిడిపండ్లరసం, కొబ్బరినీళ్లను వరసగా చెప్పింది. పన్నీరుతో శివుణ్ణి అభిషేకించినవారి పాపపు రాశులన్నీ దగ్ధమవుతాయి. కొబ్బరినీళ్లతో సర్వసంపదల వృద్ధి, దూర్వాస్నానంతో నష్టద్రవ్యప్రాప్తి, నువ్వులనూనెతో అభిషేకిస్తే అపమృత్యు పరిహారం, సువర్ణపూరితజలంతో దరిద్రనాశనం, కస్తూరి జలంతో పదవీయోగం, పసుపునీటితో సౌభాగ్యాభివృద్ధి, నవరత్న జలాలతో ధాన్యప్రాప్తి, అన్నాభిషేకంతో రాజ్యప్రాప్తి లభిస్తాయి.ఇక ద్రాక్షపండ్లరసంతో రుద్రాభిషేకాన్ని చేసినవారికి సకలకార్య విజయం, ఖర్జూరఫలరసంతో శత్రునాశనం, నేరేడు పండ్లరసంతో వైరాగ్యం, మామిడిపండ్లతో దీర్ఘకాల వ్యాధులు నశిస్తాయి. ఈవిధంగా వివిధద్రవ్యాలతో అభిషేకించడంద్వారా భిన్నమైన ఫలితాలను పొందవచ్చు.


– అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని

నారద భక్తిసూత్రాలు – 13

భక్తిరేవ గరీయసి

78– 79సూత్రాలు

అహింసా సత్యశౌచ దయాస్తిక్యాది చారిత్ర్యాణి పరిపాలనీయాని సర్వదా సర్వభావేన నిశ్చింతతై ర్భగవానేన భజనీయః



భక్తుడైనవాడు అహింస, సత్యము, శౌచము, దయ, ఆస్తికవాదము మొదలైన సదాచారాలను చక్కగా పాటించాలి. అన్నివేళల్లోనూ, అన్ని భావాల్లోనూ భగవంతుణ్ణే దర్శిస్తూ స్మరిస్తూ ఉండాలి. అహింస గొప్పదనాన్ని గురించి భారతీయ ధర్మం యుగయుగాలుగా ఘోషిస్తోంది. సత్యవాక్పాలన వల్ల అసాధ్యాలు సుసాధ్యాలవుతాయని నిరూపించిన మహనీయులెందరో ఉన్నారు. శౌచమంటే పరిశుభ్రతను పాటించడం. స్వచ్ఛత మనసులోనూ, బయట కూడా పాటించాలి. దయలేని హృదయంలో దైవం ఉండదు. బలమైన నమ్మకమే ఆస్తికత్వం అవుతుంది. అనుమానాలను విడిచిపెట్టాలి. శోధించి సత్యాన్ని ఆవిష్కరించుకోవాలి. సాధ్యం కాని పరిస్థితుల్లో పెద్దలు చూపిన మార్గంలో నడవడానికి సంకోచ పడకూడదు. దైవం అనుకూలిస్తుందా లేదా అనే అపనమ్మకం భక్తికి పెద్ద విఘాతమవుతుంది. ఏ పనిచేస్తున్నా, ఏ భావనలో అయినా దైవాన్నే దర్శించాలి. వెతికితే దైవం కనిపించని తావు లేదు. మన కీర్తన వినడం తప్ప దైవానికి ఇష్టమైన సంగతి మరొకటి లేదు. అందుకే నిశ్చింతగా భగవానుణ్ణే భజించాలి.

80–81 సూత్రాలు

స కీర్త్యమానః శీఘ్రమేవావిర్భవతి అనుభావయతి చ భక్తాన్ త్రిసత్యస్య భక్తిరేవ గరీయసీ భక్తిరేవ గరీయసీ

ప్రేమపూర్వకంగా కీర్తిస్తే భగవానుడు శీఘ్రంగా ఆవిర్భవిస్తాడు. తన ఉనికిని భక్తులకు తెలియచేస్తాడు. కోరిన విధంగా భక్తులకు దర్శనమిస్తాడు. మనోవాక్కాయ కర్మల చేత భక్తిని కలిగి ఉండడం గొప్ప విషయం. మూడుకాలాల్లో, మూడు సత్యాల్లో భక్తి కలిగి ఉండడమే గొప్పది. మానవుల్ని తరింపచేసే మార్గం అదొక్కటే.

– ముకుందప్రియ

మహామస్తకాభిషేకం




మనదేశానికి భారతదేశం అనే పేరు రావడానికి కారణమైన చక్రవర్తి భరతుడు. అతడికి స్వయాన అన్న, భరతుని కంటే ముందుగా రాజ్యపాలన చేసినవాడు గోమతేశ్వర బాహుబలి. కర్ణాటక హసన్ జిల్లాలోని శ్రావణ బెళగొళలో గోమతేశ్వర బాహుబలిని మతాలకు అతీతంగా భారతీయులందరూ దర్శించుకుంటారు. 57 అడుగుల ఎత్తుతో వెయ్యేళ్లకు పూర్వమే శిల్పించిన మహావిగ్రహం గోమతేశ్వరునిది. శ్రావణబెళగొళతో పాటు కార్కళ, వేణూరు, ధర్మస్థల, గొమ్మటగిరి వంటిచోట్ల కూడా బాహుబలి విగ్రహాలు ఉన్నాయి. వాటిలో శ్రావణబెళగొళ విగ్రహమే పెద్దది. పన్నెండేళ్లకు ఒకసారి అక్కడ మహామస్తకాభిషేకం జరుగుతుంది. 1008 సుగంధపరిమళ ద్రవ్యాలతో మహామస్తకాభిషేకం కనులపండువగా జరుగుతుంది. దీనిని తిలకించేందుకు దేశవిదేశాల నుంచి లక్షలాదిగా తరలివస్తారు. కర్ణాటక ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవం శనివారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈనెల 25న ముగుస్తాయి. మళ్లీ 2030లో ఈ మహావేడుక జరుగుతుంది.

బెంగళూరు నుంచి 144 కిలోమీటర్ల దూరం.

ధర్మసందేహాలు

శివాలయంలో సోమసూత్రం దాటవద్దంటున్నారు. అక్కడినుంచి వెనక్కు వెళ్లిపోమంటున్నారు. ఎక్కడిదీ సంప్రదాయం?

– బి. శ్రీరామ్, మెదక్



సంప్రదాయం లేనివారికి, చండీశ్వర దీక్షలేనివారికి ఇది వర్తించదు. సోమసూత్రం అనేది శివలింగం నుంచి అభిషేక జలం ప్రవహించే ఏర్పాటు.సోమసూత్రానికి చివర చండికేశ్వరుడు ఉంటాడు. గర్భాలయానికి బయటిదాకా సోమసూత్రాన్ని నిర్మించని గుడిలో గర్భాలయంలోనే చండికేశ్వరుడు ఉంటాడు. సోమసూత్రం పరిధి అంతవరకే. చండీప్రదక్షిణలు చేసేవారు అక్కడివరకు వచ్చి చప్పట్లు కొట్టి చండీశ్వరుని ఆరాధిస్తారు. అక్కడినుంచి ధ్వజస్తంభం వద్దకు వెనక్కు వెళ్లి తిరిగి ప్రదక్షిణ కొనసాగిస్తారు. ఈ రకమైన ప్రదక్షిణ చేయడానికి తప్పనిసరిగా గురూపదేశం కావాలి. ప్రదక్షిణ మార్గంలో మిగిలిన భక్తులందరూ సోమసూత్రం వద్ద అభిషేక జలాన్ని శిరస్సుపై చల్లుకుని ముందుకు సాగిపోతుంటారు. శివాలయంలో ప్రదక్షిణలు ధ్వజస్తంభం నుంచి ధ్వజస్తంభం వరకూ లేదా నందినుంచి నందివరకూ చేయాలి. మూడు, ఆరు, తొమ్మిది, పన్నెండు ఇలా ప్రదక్షిణల సంఖ్య నిర్ణయించుకోవాలి. ప్రదక్షిణ తర్వాత శివదర్శనం చేసుకోవాలి. ఏకారణం చేతనైనా శివదర్శనం చేసుకోలేకపోతే ఆలయ శిఖరం దర్శించుకోవాలి. శివరాత్రినాడు ప్రదక్షిణలు చేయడానికి రాత్రి సమయం శ్రేష్ఠం. ఆరోజున చేసే ఒక ప్రదక్షిణ మిగిలిన సమయాల్లో చేసే వేయి ప్రదక్షిణలకు సమానం అని శివపురాణం స్పష్టం చేస్తోంది.

సమాధానం : డా. కాకునూరి సూర్యనారాయణమూర్తి

శ్రీరామకృష్ణ బోధామృతం

(ఈ ఆదివారం రామకృష్ణ పరమహంస జయంతి)



తల్లి గర్భంలో యోగావస్థలో ఉన్నాను. భూమ్మీద పడగానే మట్టి తిన్నాను. మంత్రసాని బొడ్డు తెంచింది. మాయావరణంలో చిక్కుపడ్డాను. దీన్ని తెంచడం ఎలా? అనేది ప్రతి ఒక్కరి ప్రశ్న. కామినీ కాంచనాలే మాయ. మనస్సులో నుంచి ఆ రెండింటినీ తొలగిస్తేనే యోగం సిద్ధిస్తుంది. పరమాత్మ అయస్కాంతం. జీవాత్మ సూది. పరమాత్మ అయిన అయస్కాంతం మనిషి అనే సూదిని ఆకర్షించాలంటే ఆత్మకు మట్టి అంటుకుని ఉండకూడదు. భగవంతుని కోసం వ్యాకుల చిత్తంతో విలపించాలి. ఆ కన్నీరు ఆత్మ అనే సూదిని ఆవరించిన మట్టిని తొలగిస్తుంది. పరిశుద్ధం అయ్యాక సూదిని, అయస్కాంతం ఆకర్షిస్తుంది. యోగం సిద్ధిస్తుంది. భగవంతుడు అందరిలోనూ విరాజిల్లుతున్నాడు. కొన్నిచోట్ల ఆయన ప్రకాశం అధికంగానూ, మరికొన్నిచోట్ల తక్కువగానూ అనిపిస్తుంది. కానీ అందరిలోనూ మేలిమి బంగారం ఉంది. లౌకికులలో ఆ ప్రకాశం మట్టితో కప్పబడి ఉంటుంది. లౌకికజీవితంలో ఉండే జ్ఞాని మట్టిముద్దలా కనిపిస్తూ ప్రచ్ఛన్నంగా కనిపిస్తాడు. అటువంటి వారి అంతరంగాన్ని అన్వేషించి తెలుసుకుంటే చక్కటి గురువు తప్పక లభిస్తాడు – అని శ్రీరామకృష్ణ పరమహంస గురుదేవులు బోధించారు.

ఆధునిక విద్యాగంధం అంటకుండా అతి సామాన్యమైన, నిరాడంబరమైన జీవితాన్ని గడుపిన వాడాయన. 'భగవంతుణ్ణి నేను చూస్తున్నాను' అని వివేకానందుడికి సందేహ నివృత్తి చేయగలిగిన దివ్య పురుషుడాయన. 1836లో కలకత్తా సమీపగ్రామంలో జన్మించిన ఆయన అసలు పేరు గదాధరుడు. అనంతర కాలంలో శ్రీరామకృష్ణుడిగా, పరమహంసగా భారత జాతికి మార్గ నిర్దేశనం చేసిన మహాత్ముడు.

'ఆనందాత్మను నేను' అని భావించే వారు పరమ హంసలు. నీటిని వదలి స్వచ్ఛమైన పాలను స్వీకరించే శక్తి హంసకుంది. మానస సరోవరంలో విహరించే పక్షి హంస. యతీశ్వరులను పరమహంసలుగా భావిస్తారు. మన ప్రాచీన రుషుల్లో అరుణి, శ్వేతకేతువు, సంవర్తకుడు, దుర్వాసుడు, రుభువు, నిదాఘుడు, దత్తాత్రేయుడు, రైవతకుడి వంటి వారు పరమ హంసలు. వేదాంత సారమైన 'సోహం' అనే మాటకు అర్థం 'పరమాత్మను నేను'. ప్రతి మనిషీ దీన్నే అప్రయత్నంగా 'హంస' అని పలకనారంభించారు. ఇదే తర్వాత రానురానూ 'హంస' మంత్రమైందని బ్రహ్మ వైవర్త పురాణం చెబుతోంది. హిందువుల ఆధ్యాత్మిక భావ ఐక్యతకు శ్రీరామకృష్ణులు దివ్యమైన, సుగమమైన మార్గాన్ని నిర్దేశించి ఆ అనుభూతిని అనుభవంలోకి తెచ్చుకోగలిగే పద్ధతిని బోధించారు.

నిర్వికల్ప సమాధి స్థితిలో మాయ, భగవంతుడు రెండింటికీ మధ్య ఉన్న అభేద స్థితిని రామకృష్ణులు స్తుతించారు. శిష్యులకు ఓ స్నేహితుడిగా, అన్నగా ఆధ్యాత్మిక విషయాలను చిన్న చిన్న కథలుగా హాస్యరసస్ఫోరకంగా వినిపించేవారు. బెంగాలీ భక్త కవుల కీర్తనలను మధురంగా గానం చేసేవారు. జ్ఞానమార్గంలో భక్తి కలిగి ఉంటే వైరాగ్యం సిద్ధిస్తుందని–జాతి, కుల, వర్గ, మత విచక్షణ విడిచి సాటి మానవుల పట్ల ప్రేమ చూపిస్తే చాలనేవారు. గృహస్థుడివైనా బాహ్య పరిత్యాగంతో నిమిత్తం లేకుండా మానసిక పరిత్యాగ భావాన్ని క్రమంగా పెంపొందించుకోవాలనేవారు. అందరికీ పరంధామమే పరమ గమ్యమని గుర్తెరగాలని ప్రబోధించారు.

– డా. కె. పూర్ణప్రజ్ఞాభారతి

మీరూ రాయండి!

మందిరం పేజీపై మీ అభిప్రాయాలను, రచనలను, ధర్మసందేహాలను manammandiram@gmail.comకు పంపండి. మారేడుదళం శీర్షికలో సమీక్ష కోసం మీ ఆధ్యాత్మిక ప్రచురణలను పంపవలసిన మా చిరునామా : మందిరం పేజీ, మనం దినపత్రిక, 5-3-864/4/బి, ఎస్.బి.ఎన్. ఆర్కేడ్, ఫోర్త్ అండ్ ఫిఫ్త్ ఫ్లోర్, గ్రీన్ ల్యాండ్స్, గ్రీన్ పార్క్ హోటల్ ఎదురుగా, హైదరాబాద్ - 500016

మనం స్పోర్ట్స్
మంగళవారం 13 ఫిబ్రవరి 2018
www.manamnews.com

నాలుగో వన్డేలో ఓటమిపాలైన కోహ్లీ సేన మరోసారి సౌతాఫ్రికా తిరగబడకముందే ఆతిథ్య జట్టును చితగ్గొట్టి వన్డే సిరీస్‌ను కైవసం చేసుకోవాలని కృత నిశ్చయంతో ఉంది. ఇండియా, సౌతాఫ్రికా మధ్య మంగళవారమిక్కడ ఐదో వన్డే జరగనుంది. తొలిసారి సౌతాఫ్రికా గడ్డపై వన్డే సిరీస్‌ను గెలిచేందుకు టీమిండియాకు మరో రెండు మ్యాచ్‌ల అవకాశముంది. డర్బన్‌లో జరిగిన మూడో వన్డేలో ఆరు వికెట్లతో గెలిచిన టీమిండియా 3-0 ఆధిక్యంతో నిలిచింది. సెంచూరియన్‌లో జరిగిన రెండో వన్డేలో 9 వికెట్లతో, కేప్‌టౌన్‌లో జరిగిన తొలి వన్డేలో 124 పరుగులతో కోహ్లీ సేన గెలిచిన సంగతి తెలిసిందే.



కోహ్లీ సేన... చరిత్ర తిరగరాస్తుందా?

- నేడు ఇండియా, సౌతాఫ్రికా మధ్య ఐదో వన్డే
- సాయంత్రం 4-30 నుంచి సోనీ టెన్-1లో ప్రత్యక్ష ప్రసారం



పోర్ట్‌ఎలిజబెత్: అయితే జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన పింక్ (ఐదో) వన్డేలో ఫ్లడ్ లైట్లు, వర్షం అంతరాయాలు, డేవిడ్ మిల్లర్, హీన్రిచ్ క్లాసెన్ మెరుపు ఇన్నింగ్స్ కారణంగా సౌతాఫ్రికా జట్టు 5 వికెట్లతో గెలిచింది. ఈ సిరీస్‌లో ఇప్పటికీ భారత మణికట్టు స్పిన్నర్లు, సౌతాఫ్రికా బ్యాటింగ్ లైనప్ మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. జొహన్నెస్‌బర్గ్‌లో రెండుసార్లు వర్షం అంతరాయం కలగడంతో కోహ్లీ సేన బ్యాటింగ్, బౌలింగ్ జోరుకు బ్రేక్ పడింది. అంతేకాకుండా వర్షం అంతరాయం వల్ల డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ప్రొటీస్‌కు ఛేదించగల లక్ష్యం లభించింది. ఏబీ డివిలియర్స్‌ను తక్కువ పరుగులకే పెవిలియన్‌కు పంపినప్పటికీ ఆతిథ్య బ్యాట్స్‌మన్ ఎటువంటి ఇబ్బంది లేకుండా లక్ష్యాన్ని చేరుకున్నారు. రెండో ఇన్నింగ్స్‌ను సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్ టీ20 తరహాలో ఆడారు. ఈ మ్యాచ్‌లో మణికట్టు స్పిన్నర్లు ప్రభావం చూపలేకపోయారు. మరోవైపు క్యాచ్ చేజార్చడం, మిల్లర్ అవుటైన బాల్ నోబాల్ కావడం టీమిండియాను గెలిపించలేకపోయాయి. అంతేకాదు వరుణుడు ఆటంకం కలిగించిన ఈ మ్యాచ్‌లో మణికట్టు స్పిన్నర్లను ఎదుర్కోవడమెలాగో సౌతాఫ్రికా బ్యాట్స్‌మెన్ నేర్చుకున్నారు. అదనంగా భువనేశ్వర్ కుమార్, జస్‌ప్రీత్ బుమ్రా ప్రభావం చూపకపోవడంతో స్పిన్నర్లపైనే కెప్టెన్ ఎక్కువగా ఆధారపడాల్సి వచ్చింది.

ఈ నేపథ్యంలో ఐదో వన్డేకు తుది జట్టు ఎంపికపై టీమ్ మేనేజ్‌మెంట్ ప్రధానంగా దృష్టి పెట్టింది. కేదార్ జాదవ్ ఫిట్‌నెస్‌పై ఇప్పటికీ అనుమానాలు తలెత్తుతున్నాయి. కేప్‌టౌన్ వన్డేలో స్నాయువు కండరాల గాయానికి గురైన జాదవ్ నాలుగో వన్డేకు దూరమయ్యాడు. జాదవ్ స్లో స్పిన్ బౌలింగ్ చేస్తాడు. మణికట్టు స్పిన్నర్లు యజ్వేంద్ర చాహల్, కుల్‌దీప్ యాదవ్‌లకు అండగా నిలుస్తాడు. ఒకవేళ ఈ మ్యాచ్ కూడా యాదవ్ అందుబాటులో లేకపోతే ఇద్దరు స్పిన్నర్లు మినహా భారత్‌కు మరో అవకాశం లేదు. రోహిత్ శర్మ చివరిసారిగా 2016 జనవరిలో పెర్త్‌లో జరిగిన వన్డేలో బౌలింగ్ చేశాడు. శ్రేయాస్ అయ్యర్ లెగ్ బ్రేక్ ప్రాక్టీస్ చేస్తున్నట్టుగా తెలుస్తోంది. శ్రీలంకతో తన అరంగేట్ర సిరీస్‌లో అయ్యర్ ఒక్క ఓవర్ వేశాడు. జాదవ్ వంటి నమ్మదగిన ఆప్షన్ మరొకటి లేదు. చివరికి కోహ్లీ కూడా బౌలింగ్ చేసేందుకు సిద్ధపడొచ్చు. కానీ అతను స్లో మీడియం పేస్ వేస్తాడు. జాదవ్ బౌలింగ్ కంటే బ్యాటింగ్ సామర్థ్యమే మిడిలార్డర్‌లో కలవరపెడుతోంది. దీన్నిబట్టి చూస్తే టీమిండియా ఇంకా సమతుల్యంగా లేదని అర్థమవుతోంది.



ఏబీ డివిలియర్స్

తొలి వన్డేలో నాలుగో నంబర్ స్థానంలో బరిలోకి దిగిన అజింక్య రహానే 79 పరుగులు చేశాడు. తర్వాతి రెండు వన్డేల్లో 11, 8 పరుగులు మాత్రమే సాధించాడు. ఇక హార్దిక్ పాండ్యా తొలి టెస్టులో మాత్రమే దూకుడును ప్రదర్శించాడు. మూడు, నాలుగు వన్డేల్లో 14, 9 పరుగులు మాత్రమే చేయగలిగాడు. మిడిలార్డర్‌లో ఎంఎస్ ధోనీ (43 బంతుల్లో 42 నాటౌట్) మాత్రమే కాస్త ధైర్యాన్నిస్తున్నాడు. రోహిత్ శర్మ వరుసగా విఫలమవుతున్నప్పటికీ టీమిండియాకు బలమైన బ్యాటింగ్ ఆర్డర్ ఉంది. రోహిత్ నాలుగు వన్డేల్లో 40 పరుగులు చేశాడు. సౌతాఫ్రికా గడ్డపై వన్డేల్లో రోహిత్ బ్యాటింగ్ సగటు 12 నుంచి 11.45కు పడిపోయింది. జట్టులో కోహ్లీ (393 పరుగులు), శిఖర్ ధావన్ (271 పరుగులు) మాత్రమే జట్టుకు కావాల్సిన పరుగులను అందిస్తున్నారు. మిగతా బ్యాట్స్‌మెన్ (239 పరుగులు) విఫలం కావడం జట్టును ప్రధానంగా కలవరపెడుతున్న అంశం. దీంతో కోహ్లీ, ధావన్‌లను త్వరగా అవుట్ చేస్తే మ్యాచ్ గెలవొచ్చని సౌతాఫ్రికా భావిస్తోంది. మరి ఐదో వన్డేకు సౌతాఫ్రికా ఎటువంటి బౌలింగ్ కాంబినేషన్‌ను రూపొందిస్తుందో చూడాలి. మరోవైపు వాండరర్స్‌లో జరిగిన మ్యాచ్‌కు ఫుల్‌టైమ్ స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్‌ను పక్కన పెట్టి జేపీ డుమినీ పైనే పూర్తిగా ఆధారపడింది.

సెయింట్ జార్జ్ పార్క్ పిచ్ స్పిన్నర్లకు సహకరిస్తుందని చరిత్ర చెబుతోంది. ఇక్కడ ఆడిన చివరి రెండు వన్డేల్లో ప్రొటీస్ స్పిన్నర్లు ఆధిపత్యం ప్రదర్శించారు. గతేడాది శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో తాహిర్ 26 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. 2016 అక్టోబర్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో టర్బైజ్ షమ్సీ 36 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. కాగా రెండో స్పిన్నర్ ఆరోన్ ఫంగిసో 17 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. ఈ మైదానంలో ఆడిన 32 మ్యాచ్‌లకు గాను సౌతాఫ్రికా 11 వన్డేల్లో ఓటమిపాలైంది. అందులోని ఆరు వన్డేలు గత దశాబ్ద కాలంలో జరిగినవే. అయితే ప్రతి సమ్మర్‌లో ఇక్కడ కనీసం ఒక వన్డే జరుగుతుంది. ఈ మైదానంలో టీమిండియాకు గొప్ప రికార్డేమీ లేదు. 1992 నంచి ఇప్పటి వరకు టీమిండియా 5 వన్డేల్లో ఓటమిపాలైంది. అందులో నాలుగు ఓటములు సౌతాఫ్రికా చేతిలో రుచిచూసినవే. 2001-02లో సౌతాఫ్రికాకు వచ్చిన టీమిండియా ముక్కోణపు సిరీస్‌లో కెన్యా చేతిలో ఓటమిపాలైంది. పోర్ట్‌ఎలిజబెత్‌లో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో టీమిండియా ఒక్కసారి కూడా 200 పరుగులు చేయలేదు. 2001లో సౌతాఫ్రికాపై 176 పరుగులే ఇప్పటి వరకు టీమిండియాకు అత్యధిక స్కోరు. మరోసారి ఈ పిచ్‌పై పోరాడేందుకు, గత రికార్డులను తుడిచివేసేందుకు టీమిండియా సిద్ధమైంది. ఐదో వన్డేలో టీమిండియా గెలిస్తే పాత రికార్డును సరిచేయడమే కాకుండా సిరీస్‌ను కైవసం చేసుకుని కొత్త రికార్డును సృష్టిస్తుంది.

కోహ్లీపైనే ఆధారపడటం మంచిది కాదు

ఇండియా, సౌతాఫ్రికా మధ్య వన్డే సిరీస్ కాస్తా విరాట్ కోహ్లీ, ఆతిథ్య జట్టుగా మారిందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఢిల్లీ సహచరుడు శిఖర్ ధావన్ మినహా మిగతావాళ్లెవ్వరూ జట్టుకు అండగా నిలవడం లేదు. గడిచిన నాలుగు వన్డేల్లో కోహ్లీ ఒక్కడే రెండు సెంచరీలు, 75, 46 నాటౌట్ పరుగులు చేశాడు. ఇక ధావన్ రెండు అర్ధ సెంచరీలు, జొహన్నెస్‌బర్గ్‌లో సెంచరీ సాధించాడు. 35, 51 నాటౌట్, 76, 109 పరుగులతో జట్టుకు తనవంతు సహకారం అందించాడు. వాండరర్స్‌లోనూ ధావన్ దూకుడుగా ఆడి టీమిండియా ఇన్నింగ్స్‌లో శక్తిని నింపాడు. అజింక్య రహానే తొలి వన్డేలో 79 పరుగులు చేశాడు. తర్వాతి మ్యాచ్‌ల్లో టీమిండియా పటిష్ఠ స్థితిలో ఉన్నప్పటికీ, బ్యాటింగ్ చేసేందుకు చాలా ఓవర్లు లభించినప్పటికీ అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయాడు. బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోషన్ లభించినా హార్దిక్ పాండ్యా ఆకట్టుకోలేకపోయాడు. అయితే ఒక్క మ్యాచ్ ఆడిన శ్రేయాస్ అయ్యర్ సామర్థ్యాన్ని అప్పుడే అంచనా వేయడం తొందరపాటే అవుతుంది. ధోనీ కూడా రెండు మూడు ఇన్నింగ్స్‌ల్లో నాటౌట్‌గా నిలిచాడు. సచిన్‌ను అవుట్ చేస్తే టీమిండియా పనైపోయిందని 90 దశకంలో ప్రత్యర్థి జట్లు అనుకునేవి. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. వరల్డ్ కప్‌కు మరో 16 నెలలు మాత్రమే ఉన్న సమయంలో ఇటువంటి పరిస్థితి నెలకొనడం టీమిండియాకు ప్రమాదమే. సహచరులు కూడా అండగా నిలిస్తే.. టీమిండియా కెప్టెన్ ఏదైనా చేయగల సమర్థుడు.



ఇక టీ20 సిరీస్‌పై దృష్టి

నేడు ఇండియా, సౌతాఫ్రికా మహిళల తొలి మ్యాచ్

కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్

పొచెఫ్‌స్ట్రూమ్: వన్డే సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత క్రికెట్ మహిళల జట్టు ఇక టీ20 సిరీస్‌పై దృష్టి పెట్టింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఇండియా, సౌతాఫ్రికా మహిళల జట్ల మధ్య తొలి టీ20 మంగళవారమిక్కడ జరగనుంది. అయితే టీ20 సిరీస్‌కు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను మిథాలీ రాజ్ నేతృత్వంలోని జట్టు 2-1తో కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇదే మైదానంలో జరిగిన చివరి వన్డేలో ప్రొటీస్ మహిళలు 7 వికెట్లతో గెలిచి భారత జట్టు వైట్‌వాష్‌ను అడ్డుకున్నారు. ఈ టీ20 సిరీస్‌లో బ్యాట్స్‌వుమన్ స్మృతి మంధన వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది. నిజానికి మూడో వన్డేలో ఓటమి భారత జట్టుపై ప్రభావం చూపలేదు. ఎందుకంటే అప్పటికే సిరీస్ భారత్ వశమైంది. అయితే ఓటమి నిరాశను పక్కన పెట్టి టీ20 సిరీస్‌పై భారత జట్టు తాజా దృష్టి సారించింది. టీ20 స్పెషలిస్ట్ అనుషా పాటిల్, ఆరంగేట్ర ఆల్ రౌండర్ రాధా యాదవ్, వికెట్ కీపర్ నుర్జూట్ పర్వీన్ జట్టులో ఉండడంతో భారత్ మరింత బలోపేతమైంది. అంతేకాకుండా ముంబైకి చెందిన 17 ఏళ్ల విధ్వంసకర బ్యాట్స్‌వుమన్ జెమీమా రొడ్రిగ్వెస్ కూడా జట్టులో ఉంది. ఈమె అండర్-19 మ్యాచ్‌లో 163 బంతుల్లో 202 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించింది.

ఇండియా: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధన (వైస్ కెప్టెన్), మిథాలీ రాజ్, వేద కృష్ణమూర్తి, జెమీమా రోడ్రిగ్వెస్, దీప్తి శర్మ, అనుజ పాటిల్, తన్మయ్ భాటియా, నుర్జూట్ పర్వీన్, పూనమ్ యాదవ్, రాజేశ్వరీ గైక్వాడ్, ఝులన్ గోస్వామి, శిఖా పాండే, పూజ వస్త్రాకర్, రాధా యాదవ్.

సౌతాఫ్రికా: డేన్ వాన్ నీకెర్క్ (కెప్టెన్), మారిజాన్నే కాప్, త్రిషా చెట్టి, షబ్నిమ్ ఇస్మాయిల్, అయాబోంగా ఖకా, మసబట క్లాస్, సన్ లూస్, ఒడైన్ క్రిస్టెన్, మిగ్నాన్ డు ప్రీజ్, లిజెల్లె లీ, చోలె ట్రియాన్, నదినె డి క్లెర్క్, రైసిబె నొజాఖె, మోస్‌లైన్ డేనియల్స్.



ఫిగర్ స్కేటింగ్‌లో కెనడాకు స్వర్ణం

- పెంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్


పెంగ్‌చాంగ్: పెంగ్‌చాంగ్ వింటర్ ఒలింపిక్స్‌లో కెనడాకు తొలి స్వర్ణ పతకం లభించింది. సోమవారం జరిగిన ఫిగర్ స్కేటింగ్‌లోని అన్ని విభాగాల్లో కెనడా జట్టు అద్భుత ప్రతిభ కనబరిచింది. శుక్రవారం ఈ పోటీలు ప్రారంభమైనప్పటికీ నుంచి కెనడా జట్టు అగ్రస్థానంలో కొనసాగింది. మొత్తం 73 పాయింట్లతో చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. డిఫెండింగ్ చాంపియన్ ఒలింపిక్ రష్యా అథ్లెట్లు 66 పాయింట్లో రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఇక యునైటెడ్ స్టేట్స్ జట్టు 62 పాయింట్లతో కాంస్య పతకాన్ని చేజిక్కించుకోగా.. ఇటలీ నాలుగో స్థానంలో, జపాన్ ఐదో స్థానంలో నిలిచాయి. సోచి ఒలింపిక్స్ రజత పతక విజేత ప్యాట్రిక్ చాన్ కెనడా విజయంలో కీలక పాత్ర పోషించాడు. తొలిసారి ఒలింపిక్ స్వర్ణం సొంతం చేసుకున్నాడు. పురుషుల ఫ్రీ స్కేటింగ్‌లో అతను సీజన్ ఉత్తమ 179.75 పాయింట్లు సాధించాడు.

బీసీసీఐ ఆర్‌టీఐ కిందికి రావాలి


లా కమిషన్



న్యూఢిల్లీ: ప్రైవేట్ లేదా పబ్లిక్ బాడీగా కొనసాగుతున్న భారత క్రికెట్ బోర్డు బీసీసీఐ.. సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ, రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్) కిందికి రావాలని లా కమిషన్ సిఫారసు చేసింది. ప్రపంచంలో అత్యధిక ధనికమైన బీసీసీఐ తమిళనాడు సొసైటీస్‌లో ప్రైవేట్ సంస్థగా రిజిస్ట్రేషన్ చేసుకుంది. బీసీసీఐపై తమ కమిటీ ఒక నివేదికను తయారు చేసిందని.. త్వరలోనే న్యాయ శాఖా మంత్రి రవిశంకర్ ప్రసాద్‌కు అందజేస్తామని లా కమిషన్ చైర్మన్ జస్టిస్ బీఎస్ చౌహాన్ చెప్పారు. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 12 ప్రకారం బీసీసీఐని 'ప్రైవేట్ సంస్థ'గా పరిగణించేందుకు బోర్డుకు అన్ని అర్హతలున్నాయి' అని జస్టిస్ చౌహాన్ అన్నారు. క్రికెట్ బోర్డును ప్రైవేట్ సంస్థగా పరిగణించబడడంతో రాజ్యాంగం ప్రకారం సుప్రీం కోర్టు, హై కోర్టుల పరిశీలన కిందికి వస్తుంది. పారదర్శకమైన నిర్ణయాల విషయంలో ప్రజా ప్రయోజనాల ప్రశ్నలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. భారత క్రికెట్‌లో గుత్తాధిపత్యం వహిస్తున్న బీసీసీఐ ప్రజా సంబంధమైన కార్యక్రమాలు చేస్తూ.. చాలా ఏళ్లుగా పన్ను మినహాయింపు రూపంలో ప్రభుత్వాల నుంచి ఆర్థిక సహాయం, స్థలాలు పొందుతోందని.. పబ్లిక్ బాడీగా కొనసాగుతున్నందున బీసీసీఐని ఆర్‌టీఐ చట్టం కిందికి తేవాలని లా కమిషన్ ప్యానెల్‌కు చెందిన వర్గాలు చెప్పాయి. బీసీసీఐని ఆర్‌టీఐ చట్టం కిందికి తెచ్చేందుకు చట్టంలోని తగిన ఆధారాలను పరిశీలించాలని 2016 జూలైలో సుప్రీం కోర్టు లా కమిషన్‌ను ఆదేశించింది. లా కమిషన్ సిఫారసులను కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే బీసీసీఐ ఓ పబ్లిక్ బాడీగా లేదా ఓ సంస్థగా ఆర్‌టీఐ చట్టం కిందికి వస్తుంది.



అప్పుడు ఇండియా లేదా రాష్ట్రాలు, జోన్లకు చెందిన జట్ల ఎంపికపై ఎవరైనా సుప్రీం కోర్టు లేదా హై కోర్టుల్లో బీసీసీఐపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్ పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్) వేయొచ్చు. అంతేకాకుండా ఇతర క్రికెట్ దేశాలు, ఐసీసీతో ఒప్పందాలపై కూడా పిల్ వేయొచ్చు. రాజ్యాంగంలోని అన్ని అంశాలను, సుప్రీం కోర్టు తీర్పులు, ప్రజల అభిప్రాయాలను క్షుణ్ణంగా పరిశీలించిన మీదట జస్టిస్ చౌహాన్, జస్టిస్ రవి ఆర్ త్రిపాఠిఒ, ఎస్. శివకుమార్, సంజయ్ సింగ్‌లతో కూడిన ప్యానెల్ ఈ నివేదకను తయారు చేసింది.



తాహిర్‌తో అభిమాని గొడవ

దర్యాప్తుకు ఆదేశించిన క్రికెట్ సౌతాఫ్రికా

జొహన్నెస్‌బర్గ్: సౌతాఫ్రికా స్పిన్నర్ ఇమ్రాన్ తాహిర్‌తో భారత జట్టు అభిమానులు గొడవపడుతున్నట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. శనివారమిక్కడ జరిగిన నాలుగో వన్డేలో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్లేయర్స్ డ్రెస్సింగ్ రూమ్‌కు, మైదానంలోకి వేళ్లే మార్గంలో అభిమానుల గ్యాలరీ కూడా ఉంది. అయితే 12వ బ్యాట్స్‌మన్‌గా సహచరులకు డ్రింక్స్ తీసుకెళ్లేటప్పుడు, తిరిగి డ్రెస్సింగ్ రూమ్‌కు వచ్చేటప్పుడు తాహిర్‌ను ఓ అభిమాని వ్యంగంగా మాట్లాడాడు. ఆ అభిమాని మాటిమాటికి అలా చేస్తుండడంతో తాహిర్ డ్రెస్సింగ్ రూమ్ వద్ద ఉన్న ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందికి ఫిర్యాదు చేశాడు. అభిమానిని గుర్తించి స్టేడియం నుంచి బయటికి పంపేందుకు భద్రతా సిబ్బందితో కలిసి తాహిర్ అతని వద్దకు వెళ్లడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అయితే తాహిర్ ఎవ్వరినీ దురుసుగా మాట్లాడడం కానీ, దాడికి పాల్పడటం కానీ జరగలేదని ఆ వీడియోలో స్పష్టంగా తెలుస్తోంది. సోషల్ మీడియాలో వస్తున్నట్టు తాహిర్ దురుసగా ప్రవర్తించలేదని.. ఈ ఘటనలో చిన్నారులెవ్వరూ లేరని సౌతాఫ్రికా టీమ్ మేనేజర్ మహ్మద్ మూసాజే వివరణ ఇచ్చారు. తాహిర్‌పై సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు ఎటువంటి చర్యలు తీసుకోబోదని.. అతని వాదనను బోర్డు విశ్వసిస్తోందని మూసాజె తెలిపారు. ఫేస్‌బుక్‌లో పెట్టిన ఆ వీడియోలో తాహిర్ కొంత మంది అభిమానులతో ఆగ్రహంతో మాట్లాడుతున్నాడు. అందులో ఒకరు టీమిండియా జెర్సీ ధరించి ఉన్నారు. ఇరు వర్గాలూ దాడులకు పాల్పడలేదని మరో అభిమాని తీసిన ఆ వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది.

దేవిందర్, సోనియాలకు స్వర్ణాలు

ఏషియన్ గేమ్స్ అథ్లెటిక్స్ టెస్ట్ ఈవెంట్

జకార్తా: ఏషియన్ గేమ్స్ ఇన్విటేషనల్ అథ్లెటిక్స్ టెస్ట్ ఈవెంట్ తొలి రోజు భారత్‌కు మొత్తం ఎనిమిది (2 స్వర్ణ, 3 రజత, 3 కాంస్య) పతకాలు కైవసం చేసుకుంది. జావెలిన్ త్రోయర్ దేవిందర్ సింగ్ కంగ్ భారత్‌కు తొలి ఆధిక్యాన్ని అందించాడు. కంగ్ 75.85 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానంలో నిలవగా.. శ్రీలంకకు చెందిన రసింగె డెనగమగె 75.39 మీటర్లతో రెండో స్థానం సాధించాడు. భారత్‌కే చెందిన సచిన్ సిల్వాల్ 68.13 మీటర్లతో కాంస్య పతకాన్ని చేజిక్కించుకున్నాడు. మహిళల 400 మీటర్ల ఈవెంట్‌లో భారత్‌కు చెందిన సోనియా బైష్యా పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. తర్వాత పురుషుల 400 మీటర్ల ఈవెంట్‌లో జీతు బేబి రజత పతకాన్ని గెలిచాడు. మహిళల లాంగ్ జంప్‌లో వి. నీన, నయనా జేమ్స్ రజత పతకాలు గెలిచారు. పురుషుల 100 మీటర్ల పరుగు పందెంలో ఎలక్కియాదాసన్ 10.38 సెకన్లతో కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.